ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

జనవరి 2010 వెల : రూ.10



శ్రీరామకృష్ణ ప్రభ

2010

JANUARY

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
31					1	2
3	4	5	6	7	8	9
10	11	12	13	14	15	16
17	18	19	20	21	22	23
24	25	26	27	28	29	30

FEBRUARY

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
	1	2	3	4	5	6
7	8	9	10	11	12	13
14	15	16	17	18	19	20
21	22	23	24	25	26	27
28						

MARCH

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
	1	2	3	4	5	6
7	8	9	10	11	12	13
14	15	16	17	18	19	20
21	22	23	24	25	26	27
28	29	30	31			

APRIL

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
				1	2	3
4	5	6	7	8	9	10
11	12	13	14	15	16	17
18	19	20	21	22	23	24
25	26	27	28	29	30	

MAY

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
30	31					1
2	3	4	5	6	7	8
9	10	11	12	13	14	15
16	17	18	19	20	21	22
23	24	25	26	27	28	29

JUNE

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
		1	2	3	4	5
6	7	8	9	10	11	12
13	14	15	16	17	18	19
20	21	22	23	24	25	26
27	28	29	30			

JULY

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
				1	2	3
4	5	6	7	8	9	10
11	12	13	14	15	16	17
18	19	20	21	22	23	24
25	26	27	28	29	30	31

AUGUST

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
1	2	3	4	5	6	7
8	9	10	11	12	13	14
15	16	17	18	19	20	21
22	23	24	25	26	27	28
29	30	31				

SEPTEMBER

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
			1	2	3	4
5	6	7	8	9	10	11
12	13	14	15	16	17	18
19	20	21	22	23	24	25
26	27	28	29	30		

OCTOBER

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
31					1	2
3	4	5	6	7	8	9
10	11	12	13	14	15	16
17	18	19	20	21	22	23
24	25	26	27	28	29	30

NOVEMBER

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
	1	2	3	4	5	6
7	8	9	10	11	12	13
14	15	16	17	18	19	20
21	22	23	24	25	26	27
28	29	30				

DECEMBER

SUN	MON	TUE	WED	THU	FRI	SAT
			1	2	3	4
5	6	7	8	9	10	11
12	13	14	15	16	17	18
19	20	21	22	23	24	25
26	27	28	29	30	31	

అనంత శక్తి మీలోనే ఉంది, బలహీనులమని భావించకండి.
మీరు ఏమైనా చేయగలరు, దేనినైనా సాధించగలరు. - స్వామి వివేకానంద

With Best Compliments From

CHAIRMAN & MANAGING DIRECTOR

THE KCP LIMITED

KCP కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 67 సంచిక: 1 జనవరి 2010

తమోఘ్నాయ హిమఘ్నాయ శత్రుఘ్నాయామితాత్మనే ।
కృతఘ్నఘ్నాయ దేవాయ జ్యోతిషాం పతయే నమః ॥

ఓ సూర్యదేవా! చీకటిని, మంచును పోగొట్టేవాడవు, ఉపాసకుల శత్రువులను వధించేవాడవు, అమిత తేజస్సు కలవాడవు, దీప్తిమంతుడవు, జ్యోతిర్గణపతివి అయిన నీకు నమస్కారములు. *(ఆదిత్య హృదయం)*

లోపలి పేజీల్లో...

4 సంపాదకీయం
నూతన సంవత్సరం 'నిత్య నూతనం' కావాలంటే...



11 పరమేశ్వరుని పరిరక్షణలో...
ఆ భగవంతుడే ఆధారం

6 గోరుముద్ద
ప్రచండ తాండవనృత్యం

13 ధీరవాణి
యువకులారా! త్యాగశీలురుకండి!!

7 మనశ్శక్తి

14 పరిప్రశ్న

8 పరమహంస మానసపుత్రుడు

15 తులసీ మాహాత్మ్యం

9 దేవీ వైభవం

16 బొమ్మల కథ
కురుక్షేత్రం

శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'లో సభ్యులుగా చేరి ధనదానం చేయాల్సిందిగా మనవి. సభ్యుల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు...........	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు.................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

దాత పేరు	చిరునామా	రూ.
మహారాజ పోషకులు	: డాక్టర్ వి.వి. సుబ్బరాజు, డి.డి. కాలనీ, హైదరాబాద్	10,000
మహారాజ పోషకులు	: శ్రీ ఎస్. జయ నాయక్, విద్యుత్‌నగర్, అనంతపురం (కీ॥శే॥ ఎస్. గాంగే నాయక్ జ్ఞాపకార్థం)	10,000
పోషకులు	: శ్రీ ఆదిత్య & శ్రీమతి ఎస్. జయలక్ష్మి, హైదరాబాద్	1,116
పోషకులు	: డాక్టర్ పి. చంద్రశేఖర్, రిమ్స్, పుట్లంపల్లి, కడప - 516 001	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

ప్రియ భక్తులారా!

యువతరంలో ఆత్మవిశ్వాసాన్ని నింపే యువనాయక స్వామి వివేకానంద స్ఫూర్తివచనాలతో వెలువడుతున్న 'శ్రీరామకృష్ణ ప్రభ'ను రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకూ, కళాశాలలకూ అందించాలని సంకల్పించాం.

శ్రీరామకృష్ణుల, స్వామి వివేకానందుల సందేశాల ఆవశ్యకతను గురించి సుభాష్ చంద్రబోస్ ఒక సందర్భంలో చెబుతూ, "శీలనిర్మాణానికి రామకృష్ణ - వివేకానంద సాహిత్యం కన్నా ఉన్నతమైన సాహిత్యం వేరొకటి లేదు" అని అన్నారు.

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయడానికి మీ ఆర్థిక సహాయాన్ని కోరుతున్నాం. ఈ పథకం కింద రూ. 1500 మొత్తాన్ని జీవిత చందా (20 సంవత్సరాలకు) కట్టినట్లయితే మీరు సూచించిన, లేదా మేము ఎంపిక చేసిన ఒక పాఠశాల/కళాశాలకు 20 ఏళ్ళ పాటు పత్రికను మీ పేరున పంపుతాం. చందాదారుని పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

మీ చందాను ఎమ్.ఓ. / డి.డి./ చెక్కు రూపంలో Ramakrishna Math, Hyderabad పేరున తీసుకొని, Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029 చిరునామాకు పంపవలెను.

స్వామీజీ ఆదర్శాలకు అనుగుణంగా యువతరాన్ని తీర్చిదిద్దడంలో 'శ్రీరామకృష్ణ ప్రభ' చేపట్టిన ఈ పథకానికి చేయూతనందించగలరని ఆశిస్తున్నాం. భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ప్రార్థిస్తూ...

భగవత్సేవలో
స్వామి జ్ఞానదానంద
అధ్యక్షులు

ముఖచిత్రం: ధ్యానయోగి, జ్ఞానయోగి, కర్మయోగి అయిన స్వామి వివేకానంద 1863 జనవరి 12 సంక్రాంతి పర్వదినాన జన్మించారు. స్వామీజీ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతీ సంవత్సరం జనవరి 12న దేశమంతా 'జాతీయ యువజన దినోత్సవం'గా వేడుకలు జరుపుకొంటున్నాం. *(ముఖచిత్రం : 'వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్' సౌజన్యంతో)*

ADVERTISEMENT TARIFF

	MULTI COLOUR	B & W
Fourth Cover	Rs.25,000	-
Second Cover	Rs.20,000	-
Third Cover	Rs.20,000	-
Inside Full Page	Rs.15,000	10,000
Inside Half Page	Rs.10,000	5,000

చందా వివరాలు	ఇండియాలో	విదేశాలలో
విడి ప్రతి	: రూ. 10	-
ఒక సంవత్సర చందా	: రూ. 100	$ 25
మూడు సంవత్సరాలకు	: రూ. 280	$ 55
ఐదు సంవత్సరాలకు	: రూ. 450	$ 85
ఇరవై సంవత్సరాలకు	: రూ. 1500	$ 365

గమనిక : డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.
పంపవలసిన చిరునామా : Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

లోపలి పేజీల్లో...

18 సంక్రాంతి శోభ

20 ఓ మహాత్యాగి ఆత్మకథ
(స్వామి వివేకానంద స్వీయ వచనాల సమాహారం)

22 ప్రాచీన గాథలు : జీవన వికాసం
అంగవికలుడే... అయితేనేం?

24 యువవాణి
నవతరం సందేహాలకు సమాధానాలు

25 దానం

26 నవ్యనినాదాలతో విజయనాదాలు...

28 బ్రహ్మచర్యం

30 నవయుగ కర్త - మహాప్రవక్త

31 వివేకానందుని మాతృభక్తి

33 నా జీవితంలో స్వామి వివేకానంద
ఆ వాక్యాలు 'అమృత తుల్యాలు'

34 సద్గురు శ్రీశేషాద్రి స్వామి

35 అహం వదిలితే ఆ దేవుడే మన చెంత!

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు పైన చిరునామాకు కుడి భాగంలో మీ చందా గడువు ముగిసే నెల వ్రాసి ఉంది. సకాలంలో సొమ్ము చెల్లించి, చందా పొడిగించుకోండి. 'శ్రీరామకృష్ణ ప్రభ' ఆధ్యాత్మిక వెలుగులు మీ ఇంట నిరంతరాయంగా ప్రసరించేలా సహకరించండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నెంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారితే వెంటనే మాకు తెలియపరచి, సహకరించ మనవి.
- పత్రిక ప్రతీ నెల 26వ తేదీన పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపు చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ....

- సర్క్యులేషన్ మేనేజర్

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు.
- సంపాదకులు

SRI RAMAKRISHNA PRABHA, RAMAKRISHNA MATH
Domalguda, Hyderabad - 500 029. Andhra Pradesh
Phone No: 040 - 2766 7799, E-mail : sriramakrishnaprabha@gmail.com

నూతన సంవత్సరం 'నిత్య నూతనం' కావాలంటే...

ప్రతీ జనవరి 1వ తేదీన 'నూతన సంవత్సరం' ఆనందోత్సాహాలతో జరుపుకుంటాం. గడచిన సంవత్సరంలోని చేదు అనుభవాలకు వీడ్కోలు పలుకుతూ, నూతన సంవత్సరం మనకు సకల శుభాలను అందించాలని ఆకాంక్షిస్తాం. చాలా దేశాల్లో ప్రతీ సంవత్సరం ఆఖరి రోజున అర్ధరాత్రి వేళ పాత సంవత్సరానికి ప్రతీకగా ఒక వృద్ధుని బొమ్మను దగ్ధం చేస్తూ 'పాత సంవత్సరానికి వీడ్కోలు, కొత్త సంవత్సరానికి స్వాగతం' అని కోలాహలం చేస్తారు. ఇలా ప్రతీ సంవత్సరం చివరి రోజున పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ వృద్ధుని బొమ్మను దగ్ధం చేయడం, కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించడం ఆచారంగా వస్తోంది.

ఈ విధంగా ప్రతిసారీ గడిచిన సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, నూతన సంవత్సరాన్ని ఆహ్వానించడం కన్నా 'నూతన సంవత్సరం' మన జీవితంలో 'నిత్య నూతనం'గా నిలిచిపోవాలంటే ఏం చేయాలి?

ప్రాపంచికత నుంచి పారమార్థికం వైపు... : మనలో ఉన్న కోరికలు తీరిన వెంటనే మరికొన్ని కొత్త కోరికలు ప్రవేశిస్తాయి. ఈ కోరికల పరంపర సాగేంత వరకూ పాత కోరికలకు స్వస్తి చెప్పడం, కొత్త కోరికలను స్వాగతించడం సహజం. ఈ కోరికల పరంపర నుంచి బయటపడాలంటే కోరికలనే వృద్ధుని బొమ్మను వివేకమనే అగ్నితో దగ్ధం చేయాలి. అప్పుడే మన జీవితాలు నిత్యనూతనం, ప్రశాంతమయం అవుతాయి.

విషయాశామహాపాశాద్యో విముక్తః సుదుస్త్యజాత్ ।
స ఏవ కల్పతే ముక్త్యై నాన్యః షట్ శాస్త్ర వేద్యపి ॥ *(వివేకచూడామణి)*

'విషయ పాశం నుంచి విముక్తి పొందినవాడే శాశ్వతానందానికి అర్హుడు కానీ ఎంత పండితుడైనా విషయవాంఛలుంటే అర్హుడు కాలేడు'. కాబట్టి మనం శాశ్వతానందాన్ని పొందడానికి ప్రాపంచిక వాంఛలను వదిలి పారమార్థిక మార్గంలో పయనిద్దాం.

కోరికల్ని తీర్చే కల్పతరువు : మనకు నిత్యనూతన జీవితాన్ని ప్రసాదించడానికి శ్రీరామకృష్ణులు 'నూతన సంవత్సరం– జనవరి 1వ తేదీన కల్పతరువు'గా వెలిశారు. అయితే మన పురాణాల్లోని కల్పతరువుకీ, ఈ కలియుగ కల్పతరువుకీ వ్యత్యాసం ఏమిటి? పురాణాల్లో వర్ణించిన కల్పతరువు మనం ఏది కోరితే అది ప్రసాదిస్తుంది. అలా మనం కోరినవన్నీ లభించడం వల్ల విచక్షణాజ్ఞానాన్ని కోల్పోయి, భోగాలకు బానిసలమయ్యే ప్రమాదం ఉంది. మనకు శ్రేయస్సునిచ్చేది ఏదో, ప్రేయస్సునిచ్చేది ఏదో తెలియని అలాంటి వివేక రహిత స్థితి మన వినాశనానికి దారి తీస్తుంది. 'అవసరానికి మించి అధికంగా ఆశించి తన వినాశనానికి తానే కారకుడయ్యాడు' అని శ్రీరామకృష్ణులు వివరించిన 'కల్పతరువు – బాటసారి' కథను ఒక్కసారి గుర్తుచేసుకుందాం:

"ఒకసారి ఓ బాటసారి అడవి మార్గంలో పయనిస్తున్నాడు. అలా ఎండలో నడిచి వెళుతూ అలసిపోవడం వల్ల దారి పక్కన ఉన్న చెట్టు (కోరిన కోరికలను తీర్చే కల్పతరువు) క్రింద సేద తీరుదామని కూర్చున్నాడు. అలా కొంతసేపు కూర్చున్న తరువాత 'దాహం వేస్తోంది. త్రాగడానికి నీళ్ళు ఉంటే బాగుండును' అని అనుకున్నాడు. వెంటనే అక్కడ నీళ్ళ కుండ కనపడింది. నీళ్ళు త్రాగి దాహం తీర్చుకున్న తరువాత 'ఆకలి వేస్తోంది. తినడానికి ఏమైనా ఉంటే బాగుండును' అని అనుకున్నంతలో అక్కడ పంచభక్ష్యపరమాన్నాలు తయారుగా ఉన్నాయి. భోజనం అయ్యాక కాస్త నిద్రపోదాం అనుకున్నాడు. వెంటనే మెత్తని పరుపుతో చక్కని మంచం

వచ్చేసింది. 'పవళించే ముందు పాదసేవ చేసే సేవకురాలు ఉంటే ఎంత బాగుండునో' అని అనుకోగానే సేవకురాలు ప్రత్యక్షమైంది. అనుకున్నవన్నీ తక్షణమే సమకూరుతున్నాయి. 'ఈ సమయంలో పులి వస్తే...' అని అనుకున్నాడు. అంతలోనే పులి అక్కడకు రానే వచ్చింది. అలా పులి ఆగమనం బాటసారి అంతిమ యాత్రకు దారితీసింది."

సంసారయానం అడవిలో ప్రయాణం లాంటిది. ఎండలో అలసిపోవడం అంటే సంసార తాపంలో అలసిపోవడం. ఇలా సంసార తాపత్రయంలో అలసిపోయిన వ్యక్తి ప్రశాంతత కోసం చెట్టు నీడ అనే భగవంతుడి పాదపద్మాలను ఆశ్రయిస్తాడు. కల్పతరువుని ఆశ్రయించిన బాటసారికి తల దాచుకోవడానికి

నీడ, దాహం తీర్చుకోవడానికి నీళ్ళు, ఆకలి తీర్చుకోవడానికి ఆహారం – మనిషి ప్రశాంతంగా జీవించడానికి అవసరమైనవన్నీ సమకూరాయి. అయితే, ఉన్న దానితో సంతృప్తిచెంది సంతోషంగా జీవించడం కేవలం పశుపక్ష్యాదులకే సాధ్యం కానీ, మనిషికి మాత్రం సాధ్యం కాదు కదా! కోరికల పరంపరలో విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయిన వ్యక్తి, కథలోని బాటసారిలా ఉన్నదానితో సంతృప్తి చెందక భోగ వాంఛలవైపు పరుగు తీస్తాడు. అలా ఎప్పుడైతే మనిషి భోగాలవైపు పరుగులు తీస్తాడో అప్పుడు కామక్రోధాలనే పులి అతణ్ణి హరించి వేస్తుంది. కల్పతరువుని ఆశ్రయించిన బాటసారి కోరికలే గుర్రాలై అతని వినాశనానికి దారితీశాయి. కాబట్టి కోరికల పరంపరలో కొట్టుకుపోకుండా జాగ్రత్త వహించాలి.

శ్రేయస్సునిచ్చే కల్పతరువు : కలకత్తాలో ఉన్న కాశీపూర్ ఉద్యానంలో 1886 జనవరి 1వ తేదీన శ్రీరామకృష్ణులు భక్తుల పాలిట కల్పతరువు అయ్యారు. అయితే ఈ కలియుగ కల్పతరువుని ఆశ్రయిస్తే మనం కోరిన కోరికలన్నీ తీర్చడం కన్నా మనకు శ్రేయస్సునిచ్చే వరాలనే ప్రసాదిస్తుంది.

1. ప్రాపంచిక కోరికల వలన ఎన్నటికీ శాశ్వతానందం పొందడం సాధ్యం కాదని తెలిసిన శ్రీరామకృష్ణులు భక్తులకు తాత్కాలిక సుఖాల్ని ఇచ్చే వరాల్ని ప్రసాదించకుండా శాశ్వతానందాన్ని పొందేలా 'మీ అందరిలో ఆధ్యాత్మిక చైతన్యం కలుగుగాక!' అని ఆశీర్వదించారు.

హరన్‌చంద్ర దాస్ అనే భక్తుడు శ్రీరామకృష్ణులను 'నా ఇష్టదైవ రూపాన్ని సంపూర్ణంగా దర్శించేలా ఆశీర్వదించండి' అని ప్రార్థించాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు అతని శిరస్సును స్పృశించగానే హరన్‌చంద్ర తన హృదయంలో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న తన ఇష్టదైవ సంపూర్ణ రూపాన్ని దర్శించాడు.

2. శ్రీరామకృష్ణుల్ని ఎవరైనా ప్రాపంచిక ప్రయోజనాల కోసం కోరికలను కోరితే వాటిని నెరవేరుస్తారు. కానీ ధర్మమార్గంలో జీవించేలా వారికి సద్బుద్ధిని ప్రసాదించేది కూడా ఆయనే.

ఉపేంద్రనాథ్ అనే భక్తుడు శ్రీరామకృష్ణులతో 'నాకు ధనం కావాలి' అని కోరాడు. అందుకు శ్రీరామకృష్ణులు 'నీకు సమృద్ధిగా ధనం లభిస్తుంది' అని దీవించారు. ధనాన్ని ఆశించడమంటే ప్రాపంచిక వాంఛలు ఉన్నట్లే కదా! మరి శ్రీరామకృష్ణులు ఉపేంద్రనాథ్ కోరికను ఎందుకు నెరవేర్చారు అనే సందేహం మనలో కలుగుతుంది. కానీ ధన సముపార్జన వలన అతడు భోగలాలసుడు కాడని శ్రీరామకృష్ణులకు తెలుసు. నిజంగానే ఉపేంద్రనాథ్ ధనవంతుడైనప్పటికీ ఆధ్యాత్మిక జీవితాన్ని గడుపుతూ సత్కర్మలకూ, సాధుసేవలకూ ధనాన్ని వినియోగించేవాడు. కాబట్టి ప్రాపంచిక సంపదలు ఎన్ని ఉన్నా శ్రీరామకృష్ణులను ఆశ్రయిస్తే మనల్ని సన్మార్గంలోనే నడిపిస్తారు అనడానికి ఉపేంద్రనాథ్ జీవితం మనకు నిదర్శనం.

3. ఒకవేళ కోరిన కోరికల వల్ల ఆపదలు సంభవిస్తే వాటి నుంచి రక్షించి మనకు శుభాన్నే కలుగజేస్తారు శ్రీరామకృష్ణులు.

వైకుంఠనాథ్ అనే భక్తుడు దివ్యభావావస్థలో నిరంతరం ఉండేలా ఆశీర్వదించమని శ్రీరామకృష్ణులను ప్రార్థించాడు. అతని మనస్సు ఇంకా పవిత్రం కాలేదనీ, దివ్యభావావస్థలను అనుభవించడానికి అతడు ఇంకా అర్హుడుకాడనీ గ్రహించిన శ్రీరామకృష్ణులు వైంకుఠనాథ్ కోరికను తీర్చడానికి ముందు సమ్మతించలేదు. కానీ అతను మరీ మరీ వేడుకోవడం వల్ల శ్రీరామకృష్ణులు అతని ఛాతీని స్పృశించారు. వెంటనే అతను శ్రీరామకృష్ణుల దివ్యమంగళ రూపాన్ని సర్వత్రా దర్శించసాగాడు. సర్వవేళలా ఆ దివ్యానుభూతుల్ని అనుభవించలేక వైకుంఠనాథ్‌కి మతిభ్రమ కలిగే పరిస్థితి వచ్చింది. శ్రీరామకృష్ణులు అతని మానసిక స్థితిని గ్రహించి మరలా బాహ్యస్మృతికి వచ్చేలా చేశారు.

మనం కోరిన కోరికలు ఆధ్యాత్మికపరమైనవైనా, లౌకిక పరమైనవైనా అవి మనకు శుభాల్ని చేకూర్చేవిగా మలచే శ్రీరామకృష్ణులు నిజంగా 'శ్రేయస్సునిచ్చే కల్పతరువు' అని అనడంలో సందేహం లేదు.

ప్రాపంచిక వాంఛావలయంలో చిక్కుకుపోయి, సంసార తాపంలో దగ్ధమై పోకుండా ఈ నూతన సంవత్సరం నిత్య నూతనం కావడానికి నిత్యకల్పతరువైన శ్రీరామకృష్ణుల్ని ఆశ్రయిద్దాం. మనకు ఎల్లవేళలా శ్రేయస్సునిచ్చే వరాల్ని ప్రసాదించమని ప్రార్థిద్దాం. ❖

ప్రచండ తాండవనృత్యం



ఈ మధ్య ఒక 'ఇంజనీరింగ్' కళాశాలలో 'వ్యక్తిత్వ వికాసం' కార్యక్రమం జరిగింది. ప్రశ్నోత్తర సమయంలో ఒక విద్యార్థి లేచి నిలబడి, "స్వామీజీ! 2012లో అంతా అంతమై పోతుందటగదా! ఎందుకండీ ఈ నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం. హాయిగా లైఫ్ ఎంజాయ్ చెయ్యాలి" అన్నాడు. అది వినగానే తోటి విద్యార్థులందరూ ఉత్సాహంగా చప్పట్లు కొట్టారు. వారు శాంతించగానే ఆ స్వామి ఇలా బదులిచ్చారు: "నాయనా! 2012 దాకా మనం బతకాలి కదా! అందుకే కావాలి 'వ్యక్తిత్వ వికాసం'."

ఏమిటీ పిరికితనం? ఉక్కు నరాలు, ఇనుప కండరాలు చచ్చుబడిపోయాయా? అదిగో వినండి స్వామి వివేకానంద సింహగర్జన: "మృత్యువు మధ్య మనం శాశ్వత జీవితం గడుపుతున్నాం. తలచిన ప్రతి తలపూ నిలిచి ఉంటుంది. అవి స్వయంగా రూపుదాల్చాలని వాటంతట అవి రూపు దాల్చే వరకూ, అనుక్షణం నిరంతరాయంగా ప్రయత్నిస్తున్నాయి. అవి అభివ్యక్తమయ్యే వరకూ పెనుగులాడుతూనే ఉంటాయి. అణచి వేయాలని ఎంత ప్రయత్నించినా వాటిని అంతం చేయలేం. దేనినీ వినాశనం చేయలేం." *(వివేకానంద లేఖావళి-277)*

సృష్టి, స్థితి, లయ - ఉదయం, మధ్యాహ్నం, రాత్రి - ఒక్క క్షణం కూడా విశ్రాంతి లేని కాలచక్రం. దీని మీద పూర్తి పట్టు సాధించిన స్వామీజీ ఇలా అంటున్నారు: "చావడానికి తీరికలేదు - అనే బెంగాలీ సామెత ఒకటుంది. నేను ఆ విధంగా పనిచేస్తున్నాను... నిరంతర కృషితో నేను నిజంగా అలసి పోయాను. నేను పడినంత శ్రమ మరి ఏ హైందవుడైనా పడివుంటే రక్తం కక్కుకొని ఏనాడో మరణించి ఉండేవాడు."

(వివేకానంద లేఖావళి - 265)

ఆవలిస్తే... కాదు - ఆవలించకుండానే పేగులు లెక్కపెట్టే మేధావులు చాలా మంది మనదేశ చరిత్ర, సంస్కృతి తెలుసుకునే ప్రయత్నం చేయరు. పాశ్చాత్యులు మిడిమిడి (అ)జ్ఞానంతో వ్రాసిన పుస్తకాలే వీరికి వేదాలు. అందుకే స్వామీజీ ఇలా అంటారు:

"హిందువులు తమ గత చరిత్రను ఎంత ఎక్కువగా తెలుసుకుంటే వారి భవిష్యత్తు అంత ఉజ్వల స్థితిని పొందుతుంది... మన ఉపనిషత్తుల్లోనూ, పవిత్ర గ్రంథాల్లోనూ, పురాణాల్లోనూ నిబిడీకృతమై ఉన్న అద్భుత సత్యాలని సేకరించి దేశమంతటా విస్తరింపజేసేలా ప్రసారం చేయడం మన ప్రధాన కర్తవ్యం. మహర్షులను ఆరాధించే సంస్కృతిని మనం ప్రవేశ పెట్టాలి. నిత్య సత్యాలని సాధించిన మహాత్ములను ఆదర్శ మూర్తులుగా మన ప్రజలకు పరిచయం చేయాలి".

"నేను నా మనస్సులో ఉన్న ప్రణాళికలను మీకు విశదీకరించడానికి వచ్చాను. మీరు నా బిడ్డల్లాంటివారు. మీరు వాటిని ఆమోదిస్తే మనమందరం సమిష్టిగా కృషి చేద్దాం. అలాగాక నన్ను ఈ దేశం నుండి మీరు బహిష్కరింపదలిస్తే, నేను మళ్ళీ తిరిగి వచ్చైనా 'మనం మునిగి పోతున్నాం' అని హెచ్చరిస్తాను. నేను మీతో కలిసి పనిచేయడానికే వచ్చాను. మునిగితే అందరం కలిసి మునుగుదాం!"

"ఇక సెలవు! ఇక మిమ్మల్ని బాధించను. మీ అందరికీ శుభం కలుగు గాక! కొన్ని సమయాల్లో మీకు నేను కొంత సేవ చేశానని భావిస్తే - సంతోషం. గురుదేవులు ఆదేశించిన విధి నిర్వహణలో నా శక్తి వంచన లేకుండా - చెడో, మంచో- ప్రయత్నం చేశానని సంతోషిస్తున్నాను. నా గురించి మీరెంతమాత్రం కలత చెందకండి. ఏ మానవమాత్రుడి నుండీ, ఏ దేశం నుండీ నాకు సహాయం అవసరం లేదు. కాబట్టి ఇక సెలవు! భగవంతుడు మీ అందరినీ సదా ఆశీర్వదించుగాక!" *(వివేకానంద లేఖావళి - 275)*

ఇదే మన స్వామీజీ - ఆ మహాయోగి పుంగవుని ప్రచండ తాండవ నృత్యం. మనం భయపడాల్సింది '2012'కు కాదు. మనలోని రాగద్వేషాలు, స్వార్థం, సంకుచితత్వం, సోమరితనం, పిరికితనం-భయపడాల్సింది, బయటపడాల్సిందీ వీటి నుండే! అప్పుడే నిజమైన సుఖశాంతులు మన సొంతమవుతాయి. స్వామి వివేకానందకు మనం చెప్పే 'జేజే'లు సార్థకమవుతాయి. ❖

మనశ్శక్తి

– స్వామి జ్ఞానదానంద

మనిషి మనస్సు అనేక రకాల శక్తుల కోశాగారం. సాధారణంగా మన మనస్సుకుండే అపారమైన శక్తిని మనం అంచనా వెయ్యలేం. ఎందుకంటే మామూలుగా మనస్సు చంచలమైనది. నిలకడ లేనిది. మన మనస్సు ఏకాగ్రమై నప్పుడు దానికున్న శక్తి ఏమిటో మనకు తెలుస్తుంది. విజ్ఞాన రంగంలోని ప్రతీ పరిశోధనా మనస్సును ఏకాగ్రపరిచి చేసిన కృషికి ఫలితమే! అందుకే జీవితంలో ఏ రంగంలోనైనా సాఫల్యం పొందాలంటే ముందుగా మనస్సును ఏకాగ్రం చేయాలి. మనం మనస్సును ఏకాగ్రపరచాలని ప్రయత్నం చేస్తున్నప్పుడు ప్రారంభంలో ఇంకా చంచలమై పోయినట్లు కనిపిస్తుంది. దానితో భయపడిపోయి ఆ ప్రయత్నాన్ని విరమించుకుంటాం. అయితే మనస్సు స్వభావమే అది. అలా ప్రయత్నం చేస్తూ ఉంటే మనకు మనస్సు యొక్క అసలైన స్వరూపం అవగత మవుతుంది.

మన ఆలోచనల నిరంతర ప్రవాహమే మనస్సు. పై నుంచి కిందకు ప్రవహిస్తున్న నీటి ధారను ఊహించండి. పై నుంచి చూస్తే దాని వేగం గురించి మనకు తెలియదు. కానీ ఆ ధారను మనం దేనితోనైనా ఆపడానికి ప్రయత్నిస్తే దాని వేగం గురించి మనకు తెలుస్తుంది. కట్టలు తెగిపోయినప్పుడు తెలుస్తుంది ఆ నీటి ప్రవాహానికి ఎంత తీవ్రత ఉందో! అలాగే మన మనస్సును ఏకాగ్రం చేసుకోవడం కూడా. ఈ ప్రయత్నంలో మనస్సు మొదట ఇంకాస్త విచలితమవుతుంది. ఆ సమయంలో "ఇంతకు మునుపు మనస్సు ఇంత చంచలంగా లేదు" అనుకుంటాం. ఒక సరోవరంలోని నీరు నిర్మలంగా, స్వచ్ఛంగా కనిపిస్తుంది. అయితే దాని అడుగున అంతా బురద ఉంటుంది. ఒక చిన్న రాయి నీటిలోకి విసిరితే చాలు, నీరు నెమ్మదిగా బురద రంగులోకి మారుతుంది. మనం ఆ సరోవరంలోని బురదను పైకి తీసి సరోవరాన్ని శుభ్రం చేద్దామనుకుంటే – బురద తీస్తున్న కొద్దీ ఆ నీరు బురద రంగులోకి మారుతుంది. అప్పుడు ఇంతకు ముందే నీరు బాగుండేది, సరస్సులో నీరు ఇంత బురదగా ఉండేది కాదు అనిపిస్తుంది. బురద తీయడం మానేస్తే మళ్ళీ నీరు నిర్మలం అయిపోతుంది. బురద అడుగుకు చేరిపోతుంది. అయితే ఈ నిర్మలత్వం శాశ్వతం కాదు. మళ్ళీ చిన్న రాయి దానిలో వెయ్యగానే బురద మళ్ళీ పైకి వస్తుంది.

నీరు కుళ్ళు అయినా ఫరవాలేదనుకొని, అడుగున ఉన్న బురద అంతా తీసేస్తే ఒక రోజు అందులో ఉన్న బురద అంతా పోతుంది. అప్పుడు నీరు శాశ్వతంగా శుభ్రమవుతుంది. అడుగున బురద లేదు కనుక, అప్పుడు అందులో రాయి కాదు కదా, ఏనుగు దిగినా కూడా నీళ్ళు స్వచ్ఛంగానే ఉంటాయి.

మన మనస్సు కూడా ఒక సరస్సు లాంటిదే! దాని అడుగు జన్మ జన్మల చెడు సంస్కారాలతో నిండి ఉంటుంది. పై నుంచి నిర్మలంగా ఉన్నట్లుంటుంది. కానీ ఒక చిన్న సంఘటన, చిన్న ఆలోచన, లేక చిన్న మాట, మన మనస్సులో ఉన్న కుళ్ళును బయట పెడుతుంది. జపధ్యానాల లాంటి సాధనలతో మనస్సులో పేరుకున్న కుళ్ళును పోగొడదామని ప్రయత్నించి నప్పుడు సరోవరంలో నీటి లాగే మనస్సు చాలా అల్లకల్లోలం అయిపోతుంది. ఎందుకంటే ఆ సమయంలో మన మనస్సులో విపరీతమైన ఆలోచనలు వస్తూ ఉంటాయి. అయితే దానికి భయపడి మన ప్రయత్నం మానకూడదు. మనం సరి అయిన మార్గంలో వెళు తున్నామనే నమ్మకంతో ఉండాలి. సరోవరం లాంటి మనస్సు శుభ్రపడుతున్న దనుకోవాలి. మన ప్రయత్నం మానకుండా ఇంకా తీవ్రంగా కృషి చెయ్యాలి. అలా క్రమక్రమంగా మన మనస్సు మునుపటి కన్నా చాలా బాగా అయింది అని మనకే తెలుస్తుంది. అప్పుడు అలాంటి నిర్మలమైన మనస్సును సులువుగా ఏకాగ్రం చేసుకోగలం. ఎక్స్‌రేలు ఏ విధంగా ధాతు పొరల్ని ఛేదించి వెళ్ళగలవో అలాగే ఏకాగ్రత గల మనస్సు ఆధ్యాత్మిక రహస్యాలన్నీ ఛేదించగలదు. ఏకాగ్రచిత్తం గల వ్యక్తి ఏ విషయం గురించి ఆలోచించినా తక్షణమే దాని సమాధానం కూడా కనుక్కోగలడు. అలా ఏకాగ్రమైన మనస్సు గల వ్యక్తి ఏ రంగంలో అయినా తన అస్తిత్వాన్ని నిరూపించుకోగలడు. ❖

పరమహంస మానసపుత్రుడు

రాఖాల్ (కాలాంతరంలో స్వామి బ్రహ్మానంద) 1881లో శ్రీరామకృష్ణులను మొదటిసారి దర్శించారు. శ్రీరామకృష్ణులు రాఖాల్‌ను తన మానస పుత్రుడనీ, ఈశ్వరకోటి అనీ, వ్రజభూమిలో నివసించిన శ్రీకృష్ణుని సఖుడు అనీ, రాఖాల్‌కు రాజ్యాన్ని నిర్వహించే సామర్థ్య ముందనీ అనేవారు. శ్రీరామకృష్ణులు చెప్పిన ఈ నాలుగు విషయాలూ స్వామి బ్రహ్మానందజీ జీవితంలో అక్షరాలా నిజమయ్యాయి.

ఒకనాడు శ్రీరామకృష్ణులు, రాఖాల్‌ను తమ కాళ్ళు ఒత్తమన్నారు. రాఖాల్ అందుకు ఇష్టపడలేదు. అప్పుడు గురుమహరాజ్ "సాధువులకు సేవ చేస్తే అద్భుతమైన ఫలితాలుంటాయి" అన్నారు. రాఖాల్ గురుదేవుల కాళ్ళు ఒత్తడం ప్రారంభించాడు. ఏం ఆశ్చర్యం! ఆయనకు ఆ క్షణంలోనే గొప్ప ఆధ్యాత్మిక అనుభూతి కలిగింది. కాళీమాత దర్శనం కలిగింది! జగన్మాత ఏడు-ఎనిమిది సంవత్సరాల బాలికలా కనపడింది. ఆ బాలిక శ్రీరామకృష్ణుల మంచం చుట్టూ రెండు మూడు మార్లు తిరిగి, ఆయన శరీరంలోకి ప్రవేశించింది. స్వామి బ్రహ్మానందజీకి తమ జీవితకాలంలో ఇలాంటి దివ్యదృశ్యాలు అనేకం గోచరించాయి.

స్వామి బ్రహ్మానందజీ దక్షిణ భారతదేశంలోని చెన్నై, కంచి, మదురై, రామేశ్వరం మొదలైన యాత్రా స్థలాల్ని సందర్శించారు. స్వామి బ్రహ్మానందజీతో కలసి స్వామి రామకృష్ణానందజీ (శశి మహారాజ్) కూడా దక్షిణదేశ యాత్రకు వెళ్ళారు. మీనాక్షీ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని దగ్గర నుండి దర్శించుకోవాలనే కోరిక శశిమహరాజ్‌కు కలిగింది. అక్కడి సంప్రదాయం ప్రకారం గర్భ గుడిలోకి అందరికీ ప్రవేశం లభించదు, కేవలం అర్చకులకే ప్రవేశం! ప్రవేశద్వారం దగ్గర స్వామి రామకృష్ణానందజీ "ఆళ్వార్, ఆళ్వార్!" అంటూ బ్రహ్మానందజీ చెయ్యి పట్టుకుని గబగబ లోపలకి తీసుకుని వెళ్ళారు. వారిద్దరిలోనూ ఉట్టిపడుతున్న దైవీ శక్తి వల్లనో, లేక వారిరువురినీ ఆళ్వార్లని (వైష్ణవసాధువులని) భావించడం వల్లనో అర్చకులు వారిని ఆపలేదు.

1920లో క్షీరోద్ ప్రసాద్ అనే పండితుడు స్వామి బ్రహ్మానందజీతో "శ్రీరామకృష్ణులు జీవించి ఉండగా ఆయనను దర్శించే అవకాశం వచ్చినా దర్శించలేక పోయాను. గురుదేవుల దర్శనార్థం దక్షిణేశ్వరం బయల్దేరి ఆలంబజారు వరకూ వెళ్ళాను. అప్పుడు హఠాత్తుగా నా మనస్సులో - ఎదుటి వారి మనస్సులో ఏముందో గురుమహరాజ్‌కు తెలుస్తుంది. అందువల్ల నా మనస్సులోని రహస్యాన్ని వారు బహిరంగంగా చెబితే అందరి ముందూ నా పరువు పోతుందనే భయంతో వెనక్కి తిరిగి వెళ్ళిపోయాను" అంటూ బాధపడ్డారు. ఇది విన్న స్వామి బ్రహ్మానందజీ అతడిని ఊరడిస్తూ, "ఆలంబజార్ వరకూ వెళ్ళారు కదా! మరేమిటి, ఇక గురుదేవుల్ని చూసినట్టే అనుకోండి" అన్నారు. "లేదు మహరాజ్! నేనాయనను చూడలేదు" అంటూ తన దురదృష్టాన్ని తలచుకొని, మనస్సులో బాధపడుతూ, తల దించుకొని నిలబడ్డాడు. కాసేపయ్యాక తలెత్తే సరికి స్వామి బ్రహ్మానందజీ స్థానంలో అతడు సాక్షాత్తూ శ్రీరామకృష్ణులను దర్శించాడు!

శ్రీరామకృష్ణుల కార్యనిర్వహణ కోసం అవతరించి, దాని కోసమే జీవించి, అందరూ శ్రీరామకృష్ణుల అడుగు జాడలలోనే జీవించడానికి తోడ్పడ్డారు స్వామి బ్రహ్మానందజీ! ❖

(తిథి ప్రకారం- జనవరి 17న శ్రీరామకృష్ణ పరమహంస సన్న్యాస శిష్యులైన స్వామి బ్రహ్మానంద జయంతి)

ప్రవచనం: **శ్రీ సామవేదం షణ్ముఖశర్మ** విలేఖనం: **శ్రీమతి ఎస్. శేషు**

(...గత సంచిక తరువాయి)

ఒకసారి వ్యాసదేవుణ్ణి జనమేజయుడు "ఏ దేవతను ఉపాసించడం చేత అన్ని సిద్ధులూ లభిస్తాయో అది చెబుతారా" అని అడిగాడట. అప్పుడాయన ఇలా అన్నాడు: "ఇదే ప్రశ్నతో నేను తీర్థయాత్రలు చేస్తూ నైమిశారణ్యం చేరాను. అక్కడ ఋషులందరూ సమావేశమై ఉన్నారు. అప్పుడు జమదగ్ని మహాముని "ఇహమూ పరమూ కూడా ఇవ్వగలిగే శక్తి ఎవరు" అని అడిగిన ప్రశ్నకు "సర్వాభీష్ట ప్రదాయిని అయిన జగదంబిక" అని లోమసుడు అనే మహర్షి బదులు ఇచ్చాడట. జమదగ్ని మొదలైన ఋషులందరికీ లోమస మహర్షి ఇంకా ఇలా చెప్పాడు: "సత్యతపుడనే గొప్ప మహర్షి ఉన్నాడు. ఆయనంటే అందరికీ గౌరవం. ఆయన వయస్సెంతో కూడా మాకెవరికీ తెలియదు; అంత పెద్ద వాడు. మా అందరి చేతా గౌరవింపబడదగినంత శక్తి ఆయనకు ఎలా వచ్చిందంటే... అది అమ్మ బీజజప మహిమ. అదెలా అంటే... కోసల దేశంలో దేవదత్తుడనే విప్రుడు ఉండేవాడు. ఆయనకు సంతానం లేదు. "నా దాకా వచ్చిన వేదధర్మం నా తరువాత తరాలకి అంద జేయడం, నా పితృదేవతల్ని తరింపజేయడం కోసం సత్సంతానం కావాలి" అని తపన పడి, దేవదత్తుడు తమసానదీ తీరంలో యజ్ఞం చెయ్యడానికి సంకల్పించాడు. తానే బ్రహ్మవేత్త అయి యజ్ఞం చేస్తూ, పలువురు వేదవేత్తల్ని పిలిపించాడు. ఆ యజ్ఞానికి వచ్చిన వారు సామాన్యులు కారట, మహా ఋషితుల్యులైన పండితులు. యజ్ఞంలో బ్రహ్మగా కూర్చునే వారిది ప్రధాన బాధ్యత; సుహుత్రుడు బ్రహ్మగా వచ్చాడు, అధ్వర్యుడుగా యాజ్ఞవల్క్య మహర్షి, హోతగా సాక్షాత్తూ బృహస్పతి వచ్చారు, ప్రస్తోతగా వ్యాసుని శిష్యుడూ, ఋగ్వేదాన్ని వ్యాప్తి చేసినవాడూ అయిన పైలుడు వచ్చాడు; సామగానం చెయ్యవలసిన ఉద్గాతగా గోభిలుడు వచ్చాడు. అలా యజ్ఞం జరుగుతుండగా సామగానం చేసే వంతు వచ్చింది. సామవేద మంత్రాల్లో ఉన్న రథంతర సామాన్ని గానం చేస్తున్న గోభిలునికి శ్వాసకు సంబంధించిన అవరోధం ఏర్పడి, మంత్రం చెప్పే టప్పుడు స్వరలోపం ఏర్పడింది. దానికి తట్టుకోలేక దేవదత్తుడు బాధపడి "నువ్వు స్వరలోపం చేస్తున్నావు, దాని వల్ల నా యజ్ఞంలో లోపం జరుగుతుంది" అని కోపగించుకున్నాడట (బ్రహ్మస్థానంలో ఉన్నవారి మీద అంత తేలికగా కోపగించు కోకూడదు. తగిన విధంగా చెప్పాలి.) అతను మందలించగానే, తనను 'తప్పు పట్టాడు కదా' అని గోభిలునికి దుఃఖం వచ్చింది. అప్పుడు "పుత్రకామార్థివై యజ్ఞం చేస్తూ బ్రహ్మస్థానంలో ఉన్న నన్ను నిందించావు, నన్ను నిందించావంటే విద్యను నిందించావు. విద్య అంటే సరస్వతి. సరస్వతిని నిందించావు కనుక నీకు మూర్ఖుడైన పుత్రుడు పుడతాడు" అని శాపం ఇచ్చాడు. విప్రశాపం వృథా పోదు, దేవదత్తుడు భయపడి, "తప్పు చేశాను, తొందరపడ్డాను క్షమించు" అంటూ ఆయన పాదాల మీద పడ్డాడు. వెంటనే గోభిలుని కోపం పోయింది. ఈ విధంగా పాదాల మీద పడగానే ఆ మహర్షి అనుగ్రహించాడట". ఉత్తముల కోపం ఇలాగే ఉంటుంది.

ఉత్తమే క్షణకోపస్స్యాత్ మధ్యమే ఘటికా ద్వయమ్ ।
అధమేస్యాదహోరాత్రం పాపిష్ఠే మరణాంతకమ్ ॥

కోపం రావడం మానవ స్వభావం. ఉత్తముడికి కోపం వస్తే క్షణకాలం ఉంటుందట, మధ్యముడికి కోపం వస్తే రెండు ఘడియలు ఉంటుందట, అధముడికి కోపం వస్తే రోజంతా ఉంటుందట, అధమాధముడికి జీవితాంతం కోపం ఉంటుందట.

కోపం వచ్చినవాడు అస్పృశ్యుడట. అందుకే యజ్ఞాదులు చేసినా, పూజలు చేసినా కోపం వస్తే వెంటనే స్నానం చేసి రావాలి అంటారు. కోపం, విసుగు, చిరాకు వచ్చినపుడు పూజ చెయ్యకూడదు. ఉత్తములకు వచ్చిన కోపాన్ని వెంటనే నిగ్రహిస్తారు. అందువల్ల ఉత్తములకు కోపం స్వభావం కాదు. సంస్కారవంతుడికి కోపం వచ్చినా, వెంటనే తగ్గుతుంది. దీనికి ఉదాహరణ... జలం స్వభావతః శీతం = అంటే నీరు స్వభావసిద్ధంగా చల్లగా ఉంటుంది, కానీ అగ్ని తగలడం వల్ల నీరు వెచ్చబడుతుంది. అగ్నిని దూరం చేస్తే ఆ వేడి నీరు మళ్ళీ చల్లబడుతుంది. సంస్కారవంతులకు వచ్చే కోపం అలాంటిదన్నాడు వ్యాసుడు.

అలాగే కోపం వచ్చినా, దేవదత్తుడు తన పాదాల మీద పడగానే, మహానుభావుడైన గోభిలుడు తగ్గి, "సరే! మూర్ఖునిగా పుట్టినా కొంతకాలానికి అతడే మహానుభావుడవుతాడు" అన్నాడట. కొంతకాలానికి దేవదత్తునికి పుత్రోదయం జరిగింది. ఆ పుత్రుడు బాల్యం నుండీ అజ్ఞానం యొక్క పరాకాష్ఠ చూపిస్తూనే ఉన్నాడు. సరస్వతి అనుగ్రహం లేని వాళ్ళు ఎలా ఉంటారో చూపిస్తున్నాడు. పలుకు రావడం లేదు. ఉపనయనాది సంస్కారాలు చేస్తే ఆచమనం చెయ్యడం కూడా రాలేదట. భవిష్యత్తు బాగుంటుందని వరం పొందినా, ప్రస్తుతం ఉన్నదాన్ని చూసి వేదన భరించలేకుండా ఉన్నారు తల్లితండ్రులు. ప్రతీ ఒక్కరూ మీ అబ్బాయి పండితపుత్రుడు ('పండిత పుత్రః పరమశుంఠః') అనసాగారు. అందుకు ఈయనకు మహావేదన కలిగింది. "నేను వేదపండితుణ్ణి, వీడికి గాయత్రీ మంత్రం, జపం, తపం, అధ్యయనం, సంధ్యావందనం అంటే తెలియవు" అని బాధపడ్డాడు.

తండ్రి అయిన దేవదత్తుడు బుద్ధిహీనుడైన ఆ పిల్లవాడికి పెట్టిన పేరు ఉతక్ష్యుడు. ఉతక్ష్యుడికి వయస్సు పెరుగుతున్న కొద్దీ "నేనెందుకు ఇంత మూర్ఖుణ్ణి అయ్యాను" అనే బాధపెరిగిందట. పైగా తల్లీతండ్రీ మాట్లాడుకుంటున్న మాటలు ఒకరోజు విన్నాడు: "అంధుడు పుట్టినా ఫరవాలేదు, కుంటివాడు పుట్టినా ఫరవాలేదు, మూగవాడు పుట్టినా ఫరవాలేదు కానీ మూర్ఖుడు పుడితే మాత్రం మహావేదన." ఈ మాటలు వినగానే ఆ ఉతక్ష్యుడు ఎవరికీ చెప్పకుండా అడవికి వెళ్ళిపోయాడు; అలా వెళ్ళి గంగానదీ తీరానికి చేరుకున్నాడు. "నేను ఎప్పుడూ సత్యమే పలుకుతాను" అని నియమం పెట్టుకున్నాడట.

సత్యం పలుకుతాను అనుకున్నప్పుడు ప్రధానంగా కావలసింది మౌనం. మౌనానికి ఎంతో శక్తి ఉంది. సత్యం తప్ప ఏమీ పలికే వాడు కాదు. సత్యం పలకడం, మౌనంగా ఉండడం – ఇది తనకి తెలియకుండా చేసిన సరస్వతీ ఉపాసన. వాక్కునూ, బుద్ధినీ, జ్ఞానాన్నీ సరిగా వినియోగించడమే సరస్వతీ ఉపాసన. అదే వాచిక తపస్సు.

అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్ ।
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే ॥ (గీతా. 17-15)

అనుద్వేగకరం వాక్యం = ఉద్వేగం కలిగించని విధంగా మాట్లాడాలిట. ఈ వాచిక తపస్సే సరస్వతీ ఉపాసన.

అలా 15 ఏళ్ళుగడిచాయి. ఒకరోజు వేటగాడు ఒకడు ఒక వన వరాహాన్ని వేటాడుతూ వచ్చాడట. వేటగాడి బాణం తగిలి దెబ్బతిన్న వరాహం పరుగుపెడుతూ వచ్చి ఉతక్ష్యుని కుటీరంలో ప్రవేశించింది. రక్తం ఓడుతూ వచ్చిన వరాహాన్ని చూసిన ఉతక్ష్యునికి జాలి కలిగి, 'ఐ ఐ" అని బెదిరించాడట. ఐం అన్నది అమ్మవారి వాగ్బీజం. అందువల్ల ఐ ఐ అని పలకడంతో వెంటనే సరస్వతీ దేవి అనుగ్రహించి మహావిద్యను ప్రసాదించిందట. అప్పుడు ఆ వేటగాడు వచ్చి "ఈ అడవిలో అందరూ నువ్వు సత్యమే మాట్లాడతావంటున్నారు, నువ్వు చేప్తే నమ్మవలసిందే. వరాహం ఎక్కడ ఉంది?" అని అడిగాడట. అందుకు ఆయన నిజం చెప్పలేదనిపించుకోకుండా అబద్ధం చెప్పకుండా 'చూసింది మాట్లాడలేదు, మాట్లాడింది చూడలేదు. అటువంటప్పుడు నన్నెందుకు అడుగుతావు' అన్నాడట. అలాగ ఉతక్ష్యుని చేత అమ్మ పలికించింది. బోయవాడికి "ఇంకా ప్రశ్నించకూడదు" అనే బుద్ధి పుట్టించింది. అమ్మ అనుగ్రహం ఇలా ఉంటుంది.

సత్యం, అహింస మొదలైన లక్షణాలను గురించి చెప్తూ ఉపనిషత్తు ''భూతహిత యధార్థ భాషణమేవ సత్యం – యధార్థ భాషణమే సత్యం" అంటుంది. అయితే ఆ యధార్థం వల్ల మరొక ప్రాణికి ప్రమాదం ఉండకూడదు. ఆముక్తమాల్యదలో శ్రీకృష్ణ దేవరాయలు "బొంకి సత్యసాలి చంపి ధార్మికుండు... "అంటూ బొంకి కూడా సత్యసాలి అవాలి భూతహితంకోసం" అన్నారు. మన ధర్మాలు చాలా స్వారస్యంతో, అనేక ధర్మ సూక్ష్మాలతో కూడి ఉంటాయి. అక్కడి మహర్షులతో సహా అందరూ ఉతక్ష్యుణ్ణి "సత్యవ్రతా" అనీ, "సత్య తపా" అనీ పిలిచేవారు. జగదంబిక ఉపాసన అన్నది సత్యంతో కూడుకున్నది. సత్యమే అమ్మ స్వరూపం. ఆ తల్లిని "సత్యవ్రతా సత్యరూపా సర్వాంతర్యామినీ సతీ" అన్నారు. ఉతక్ష్యుడు తనంత తానుగా వేదవిద్య సర్వం భాసించి, వాటి అంతరార్థాలు కూడా గ్రహించగలిగి మా అందరి చేతా ఇప్పటికీ పూజింపబడుతున్న మహర్షి ఆయన" అని లోమసుడు చెప్పాడు. ❖ **(సశేషం)**

ఆ భగవంతుడే ఆధారం

తూర్పు బెంగాల్ (ఇప్పటి బంగ్లాదేశ్)లో ఉన్న ఒక చిన్న ఊరు – ఫరీద్‌పూర్. స్వతంత్ర పోరాటంలో పాలు పంచుకున్న దేశభక్తులు చాలామంది ఫరీద్‌పూర్‌లో జన్మించారు. 1923లో స్వామి జపానంద ఫరీద్‌పూర్ వెళ్ళారు. అక్కడ ఒక ఆశ్రమంలో బస చేశారు. ఆ ఆశ్రమం ఎదురుగా దారికి అవతల పక్క పెద్ద మైదానం ఉన్నది. మైదానానికి ఆ చివరన పెద్ద ఇల్లొకటి ఉంది. ఆ ఇంటి యజమాని ఒక వైద్యుడు. ఆ వైద్యుడు మంచివాడు, దైవభక్తి కలవాడు, సౌమ్యుడు. అనుకూలవతి అయిన భార్య, ఇద్దరు పిల్లలతో ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడుపుతున్నాడు.

స్వామి జపానంద ఫరీద్‌పూర్ చేరుకున్న రోజు ఆ వైద్యుడు వచ్చి పరిచయం చేసుకొన్నాడు. స్వామీజీతో కొంతసేపు మాట్లాడిన తరువాత రోజూ వచ్చి కలుస్తూ ఉంటానని చెప్పి సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు. ఆ తరువాత ప్రతిదినం వచ్చి, ఏవో ధార్మిక చర్చలలో పాల్గొనేవారు.

అలా ఒక నెల గడిచింది. ఒకరోజు ఆ వైద్యుడి పిల్లలిద్దరూ ఉదయం 9 గంటలకు ఆశ్రమం దగ్గరే ఉన్న మామిడి చెట్టు కింద ఆడుకోవడం స్వామి చూశారు. మళ్ళీ మధ్యాహ్నం 2 గంటలకి చూస్తే ఇంకా వాళ్ళు అక్కడే ఆడుకుంటున్నారు. అప్పుడు స్వామి, ఆ బాలికను పిలిచి "ఏమిటి సంగతి? మీరు ఇంకా ఇక్కడే ఆడుకుంటున్నారు. భోజనం చెయ్యడానికి ఇంటికి వెళ్ళలేదేం?"అని అడిగారు. ఆ బాలిక ఏమీ మాట్లాడకుండా తలవంచుకుని నిల్చుంది. ఇంతలో ఆ బాలుడు కూడా అక్కడకు వచ్చాడు. వాళ్ళిద్దరి ముఖాలూ భోజనం లేక నీరసంగా వాడిపోయాయి. జపానంద మళ్ళీ "ఏం బాబూ! ఇవాళ ఏమయింది? అమ్మ అన్నం పెట్టలేదా" అని అడిగారు. ఈ ప్రశ్నకీ ఏ జవాబూ రాలేదు. సన్న్యాసి మరేమీ అడగకుండా వాళ్ళిద్దరినీ లోపలికి తీసుకెళ్ళి, అరటి పళ్ళు, మరమరాలు ఇచ్చారు. వైద్యుడు కనిపిస్తే, 'ఇప్పటివరకూ పిల్లల్ని ఆకలితో ఉంచారేమిటని అడగాలి' అని మనస్సులోనే అనుకున్నారు.

వైద్యుడు ఇంట్లో నుండే పిల్లలు ఏదో తినడం గమనించి నెమ్మదిగా స్వామీజీ దగ్గరకు వచ్చాడు. తండ్రిని చూసి పిల్లలిద్దరూ చాలా భయపడ్డారు. స్వామి భయపడ వద్దని చెప్పడంతో ధైర్యంగా మామిడి చెట్టు కింద ఆడుకోవడానికి వెళ్ళిపోయారు. జపానంద ఆ వైద్యుడితో "ఏమయింది? ఇంట్లో ఇవాళ వంట చెయ్యలేదా? పిల్లలిద్దరూ ఆకలితో ఉన్నారు?" అని అడిగారు.

వైద్యుడు కొంతసేపు ఏమీ మాట్లాడకుండా ఉండిపోయాడు. కాసేపు మౌనంగా ఉన్న తరువాత, "స్వామీజీ! మీ దగ్గర దాపరికం ఎందుకు? ఇంట్లో ఏమీ లేవు. అందుకని వంట చెయ్యలేదు. కానీ సాయంత్రం లోపున ఆ భగవంతుడు తప్పకుండా ఏదో ఒకటి ఇస్తాడు. ఇప్పటివరకూ ఎప్పుడూ పస్తు ఉండలేదు. భగవంతుడు దయామయుడు" అన్నాడు.

ఇంతలో ఒక వ్యక్తి వచ్చి, వాళ్ళ ఇంట్లో ఎవరికో ఆరోగ్యం బాగా లేదనీ, త్వరగా రమ్మనీ పిలిచాడు. వెంటనే వైద్యుడు



స్వామీజీ దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు. సాయంత్రం ఇంటికి వస్తూ బజారు నుంచి వంట సరుకులు తీసుకుని వచ్చాడు. దూరం నుంచే చేతిలో ఉన్న సంచీ చూపిస్తూ "స్వామీజీ! భగవంతుడు ఇచ్చాడు" అని ఇంట్లోకి వెళ్ళిపోయాడు. వైద్యునికి భగవంతుడి పట్ల ఉన్న శ్రద్ధ, భక్తి, విశ్వాసం, శరణాగతి భావం చూసి సన్న్యాసి ముగ్ధుడయ్యారు. వైద్యుడి పట్ల గల గౌరవం మరింత పెరిగింది.

ఇంట్లో సామాన్లు పెట్టి, అతడు సన్న్యాసి దగ్గరకి వచ్చి "నేను చెప్పాను కదా! భగవంతుడు సాయంత్రం లోపున ఏదో ఒకటి తప్పకుండా ఇస్తాడని! ఇప్పటి వరకూ రోజంతా ఉపవాసం ఎప్పుడూ ఉండలేదు. పిల్లలకు ఆకలి వేసినా, ఎవరినీ తినడానికి అడగవద్దని వాళ్ళ అమ్మ చెప్పింది. అందుకే ఇవాళ వాళ్ళు మీ దగ్గరకొచ్చి మీరు ఇచ్చిన పళ్ళు తినడం చూసి ఆశ్చర్యం వేసింది" అన్నాడు.

అంతా విన్న స్వామీజీ, "వాళ్ళు అడగలేదు. నేనే పిల్లల్ని పిలిచాను. మన మధ్య ఉన్న అనుబంధాన్ని చూసి పిల్లలు నేనిచ్చిన పళ్ళు స్వీకరించారు" అన్నారు జపానంద. "అవును స్వామీజీ! అది మా అదృష్టం. వీళ్ళకి మీరంటే ఇష్టం. మీ దగ్గర తీసుకుని పళ్ళు తిన్నారని నేను తప్పు పట్టడం లేదు. అది చాలా సంతోషకరమైన విషయం" అన్నారు.

"ఇంట్లో ఏమీ లేకపోతే ఇంకొకర్ని అడగవచ్చు కదా!" అన్నారు స్వామీజీ. " స్వామీజీ! కానీ మా తండ్రిగారు ఎప్పుడూ ఎవరి దగ్గరా ఏమీ తీసుకోవద్దని ఒకసారి చెప్పారు. అందుకని నేను ఎప్పుడూ ఎవరినీ ఏమీ అడగలేదు" అన్నాడు వైద్యుడు.

"మీ దగ్గరకు మందులు తీసుకోడానికి అంతమంది వస్తారు కదా! అయినా మీ పరిస్థితి ఇలా ఉందేమి?" అని అడిగారు సన్న్యాసి. "స్వామీజీ! మీరన్నది నిజమే! కానీ రోగిని పరీక్షించడానికి డబ్బు పుచ్చుకోవద్దని మా తండ్రిగారు చెప్పారు. అందుకని రోగులను నేను డబ్బు అడగను. ఎవరు ఎంత ఇస్తే అంతే తీసుకుంటాను. ఇవ్వకపోతే నేను ఏమీ అడగను" అన్నాడు వైద్యుడు.

"బాగానే ఉంది. కానీ, మీరు జమాఖర్చుల లెక్కలు వ్రాసి ఉంచుకోరా?" అని స్వామీజీ అడిగారు. అందుకు ఆ వైద్యుడు, "ప్రతి రోజూ క్రమం తప్పకుండా పద్దు వ్రాస్తాను" అన్నారు.

"అలాగా! మీకు అభ్యంతరం లేకపోతే ఆ పద్దు పుస్తకం నాకు చూపించగలరా?" అని స్వామీజీ అడిగారు.

వైద్యుడు కొంచెం ఆలోచించి, "మీ దగ్గర దాపరికం ఎందుకు?" అని ఇంట్లోకి వెళ్ళి తన పద్దు పుస్తకం తెచ్చి ఇచ్చాడు. అంతా లెక్క కడితే సుమారు పదిహేను వందల దాకా బాకీలు ఉన్నాయి. చాలామంది ఏళ్ళ తరబడి వైద్యుడి సేవలు అందుకుంటూ కూడా, అతనికి డబ్బు ఇవ్వాలనే స్పృహ లేకుండా జీవితం గడుపుతున్నారు. దానికి కారణం వైద్యుడు డబ్బు అడగకపోవడం!

స్వామీజీ వెంటనే ఆశ్రమ కార్యదర్శిని పిలిపించి, అసలు కథ అంతా చెప్పారు. ఆశ్రమానికి వచ్చే మరికొంత మంది మనుష్యుల్ని పిలిచి, "మిత్రులారా! వైద్యుడు డబ్బు అడగరు కదా అని మీరు ఇవ్వడం మానేస్తే ఎలా? సమయానికి ఎవరి సొమ్ము వాళ్ళకు ఇవ్వడం ధర్మం కదా! అతను వ్రాసి పెట్టుకున్న పద్దులు చూసి నేనంతా తెలుసుకున్నాను. అతని ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని నేను మీతో ఈ మాట చెబుతున్నాను. మీరంతా ధర్మం తెలిసిన వాళ్ళు. అవతలి వాళ్ళు అడిగినా, అడగకపోయినా ఎవరికి ఎంత ఇవ్వాలో అది సమయానికి ఇవ్వాలి. ఇది మీ కనీస ధర్మం" అని చెప్పారు స్వామీజీ.

ఆ రాత్రికే కొంతమంది తాము ఇవ్వవలిసిన బాకీలు ఇచ్చారు. సుమారు ఏడు వందల రూపాయలు వచ్చాయి. మరికొంత మంది మర్నాడు పంపించారు. రెండురోజుల్లో సుమారు పదిహేను వందల రూపాయలు వసూలైంది. అది ఆ వైద్యుడు ఊహించనిది. ఆ రాత్రి అతను, స్వామి జపానంద దగ్గరకు వచ్చి "మహరాజ్! వాళ్ళందరికి మీరు ఈ విషయాలు ఎందుకు చెప్పారు? నాకు చాలా బాధగా ఉంది" అన్నాడు.

దానికి స్వామీజీ బదులిస్తూ, "మీరు ఏ తప్పు చెయ్యలేదు. అంతా నేనే వాళ్ళకి చెప్పాను. ఇందులో దోషం, పాపం అనేది ఉంటే అది నాదే! వాళ్ళంతా చదువుకున్న వాళ్ళు, ధర్మపరాయణులు. కానీ కర్తవ్యం మరిచిపోయారు. అది నేను వాళ్ళకు గుర్తు చేశాను. ఒక సన్న్యాసిగా అది నా కర్తవ్యం. వాళ్ళని బాకీలు తీర్చమని అడగడం వల్ల మీరు బాధ పడుతున్నారు. ఇది మీ మంచితనానికి నిదర్శనం. మీలాంటి మంచి మనిషిని చూసి నాకు చాలా ఆనందంగా ఉంది" అన్నారు.

వైద్యుడు చెమ్మగిల్లిన కళ్ళతో నెమ్మదిగా ఇంటికి వెళ్ళిపోయాడు. మర్నాడు ఉదయం కొద్దిగా ఆలస్యంగా వచ్చాడు. ముఖంలో వేదన కనిపిస్తోంది. రాత్రంతా చాలా బాధ పడినట్లు తెలుస్తోంది. మూడవ రోజు వైద్యుడు వచ్చి సన్న్యాసిని తన ఇంటికి తీసుకెళ్ళాడు. ఇంట్లో చిరిగి మాసికలు వేసి ఉన్న బట్టలు ఆరుతున్నాయి. అది గమనించిన సన్న్యాసి ప్రశ్నార్థకంగా వైద్యుడి వంక చూశారు. "రాత్రి ఇంట్లో ఇవి వేసుకుని కాలక్షేపం చేస్తాం. పగలు బయటికి వెళ్ళడానికి అందరికీ ఒక్కొక్క జత మంచి బట్టలు ఉన్నాయి. ఇవాళ బజారు నుంచి కొత్తవి కొని తీసుకొస్తాను. మీరే కదా సొమ్ము ఇప్పించారు" అని అంటూ ఉంటే, ఆ వైద్యుడి గొంతు పూడుకుపోయింది. మాట రాలేదు. అతని భార్య కళ్ళల్లో కూడా నీళ్ళు నిండి పోయాయి. వారి ఇల్లే ఓ పవిత్ర దేవాలయం అని సన్న్యాసికి అనిపించింది.

కష్టాల్లో కూడా కలత చెందకుండా ఆ భగవంతునిపైనే ఆధారపడి జీవిస్తున్న ఆదర్శ దంపతుల్ని స్వామి జపానంద నిండు మనస్సుతో ఆశీర్వదించారు. ❖

అనువాదం : శ్రీమతి జి.ఎస్. లక్ష్మి

యువకులారా! త్యాగశీలురుకండి!!

సాహసికులైన యువకులారా! ప్రేమమయమే జీవితం. స్వార్థపరత్వమే మరణం. ఇతరులకు మంచి చేయడమే జీవితం. హాని కలిగించడం మరణం. ఇది ఇప్పటికే కాదు ఎప్పటికైనా సత్యమే.

నిరుపేదల కోసం, అమాయక ప్రజల కోసం, అణచివేతకు గురైన వాళ్ళ కోసం వేదన చెందండి; పరితపించండి; గత పది సంవత్సరాలుగా 'శ్రమించండి, పరిశ్రమించండి' అనే నినాదాన్ని ఇచ్చాను. ఇప్పటికీ అదే ప్రబోధాన్ని ఇస్తున్నాను. పిరికితనాన్ని విడనాడండి. మిన్ను విరిగి మీద పడుతుందని భయపడవద్దు. ధైర్యంగా ఎదుర్కొంటే అన్నిటినీ వశం చేసుకోవచ్చు. సంపద వల్ల ప్రయోజనం లేదు. పేరుతో, కీర్తితో మనకు పని లేదు. కానీ ప్రేమ అమూల్యమైనది. ప్రధానంగా నడతను నమ్ముకోండి. దుర్భేద్యమైన కష్టాలనే కోట గోడలను సైతం అదే ఛేదించి, ప్రవేశాన్ని సాధించగలుగుతుంది.

ధనికులపై విశ్వాసం ఉంచవద్దు. వారు మృత సదృశులే కానీ, సజీవులు కారు. భగవంతునిపై విశ్వాసం ఉంచి, ఆత్మ విశ్వాసాన్ని వీడకుండా శ్రమించే వినయశీలురైన వారే ఏదైనా సాధించగలరు. నేను పన్నెండు సంవత్సరాలు ఈ కార్యభారాన్ని నెత్తిన వేసుకొని పర్యటించాను. సంపన్నులు, గొప్పవారనుకునే ప్రతి వారి ఇంటికీ వెళ్ళాను. భూగోళంలో సగం భాగాన్ని పర్యటించిన నాకు హృదయవేదనే మిగిలింది. భగవంతుడు కరుణామయుడు. ఆయన నాకు చేయూత నిస్తాడని తెలుసు. నేను ఈ నేల మీదే చలితోనో, ఆకలితోనో ఎక్కడో రాలిపోవచ్చు. కానీ నా సందేశాన్ని మీరు అమలు చేయండి. బీదలపై కరుణ చూపండి. అమాయకుల కోసం, దీనజనుల కోసం శ్రమించండి; వారిని ఉద్ధరించండి.

ప్రస్తుతం ఉన్న లేమి నుండి, దురదృష్టకర పరిస్థితి నుండి, విచక్షణా రాహిత్యం నుండి, కరువు కాటకాల నుండి, అసూయాభరితమైన స్థితి నుండి తేరుకునే అవకాశం జనిస్తుంది. ఉదారహృదయులైన స్త్రీ పురుషులు భోగలాలసతను విడనాడి, నిరాశ్రితులై, అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడుతున్న కోట్లాది దీనజనుల దైన్యాన్నీ, దౌర్భాగ్య స్థితినీ చక్కదిద్దడానికి త్యాగశీలతతో తమ వంతు కృషి చేసిన నాడే భారతదేశం జాగృతిని సాధిస్తుంది. ❖

జనవరి 12న
జాతీయ యువజన దినోత్సవం;
తిథి ప్రకారం-
జనవరి 6, బుధవారం
స్వామి వివేకానంద జయంతి

పరిప్రశ్న

- స్వామి సుకృతానంద

డి.యస్.ఆర్. మూర్తి, ముంబయ్

? : పాణిని వ్రాసిన అష్టాధ్యాయికి వరరుచి వార్తికాన్నీ, పతంజలి భాష్యాన్నీ వ్రాశారని విన్నాను. వార్తికం, భాష్యం అంటే ఏమిటో వివరించగలరు!

✍: పాణిని అనే మహాముని సంస్కృత వ్యాకరణం వ్రాసిన మహర్షి. వేదాలను అర్థం చేసుకోవాలంటే వేదాంగాలైన శిక్ష, కల్పం, వ్యాకరణం, నిరుక్తం, ఛందస్సు, జ్యోతిషం తెలియాలి. అయితే పాణిని వ్రాసిన అష్టాధ్యాయి వ్యాకరణానికి వరరుచి వార్తికం వ్రాశారు. వార్తికమంటే మూలగ్రంథంలో

చెప్పబడిన అర్థాన్నీ, చెప్పబడని అర్థాన్నీ, అధ్యాహారము చేయ(ఊహించ)బడిన అర్థాన్నీ, స్థూలదృష్టికి వ్యత్యస్తంగా కనబడే అర్థాలను పోలినవాటినీ దీర్ఘంగా విచారించి, నిజమైన అర్థాన్ని తెలిపే శ్లోకబద్ధమైన వ్యాఖ్యానం. శ్రీఆదిశంకర భగవత్పాదుల బృహదారణ్యకోపనిషత్తు భాష్యానికి సురేశ్వరాచార్యులు బృహదారణ్యక వార్తికం వ్రాశారు.

ఇక, భాష్యం అంటే - ఉపనిషత్ మంత్రాలు, లేక సూత్రాలను అనుసరించి పదాలను వర్ణిస్తూ, స్వపదాలతో వివరించే సూత్రార్థాలు.

సూత్రార్థోవర్ణ్యతే యత్ర పదై స్సూత్రాను సారిభిః,
స్వపదాని చ వర్ణ్యంతే భాష్యం భాష్య విదో విదుః

ఎ. రావు, హైదరాబాద్

? : 'సత్యం మాతా, పితా జ్ఞానం.. షడేతే మమ బాంధవాః' ఈ శ్లోకాన్ని పూర్తిగా తెలపండి.

✍: **సత్యం మాతా పితా జ్ఞానం ధర్మో భ్రాతా దయా సఖా**
శాంతిః పత్నీ క్షమా పుత్రః షడేతే మమ బాంధవాః

'సత్యమే నా తల్లి, తండ్రి జ్ఞానం, ధర్మమే సోదరుడు, దయే స్నేహితుడు, శాంత(గుణ)మే భార్య, ఓర్పే పుత్రుడు - ఈ ఆరుగురే నా ఆప్త బంధువులు'.

పరంధామనాయుడు, పాకాల

? : ఏకాదశి రోజున ఉపవాసం చేస్తూ మంచినీళ్ళల్లో తులసీ దళాలు వేసుకొని త్రాగకూడదంటున్నారు. ఇది ఎంతవరకు ఆచరణీయం.

ద్వాదశి పారణ చేసినందుకు దుర్వాస మహర్షి, అంబరీషుణ్ణి శిక్షింపజూశాడు.

కానీ, చివరకు మహావిష్ణువు యొక్క చక్రం వెళ్ళి, ఆ దుర్వాసుణ్ణే మహాభక్తుడైన అంబరీషుని శరణు జొచ్చేలా చేసిందంటే, మనం చేసే వ్రతం, పూజ, జపం, తపం ఏదైనా సరే సంపూర్ణమైన శ్రద్ధాభక్తులతో చెయ్యాలని అర్థంచేసుకోవాలి. శ్రీరామకృష్ణ పరమహంస చెప్పినట్లు కృష్ణ కిశోర్‌లా ఏకాదశి నాడు ప్రత్యేకంగా పాలు, పండ్లు పాయసాదులతో కడుపు నింపుకునేవారూ ఉన్నారు. ఉపవాస సమయంలో ఎక్కువ భగవన్నామస్మరణ చెయ్యాలి. జిహ్వ నియంత్రణతోనే మనోనిగ్రహం పెరుగుతుంది; నియంత్రణ సాధ్యమవుతుంది. నడివయస్కులూ, వ్యాధిగ్రస్థులూ ఉపవాసం చేసేటప్పుడు జాగ్రత్త వహించాలి. నిర్జలోపవాసం అవసరం లేదు. ఎవరేమి చెప్పినా స్వయంగా విశ్వసించిన విధంగా వ్యవహరించాలి. కలియుగంలో సర్వులకూ సత్యవచనమే తపస్సని శ్రీరామకృష్ణ భగవానులు బోధించారు. సర్వేశ్వరుణ్ణి ఆశ్రయించి మనం జీవిస్తే, ఆయన మనల్ని తప్పక అనుగ్రహిస్తాడు. శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో చెప్పినట్లు మన ఆహార విహారాల్లో, నిద్ర మేల్కొనడంలో మితం పాటిస్తే దుఃఖాలు తొలగి పరమాత్మ యోగం సిద్ధిస్తుంది. ఏకాదశి మొదలైన ఉపవాసాలు అందుకే!

పి. మురళీధరరెడ్డి, భీమారం

? : మాకు కోతుల బెడద బాగా ఉంది. ఎలుకలనూ, క్రిమి కీటకాలనూ చంపుతారు. కోతులను చంపడం పాపమా?

✍: వానరాన్ని ఎలుకలు, క్రిమి కీటకాల్లా చంపలేం. అయితే అవి అపార నష్టాన్ని కలిగిస్తాయి. అవి వచ్చినప్పుడు టపాకాయల్ని పేల్చడం, వాటికి నీళ్ళు దొరకనివ్వకుండా బాగా కారం కలిపిన అన్నం ఆహారంగా పెట్టడం చేయాలి. కోతులు ఆ శరీరాలతో తమ పాపకర్మల్ని క్షీణింప చేసుకొంటున్నాయి. అయితే పిచ్చికోతులు మనుష్యుల్ని రక్కడం, కరవడం చేస్తే అప్పుడు వధించవలసిందే! ❖

- రెంటాల జయదేవ



తులసీ మాహాత్మ్యం

మన హిందూ సంస్కృతిలో తులసి చెట్టుకున్న ప్రాముఖ్యం అంతా ఇంతా కాదు. ప్రతి ఇంట్లో కనీసం ఒక తులసి మొక్క అయినా ఉండాలన్నది హిందువుల నమ్మకం. భారతదేశంలో చాలా మంది ఇళ్ళల్లో ఇంటి ముందు భాగంలో కానీ, పెరటిలో కానీ తులసి కోట ఉంటుంది. గృహిణులు నిత్యం తులసి కోట వద్ద దీపం వెలిగించి, తులసి మొక్కకు నీళ్ళు పోసి, ప్రార్థనలు చేస్తారు. తులసి కోట చుట్టూ ప్రదక్షిణలు నిర్వహిస్తారు. తులసి చెట్టు కాండం, ఆకులు, గింజలు, తులసి మొక్క పెరిగే మట్టి - అన్నీ పవిత్రమైనవే!

కార్తీక మాసంలో తప్పనిసరిగా తులసి మొక్క నాటడం చాలామంది పాటించే ఆచారం. కార్తీక మాసంలో తెల్లవారు జామునే నిద్ర లేచి, తలారా స్నానం చేసి, ఆకాశంలో నక్షత్రాలు పోక ముందే తులసి కోట ముందు దీపం వెలిగించి, భక్తితో నమస్కరించడం హిందూ స్త్రీల సంప్రదాయం. ఆ నెల రోజులూ ఉదయం, సాయంత్రం తప్పకుండా తులసి కోట వద్ద దీపం వెలిగిస్తారు.

తులసి పూజ ఎందుకు? : 'తులనా నాస్తి అథైవ - తులసీ' అని సంస్కృత నిర్వచనం. గుణగణాల్లో మరి దేనితోనూ పోల్చడానికి వీలు లేనంత గొప్పది - తులసి. శ్రీతులసి సాక్షాత్తూ శ్రీలక్ష్మీ స్వరూపిణి. విష్ణుమూర్తికి తులసి మహా ప్రీతికరమైనది. అందుకే, భారతీయులకు అత్యంత పవిత్రమైన మొక్కల్లో తులసి ఒకటి. ప్రతి హిందువు ఇంట్లో గృహదేవతగా తులసి మొక్క ఆరాధనలందుకుంటోంది. తులసీదళాలు దైవారాధనకు ఎంతో శ్రేష్ఠమైనవి. సర్వదేవతలకూ తులసీ దళాలు ప్రీతికరమైన పూజాద్రవ్యమే. ఒకసారి పూజలో ఉపయోగించినప్పటికీ, కడిగి మళ్ళీ పూజకు వినియోగించగల ఏకైక ద్రవ్యం తులసి. అలా స్వయం పరిశుద్ధ శక్తి ఉన్న అరుదైనది - తులసి.

భగవంతునికి నివేదించే ఆహారంపై తులసి ఆకును ఉంచడం ఓ ఆనవాయితీ. అలాగే, మహావిష్ణువుకూ, ఆయన అవతారాలకూ పూజల సందర్భంగా తులసీ దళాలను సమర్పిస్తుంటారు. తులసి మహిమ అపారం. శ్రీతులసి దర్శన మాత్రాననే సర్వపాపాలూ నశిస్తాయి. తులసీదళాలతో పూజాదులు నిర్వహిస్తే, సర్వాభీష్టాలూ నెరవేరతాయి.

పురాణాల్లో తులసి గాథలు : ఓ పురాణ గాథ ప్రకారం శంఖచూడుని పత్ని తులసి. ఆమె మహా పతివ్రత. ఆమె శ్రద్ధాభక్తులనూ, ధర్మాచరణ పరాయణతనూ గుర్తించిన దేవ దేవుడు సమస్త ప్రజలకూ ఆరాధ్యనీయమైన తులసి మొక్కవు కాగలవని వరమిచ్చాడట. ఆమెకు తన పూజలో స్థానం కల్పించాడట. ఏ నివేదన అయినా సరే తులసీ పత్రం లేకుండా పరిపూర్ణం కాదని నిర్దేశించాడట. అలా తులసి అత్యంత పూజనీయురాలైంది.

సముద్రమథన కాలంలో అమృతం లభించింది. దాని మాహాత్మ్యం తెలిసిన విష్ణువుకు ఆనందబాష్పాలు రాలాయి. ఆ ఆనందబాష్పాలలో ఒక చుక్క చెదిరి, అమృత కలశంలో పడింది. అదే తులసి మొక్కగా ఆవిర్భవించిందని మరొక కథ ప్రచారంలో ఉంది. ఈ విషయాన్నే 'పద్మ పురాణం'లో ఇలా చెప్పారు:

పీయూష జాహి తులసీ-దేవ దేవ నమస్కృతా ।

(పద్మపురాణం) అంతట మహావిష్ణువు అప్పుడే పుట్టిన లక్ష్మి, కౌస్తుభాలను హృదయాన దాల్చి, శ్రీతులసిని ఆపాదమస్తకం ధరించాడట!

ఇక, తులసి ప్రాశస్త్యం చెప్పడానికి మనకు శ్రీకృష్ణ తులాభార గాథ అతి పెద్ద ఉదాహరణ. ఆ కథలో తన ధన, కనకాది సంపదనంతటితో సత్యభామ, శ్రీకృష్ణుణ్ణి తూచలేకపోతుంది. అప్పుడు రుక్మిణీ దేవి అత్యంత భక్తితో ఒక్క తులసి దళం సమర్పిస్తుంది. ఆ తులసి దళం ఒక్కటీ స్వామి బరువుకు సమానంగా తూగిన ఘట్టం అందరికీ తెలిసిందే! ప్రపంచంలోని ఐహిక సంపదల కన్నా భక్తి శ్రద్ధలతో సమర్పించిన చిన్న వస్తువే భగవంతునికి మిన్న అని అందరికీ తెలియ జేయడంలో తులసి కీలక పాత్ర పోషించింది.

వనవాస కాలంలో శ్రీరాముని పర్ణశాల ప్రాంగణంలో సీతాదేవి, లక్ష్మణుడు తులసి మొక్కలు నాటినట్లు పేర్కొన్నారు. ఇక, సీతాన్వేషణ సమయంలో హనుమంతుడు, విభీషణుడి మహలులో తులసి మొక్కలను దర్శించి, ఆనందించినట్లు 'తులసీ రామాయణం'లో వర్ణించారు. ❖

(వచ్చే సంచికలో 'తులసి కోట ఎందుకు')

కురుక్షేత్రం

కథ: స్వామి జ్ఞానదానంద   చిత్రాలు : దాకోజు శివప్రసాద్


వశిష్ఠుడు సూర్యుణ్ణి కలిశాడు.
దుర్నిరీక్ష్యమైన నా తేజస్సును తట్టుకొని నా దగ్గరకు రాగలిగావు. నీవే ఇంత గొప్ప వాడివైతే, మీ రాజు ఇంకా గొప్పవాడై ఉండాలి! అతడు నా అల్లుడు కాదగినవాడు. నా కుమార్తెను నీతో పంపిస్తాను, వివాహం జరిపించు.
సూర్యదేవా! చంద్రవంశానికి చెందిన సంవరుణుడి కులగురువు వశిష్ఠుడను నేను. మీ పుత్రిక తపతి వివాహాన్ని మా రాజుతో జరిపించండి.
వశిష్ఠుడు అప్పుడు తపతిని తీసుకొని భూలోకానికి వచ్చి, సంవరుణుడితో వివాహం జరిపించాడు. వారికి కురు అనే కుమారుడు కలిగాడు.
కురు ఆ పైన సౌదామిని అనే సౌందర్యవతిని పరిణయమాడి, తండ్రి తర్వాత రాజయ్యాడు.
కురురాజుకు తన పేరు శాశ్వతంగా నిలచిపోవాలనీ, తన వల్ల మానవ జాతికి మేలు జరగాలనీ కోరిక. అందుకు అతడు భూలోకమంతా తిరిగి తిరిగి ద్వైతవనానికి చేరాడు.
అక్కడి సరస్వతీ నదిలో స్నానం చేసి, శమంతకమనే క్షేత్రం చేరి ఇలా అనుకున్నాడు :
అష్టాంగ ధర్మాలు - తపస్సు, సత్యం, క్షమ, దయ, శౌచం, దానం, యోగం, బ్రహ్మచర్యం. వీటిని మొలిపిస్తాను. దాని వల్ల మానవునికి స్వర్గప్రాప్తి సులభమవుతుంది.

మిగతా 36వ పేజీలో...

సంక్రాంతి శోభ

మన పండుగలలో 'సంక్రాంతి' ముఖ్యమైన పండుగ. ఇది పంటల పండుగ కనుక దీనిని "పెద్ద పండుగ" అని కూడా అంటారు.

కర్షకులు తొలకరి నుంచీ కష్టపడి పండించిన పంటను సంక్రాంతి నాటికి ఇంటికి తీసుకువస్తారు. కొత్త ధాన్యం దంపిన బియ్యంతో వండిన పరమాన్నం సూర్యుడికి నివేదన చేసి ఆ ప్రసాదాన్ని స్వీకరిస్తారు.

'సంక్రాంతి' అంటే చేరడం అని అర్థం. సూర్యుడు ఒక రాశి నుండి మరొక రాశికి ప్రవేశించినప్పుడు, దానిని 'సంక్రమణం' అంటారు. ప్రతీ నెలా వచ్చే సంక్రమణాలలో మకర సంక్రమణం ముఖ్యమైనది. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే మకర సంక్రమణాన్ని 'మకర సంక్రాంతి' అని కూడా అంటారు.

సంక్రాంతి నుండి ఆరు నెలలని ఉత్తరాయణం అంటారు. ఈ కాలం దేవతలకి ముఖ్యమైనదనీ, అందువలననే ఉత్తరాయణం పుణ్యప్రదమైనదనీ భారతీయుల నమ్మకం. మహాభారత యుద్ధంలో నేలకొరిగిన భీష్ముడు ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేవరకూ తన ప్రాణాలను విడవడానికి ఇష్టపడక పోవడం పై నమ్మకాన్ని రుజువు చేస్తుంది.

చాంద్రమానం ప్రకారం ఈ పండుగ మార్గశిర-పుష్యమాసాలలో వస్తుంది. శ్రీకృష్ణ పరమాత్మ గీతలో "మాసానాం మార్గశీర్షోహం- మాసాలలో మార్గశిరం నేనై ఉన్నాను" అని చెప్పాడు.

సంక్రాంతి మూడు రోజుల పండుగ. మొదటి రోజు "భోగి", రెండవరోజు "సంక్రాంతి", మూడవరోజు 'కనుమ'.

భోగినాడు తెల్లవారక ముందే వీధులలో పెద్ద పెద్ద మంటలు వేస్తారు. పీడాకాలంగా పరిగణించబడే దక్షిణాయనం ముగియడంతోనే సర్వపీడలనూ భోగిమంటలలో కాలుస్తున్నామని భావిస్తారు.

సంక్రాంతి నాడు పితృదేవతలకు తర్పణాలు విడిచి, బ్రాహ్మణులకు భోజనం పెడతారు. సంక్రాంతి నాడు చేసే వ్రత దానాదులు అత్యంత ఫలప్రదమైనవని చెబుతారు.

సమృద్ధిగా పాలు ఇస్తూ, వ్యవసాయానికి పనికి వచ్చే కోడెదూడలను ఇచ్చే పశువులను కనుమ నాడు అలంకరించి, పూజిస్తారు.

వామనుడు త్రివిక్రముడై బలి చక్రవర్తిని పాతాళానికి పంపినట్లు పురాణాలు చెప్తున్నాయి. బలిచక్రవర్తి ప్రతీ సంవత్సరం మూడు రోజుల పాటు భూలోకాన్ని పాలించేందుకు వరం కోరినట్లు, త్రివిక్రముడైన విష్ణుమూర్తి ఆ వరాన్ని ప్రసాదించినట్లు, దాని ప్రకారం "సంకురుమయ్య" పేరుతో సంక్రాంతి పండుగ మూడు రోజులూ బలిచక్రవర్తి భూలోకానికి వచ్చి ప్రజలకి సంపదలు ఇస్తాడని చెప్తారు.

తెలుగునాట సంకురుమయ్య పరివారంతో సహా వచ్చినట్లు భావించి బొమ్మల కొలువు పెట్టి, ఆయన్ని పూజించి, మూడవ రోజున మేళతాళాలతో సాగనంపుతారు.

సంక్రాంతి సూర్యుడి సంచారం వలన జరుగుతుంది కనుక, మానవులకి అనేక విధాలుగా సహాయం చేస్తున్న సూర్యుణ్ణి ప్రత్యక్ష దైవంగా భావించి పూజిస్తారు.

ఏ దైవాన్నైనా ఆరాధించాలంటే ఆ దైవాన్ని మనస్సులో ధ్యానించాలి. అలా ధ్యానించలేనివారు విగ్రహాల మూలంగా ధ్యానించాలి, లేదా దేవాలయానికి వెళ్ళి అక్కడున్న విగ్రహాన్ని ధ్యానించాలి. మూల పదార్థాన్ని గుర్తుచెయ్యడానికే విగ్రహాలు కానీ విగ్రహాలు మూల పదార్థం కాదు.

సూర్యుణ్ణి ఆరాధించడానికి విగ్రహాలు కానీ, చిహ్నాలుకానీ అవసరం లేదు. సూర్యనారాయణ మూర్తి ఆకాశంలో కంటికి ఎదురుగా కనపడుతుంటాడు. ఉదయం, మధ్యాహ్నం, సాయం కాలాల్లో ఆయనకి నమస్కరించి ధ్యానించే పవిత్ర ఆచారం భారతీయులకి ఉంది. ఆరాధించే వారికి ఎదురుగా కనపడతాడు కనుక ఆయన ప్రత్యక్షదైవం అయ్యాడు.

తాను ప్రకాశిస్తూ ఇతర వస్తువులని ప్రకాశింప చేసే పదార్థమే స్వయం ప్రకాశకమైన పరమాత్మ. పరమాత్ముడైన భగవంతుణ్ణి కానీ ఆయన ప్రకాశాన్ని కానీ మనం చూడలేం. అయితే భగవంతుడికి ప్రతినిధిగా ఉన్న సూర్యప్రకాశం ఆధారంగా దైవ ప్రకాశాన్ని తెలుసుకోవచ్చు.

భూమికీ, చంద్రుడికీ స్వయం ప్రకాశం లేదు. సూర్యుడు తాను జ్యోతిర్మూర్తిగా ఉండి భూమికి, చంద్రుడికి వెలుగు నిస్తున్నాడు. అందువలననే దృశ్యపదార్థాలలో సూర్యుడు పరమాత్మ స్వరూపుడిగా ఆరాధింపబడుతున్నాడు.

సూర్యుడి వేడి వలన జీవులు జీవిస్తున్నాయి. మన శరీరంలోని ఉష్ణం (వేడిమి) సూర్యుని వలననే సంక్రమించింది. ప్రాణం నిలవడానికి వేడి ముఖ్యకారణం. మానవులతో పాటు జంతువులు, పక్షులు, వృక్షాలు... వంటి జీవజాలమంతటికీ వేడినిచ్చి ప్రాణాలు నిల్పుతున్నవాడు సూర్యుడు. అందువలననే ఆయన శక్తిమంతుడైన ప్రత్యక్షదైవంగా చెప్పబడుతున్నాడు.

వేదాలు భగవంతుణ్ణి కాలస్వరూపుడిగా, అభయ ప్రదాతగా వర్ణిస్తున్నాయి. సూర్యుని సహాయం లేనిదే కాలాన్ని కొలవడం సాధ్యం కాదు. రాత్రింబవళ్ళు... రోజులు... వారాలు... నెలలు... సంవత్సరాలు సూర్యుడి సంచారం వలననే ఏర్పడుతున్నాయి. కనుక సూర్యుడే కాల స్వరూపుడైన భగవంతుడని కీర్తింపబడుతున్నాడు.

చీకటి పడగానే ప్రాణులన్నీ నిద్రాదేవికి వశమవు తున్నాయి; సూర్యోదయమవగానే నిద్రలేచి తమ పనులు చేసుకునే శక్తిని పొందుతున్నాయి. కాబట్టి సూరుణ్ణే అభయ ప్రదాతగా భావించి, ప్రత్యక్షదైవంగా పూజిస్తున్నారు.

పండుగలు, ఉత్సవాలు, పూజలు, వ్రతాల పేరిట వేడుకలు జరుపుతున్నా మూలతత్త్వమైన పరమాత్మను చేరడానికి సాధనమైన ఆధ్యాత్మిక తత్త్వాన్ని ఈ విధంగా ఆచరణలో చూపెడుతున్నారు మనవాళ్ళు... ఇదే భారతీయుల ప్రత్యేకత. ❖

సంక్రాంతి శుభాకాంక్షలు

పాఠకులకు, రచయితలకు, రచయిత్రులకు, దాతలకు, ఏజెంట్లకు, ప్రకటనకర్తలకు హృదయపూర్వక సంక్రాంతి శుభాకాంక్షలు.

- శ్రీరామకృష్ణ ప్రభ

ఓ మహాత్యాగి ఆత్మకథ

(స్వామి వివేకానంద స్వీయ వచనాల సమాహారం)

(మహా భక్తుడు, అద్వైత వేదాంతి, కర్మయోగి, ప్రవక్త, శ్రేష్ఠసన్న్యాసి, గురువు, యుగాచార్యుడు, దేవదూత, పరమహంస శిష్యుడు, మానవ జాతి ప్రేమికుడు, మహా దేశభక్తుడు, ధ్యానసిద్ధుడు, మహాయోగి, గంధర్వగాయకుడు - ఇలా విభిన్న రూపాలలో స్వామి వివేకానంద మనకు దర్శనమిస్తారు. స్వామీజీ తన సంభాషణలు, ఉపన్యాసాలు, వ్యాసాలు, లేఖల్లో స్వయంగా తెలిపిన జీవితానుభవాలను 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా అందిస్తున్నాం.)

(...గత సంచిక తరువాయి)

నేను సామాన్యుల లాగ ధనార్జన, కుటుంబ పోషణ చేయడానికీ, విషయాల వెంట పరుగెత్తడానికీ జన్మించలేదనే దృఢ విశ్వాసం కలిగింది. మా తాతగారి లాగే సంసార త్యాగం చేయడానికి రహస్యంగా సన్నాహాలు ప్రారంభించాను. దాని కోసం ఒకరోజు నిర్ణయించుకొన్నాను. సరిగ్గా అదే రోజు శ్రీరామకృష్ణులు కలకత్తా రాబోతున్నారని విని సంతోషించాను. "ఎంత అదృష్టం! నా గురుదేవుల ఆశీస్సులతో సంసార త్యాగం చేయబోతున్నాను" అని భావించాను. గురుదేవుల్ని కలుసుకోగానే ఆ రోజు రాత్రి దక్షిణేశ్వరంలో తనతోనే ఉండాలని నన్ను బలవంతపెట్టారు. ఎన్నో విధాల తప్పించుకోజూశాను. కానీ వారి వెంట వెళ్ళక తప్పలేదు!... బండిలో ఎక్కువగా మాటలేం లేవు! దక్షిణేశ్వరం చేరి వారి గదిలో ఇతరులతో పాటు కొద్దిసేపు కూర్చున్నాక, గురుదేవులు భావసమాధిలోకి వెళ్ళారు. తరువాత నాకు దగ్గరగా వచ్చి, ఎంతో ఆప్యాయతతో నన్ను తాకుతూ, కన్నీరు కారుస్తూ, ఈ పాటపాడసాగారు–

"పలుకుదామన్నా భయమే! పలుకక ఉందామన్నా భయమే!
నా హృదయంలో ఉదయం ఓ సంశయం....
నిన్ను పోగొట్టుకొంటానేమోననే భయం, భయం!!.."

నా భావోద్వేగాల్ని అంతసేపూ నిగ్రహించుకొన్నాను. కానీ అప్పుడవి కన్నీరుగా పొంగిపొర్లాయి! గురుదేవులు ఆ పాట పాడడంలోని అంతరార్థం తెలుపకనే తెలుస్తోంది – వారికి నా పథకం తెలిసిపోయిందని! మిగతా శ్రోతలు మా ఇద్దరి మధ్య ఈ పరస్పర భావ ప్రసారం చూస్తూ అచ్చెరువొందారు. గురుదేవులు సామాన్య స్థితికి వచ్చాక, వారిలో ఒకరు కారణమేమని ఆయనను అడిగారు. గురుదేవులు నవ్వుతూ "ఓహ్! అది మా ఇద్దరి మధ్య విషయం లే!" అన్నారు. రాత్రికి మిగతా అందరినీ పంపించేసి నన్ను తన దగ్గరకు పిలిచి, "నీవు 'అమ్మ పని' కోసం వచ్చావనీ, సంసార జీవితం గడపలేవనీ నాకు తెలుసు నాయనా! కానీ నా కోసమైనా నేను జీవించి ఉన్నంత కాలం సంసారంలో(ఇంట్లో)నే ఉండు" అంటూ మళ్ళీ కన్నీరు కార్చారు. మరుసటి రోజు వారి అనుమతితో ఇంటికి తిరిగొచ్చాను. కుటుంబ పోషణ గురించి వెయ్యి ఆలోచనలు ఆవహించాయి. మళ్ళీ ఉదర పోషణార్థం పోరాటం మొదలైంది! నా తల్లీ తమ్ముళ్ళను పోషించడానికి నిర్దిష్ట ఆదాయమేమీ ఉండేది కాదు. కొన్నాళ్ళు ఓ వకీలు ఆఫీసులో పనిచేస్తూ, కొన్ని పుస్తకాలు అనువదిస్తూ, 'బ్రతకడానికి ఇది చాలు' అన్నంత సంపాదించ గలిగాను.

ఒకరోజు ఈ ఆలోచన తళుక్కున మెరిసింది – "భగవంతుడు (కాళీమాత), శ్రీరామకృష్ణుల ప్రార్థనల్ని ఆలకిస్తాడు; కనుక నా ఆర్థిక ఇబ్బందుల్ని తీర్చడానికి నా కోసం ప్రార్థించాల్సిందిగా గురుదేవుల్ని ఎందుకు అడగరాదు? గురుదేవులు నా కోరిక నెన్నడూ కాదనరు!" వెంటనే దక్షిణేశ్వరం వడి వడిగా వెళ్ళి, ఆకలితో అలమటిస్తున్న మా కుటుంబం కోసం ప్రార్థించాల్సిందిగా గురుదేవుల్ని పట్టుబట్టాను. వారు "నాయనా! అలాంటి ప్రార్థనలు నేను చేయలేను. కానీ స్వయంగా అమ్మ దగ్గర కెళ్ళి నీవే ఎందుకు అడగరాదు! నీ కష్టాలన్నీ నీవు 'అమ్మ'ను స్వీకరించనందు వల్లే!" అన్నారు.

నేను మాత్రం, "అమ్మ (ఎవరో) నాకు తెలియదు. దయచేసి మీరే నా తరపున అమ్మతో మాట్లాడండి, కాదనకండి?" అన్నాను. వారు మృదువుగా, "నా తండ్రీ! నేనెన్నో సార్లు అలా చేశాను బాబూ! కానీ నీవు 'అమ్మ'ను అంగీకరించవు కదా! కాబట్టి ఆ తల్లి నా ప్రార్థనల్ని ఆలకించదు... సరే! ఈ రోజు మంగళవారం (అమ్మ పూజకు శుభదినం). ఈ రాత్రి కాళీ ఆలయానికి వెళ్ళు. ఆ తల్లి ముందు సాష్టాంగ ప్రణామం చెయ్యి! నీకేం కావాలో అమ్మను వేడుకో! అమ్మ తప్పక అనుగ్రహిస్తుంది. ఆమె పరాశక్తి, పరావిద్య, పరబ్రహ్మ స్వరూపిణి, మహామాయ. ఆమె ఇచ్ఛా మాత్రం చేతనే, ఈ విశ్వానికి జన్మ నిచ్చింది. ఆ తల్లి ఏమైనా ఇవ్వగలదు నాయనా!" అన్నారు. గురుదేవుల ప్రతి పలుకునూ గట్టిగా నమ్మి, రాత్రి కోసం ఆత్రంగా వేచాను. రాత్రి 9 గంటలకు

గురుదేవులు నన్ను గుడికి వెళ్ళమన్నారు. వెళుతుండగా, నేనొక రకమైన దివ్యోన్మత్తతతో నిండి పోయాను. కాళ్ళు తడబడుతున్నాయి. సజీవమైన దేవదేవిని చూసి, ఆ తల్లి మాటల్ని వినబోయే ఆనందాన్ని స్మరిస్తూ, నా హృదయం ఉప్పొంగిపోతోంది. నేను భావ పూర్ణుడనయ్యాను. గుడిలోకి వెళ్ళి శ్రీకాళీమాత విగ్రహం చూతును గదా! అహో! జగజ్జనని సజీవంగా, చైతన్యమయియై, అనంతమైన దివ్యప్రేమ, సౌందర్యాలతో దర్శనమిస్తున్నది! 'అమ్మ'ను చూసి ఎగిరిపడుతున్న భక్తి, ప్రేమల ప్రవాహంలో చిక్కుకుపోయాను. పరమానంద భరితుణ్ణై అమ్మ ముందు మరీ మరీ సాష్టాంగ ప్రణామాలు చేస్తూ, "అమ్మా! నాకు వివేకమివ్వు, వైరాగ్యమివ్వు, జ్ఞానాన్నీ, భక్తినీ ఇవ్వు! సదా నీ దర్శన భాగ్యాన్ని ప్రసాదించు తల్లీ!" అని ప్రార్థించాను. నా ఆత్మ అనిర్వచనీయమైన దివ్య ప్రశాంతతతో నిండిపోయింది.

నేను వెనుదిరిగి రాగానే, "ఆర్థిక ఇబ్బందులు తీర్చమని అమ్మను ప్రార్థించావా?" అని గురుదేవులు అడిగారు. వారి ప్రశ్నతో ఉలిక్కిపడి, "లేదండీ! ఆ విషయం పూర్తిగా మరిచిపోయాను. ఇప్పుడేం చేయాలి?" అన్నాను. "మళ్ళీ వెళ్ళు, వెళ్ళి నీ అవసరాల గురించి అమ్మను కోరుకో" అన్నారాయన. మళ్ళీ రెండోసారి దేవాలయానికి వెళ్ళాను. కానీ 'అమ్మ'ను చూడగానే, సర్వమూ మరచి, పునః పునః ప్రణామాలు చేసి, భక్తి జ్ఞానాలను ఇమ్మనే ప్రార్థించాను. "రెండో సారైనా కావలసింది అడిగావా?" అని గురుదేవులు ప్రశ్నించారు. జరిగింది చెప్పాను. "ఎంత తెలివి తక్కువతనం. నిన్ను నీవు కొంచెం నిగ్రహించుకొని ఆ రెండు మాటలూ అడగలేకపోయావా? సరే, మరోసారి వెళ్ళి అమ్మను ఈ సారి తప్పక అడుగు, మరచిపోకు, త్వరగా వెళ్ళు!" అన్నారాయన.

మూడోసారి వెళ్ళాను; గుళ్ళోకి ప్రవేశించగానే తీవ్రమైన సిగ్గు,లజ్జా నన్ను ఆవహించాయి. "సాక్షాత్తూ జగన్మాతను ఎంతటి అల్పమైన విషయం అడగడానికొచ్చాను! మహా వైభవోపేతమైన మహారాజు దగ్గర కెళ్ళి, కూరగాయలిమ్మని అడిగినట్లుంది ఇది, నేనెంత మూర్ఖుణ్ణి!" అనుకున్నాను. సిగ్గు, లజ్జా, పశ్చాత్తాపాలతో అమ్మకు భక్తితో ప్రణమిల్లి "అమ్మా! నాకు భక్తి ఇయ్యి, జ్ఞానాన్ని ఇయ్యి, నాకు వేరేమీ వద్దు తల్లీ!" అని ప్రార్థించాను... దేవాలయం

నుండి బయటకు రాగానే ఇదంతా గురుదేవుల సంకల్పంతోనే జరిగిందని గ్రహించాను. కాకపోతే నా ప్రయత్నంలో మూడుసార్లు ఎలా విఫలమౌతాను? వారి దగ్గరకొచ్చి అన్నాను – "స్వామీ! మీరే ఏదో మాయ చేసి అంతామరచిపోయేటట్టు చేశారు. ఇప్పుడు, మా ఇంట్లో వాళ్ళు ఇక బీదరికంతో బాధలు పడకుండా దయచేసి మీరే వరమివ్వండి!" "అలాంటి ప్రార్థన నా నోట ఎప్పుడూ రాదు, నీవే స్వయంగా అమ్మను ప్రార్థించమని చెప్పాను, అది నీవు చేయలేక పోయావు, ప్రాపంచిక సుఖభోగాలు నీ నుదుట రాసి ఉన్నట్లు లేదు! సరే, దానికి నేనేమీ చేయలేను" అన్నారాయన! కానీ, నేను వారిని వదల్లేదు; నా ప్రార్థన ఆలకించి తీరాలని పట్టుపట్టాను. ఆఖరికి ఆయన "మంచిది, నీ వాళ్ళకు సాధారణ అన్న వస్త్రాలకు ఎన్నడూ లోటు ఉండదు లే!" అన్నారు.

ఎన్నోసార్లు గురుదేవులు నాకోసం జగన్మాతను ప్రార్థించారు! మా నాన్న పోయాక, నేను, మా అమ్మ, అక్కలు, తమ్ముళ్ళూ – అందరూ పస్తులు పడిఉంటే, గురుదేవులు నాకు ధనం ఇమ్మని జగన్మాతను ప్రార్థించారు... కానీ నాకు ఎలాంటి ధనమూ దొరకలేదు. అమ్మ తనతో ఇలా చెప్పిందని గురుదేవులు నాతో అన్నారు – "నరేంద్రునికి సాధారణమైన భోజనవస్త్రాలు లభిస్తాయి!"

గురుదేవులు నన్నెంతగా ప్రేమించారు! కానీ ఎప్పుడైనా నా మనస్సులో ఒక చెడుతలపు రాగానే తక్షణమే వారికి తెలిసిపోయేది. నా మిత్రుడు 'అన్నదా'తో కలిసి బయటకు వెళ్ళినప్పుడు, కొన్నిసార్లు దుష్టసాంగత్యంలో చిక్కుకుపోయేవాణ్ణి! అట్టి సందర్భాలలో గురుదేవులు నాచేతి నుండి ఏమీ తినలేకపోయేవారు.

నేను కలసినప్పటి నుండీ, జీవితాంతమూ నన్ను పూర్తిగా, సదా సర్వదా ఒకే రకంగా ప్రేమించి, విశ్వసించినవారు శ్రీరామకృష్ణులు ఒక్కరే! ఆయన నాపై ఉంచిన చెరగని విశ్వాసం, తరగని ప్రేమాప్యాయతలే నన్ను బంధించివేశాయి. ❖ (సశేషం)

అనుసృజన : స్వామి అర్చనానంద

అంగవికలుడే... అయితేనేం?

– ఆకెళ్ల రాఘవేంద్ర

మహాభారతంలో ఉన్న ఓ చిన్న పాత్ర–అనూరుడు. పుట్టుకతోనే రెండు కాళ్ళూ లేనివాడు. అయితేనేం...ప్రత్యక్ష భగవానుడయిన, లోకానికి వెలుగులు విరజిమ్మే సూర్యుడికి రథసారథిగా ఎదిగినవాడు – అనూరుడు. అంగవైకల్యం బాహ్య శరీరానికే కానీ ఆత్మశక్తికి కాదని నిరూపించిన ధీశాలి అనూరుడు. ఆత్మస్థైర్యం ఉంటే, సంకల్పబలం ఉంటే, మనశ్శక్తిని నమ్ముకొంటే కన్ను, కాలు, చేయి... ఇలా ఏ అవయవం లేకపోయినా జీవితంలో అత్యున్నత స్థితిని చేరుకోవచ్చని చెప్పే కథే అనూరుడి వృత్తాంతం.

మనందరం మనలో ఏదో ఒక లోపాన్ని చూసుకొని బాధపడుతూంటాం. ఉద్యోగం లేదని ఒకరు, పెళ్ళికాలేదని ఒకరు, సొంత ఇల్లు లేదని మరొకరు, పదో తరగతి తప్పామని ఇంకొకరు, జ్వరం వచ్చిందని వేరొకరు, డబ్బులు లేవని మరొకరు, అందం లేదని ఇంకొకరు... ఇలా ఏదో ఒక లోపం చూసుకొని కన్నీరవుతాం. సీత కష్టాలు సీతవి, పీత కష్టాలు పీతవి అన్నట్లు... ఎవరి కష్టం వారికి మహా ప్రళయంలా, పెనుతుపానులా, యమగండంలా తోస్తుంది. అది సహజం కూడా!

అయితే ఇవన్నీ మనం అనుకొంటున్నట్లు నిజంగా లోపాలేనా? ఉద్యోగం, డబ్బు, పదవి, అధికారం, హోదా... ఇవన్నీ నిజంగానే మనిషికి సంతోషాన్ని, విశ్వాసాన్ని ఇస్తాయా? పైపైన చూస్తే నిజమే అనిపిస్తుంది. లౌకిక ప్రపంచంలో భౌతికంగా సుఖంగా ఉండేందుకు ఇవన్నీ అవసరమైతే అవ్వొచ్చేమోగానీ నిజానికి మనిషిని నిలబెట్టేది, మనిషిని అడుగు ముందుకు వేయించేది, మున్ముందుకు నడిపించేది, పెనునిద్దుర వదిలించేది, సమస్య వచ్చినా కన్నీరు కార్చకుండా నిలబెట్టేది, కష్టం వచ్చినా కుంగిపోకుండా కాపాడేది, పాతాళంలోకి పడిపోయినా... తిరిగి పైకి ఎగబాకి... ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహింప చేసేది మాత్రం ఖచ్చితంగా ధనమో, ఉద్యోగమో, అధికారమో మాత్రం కాదు.

మరి ఏమిటి?

ఆత్మ విశ్వాసం. మానసికబలం. సందేహంలేదు

నిజానికి మనకు మనమే ఓ ఆయుధ భాండాగారం. దేహముంది, ప్రాణముంది, నెత్తురుంది, సత్తువ వుంది.. ఇంతకు మించిన సైన్యమేది? ఆశ మనకు అస్త్రం. శ్వాస మనకు శస్త్రం. ఇంతకన్న ఏం కావాలి? మనకు మనమే... మన శరీరమే మనకు... మన ప్రాణమే మనకు... మన అవయవాలే మనకు... ఆయుధాలు. విచిత్రం ఏమిటంటే... ఖడ్గానికి స్వయంగా యుద్ధంలో పాల్గొనడం తెలీదు. ఖడ్గచాలనం చేసే సైనికుడిదే, వీరుడిదే ఆ నైపుణ్యమంతా!

అదే విధంగా మన శరీరం, మన అవయవాలు బాగా ఉన్నంత మాత్రాన సరిపోదు. ఆత్మశక్తి లేనప్పుడు, మనపై మనకు విశ్వాసం లేనప్పుడు, సంకల్పబలం లేనప్పుడు, గుండెలోతుల్లో భయం ఉన్నప్పుడు... అవయవాలన్నీ కుదురుగా, అందంగా ఉన్నా ఒకటే లేకున్నా ఒకటే. అంటే... అవయవ శక్తి కన్న బాహ్యబలం కన్న మించినది ఆత్మబలం, మనోబలం.

రెండు కాళ్ళూ లేకుండా జన్మించిన అనూరుడి కథ చదివితే... ఆత్మబలం ఉంటే, ప్రాణశక్తిని నమ్ముకొంటే అంగవైకల్యం ఉన్నా మహోన్నతంగా జీవితంలో ఎదగవచ్చని నిశ్చయంగా, నిస్సంకోచంగా తెలుస్తుంది.

నన్నయ మహాభారతం ఆదిపర్వం ద్వితీయాశ్వాసంలో ఉంది అనూరుడి కథ. అనూరుడు అంటే ఊరువులు (తొడలు) లేనివాడు అని అర్థం. ఇతనికి అరుణుడు అన్నది మరోపేరు.

కశ్యప మహామునికి ఇద్దరు భార్యలు– కద్రువ, వినత. దక్ష, ధరణుల కుమార్తెలు కద్రువ, వినతలు. సవతులు

కావడంతో ఈ ఇద్దరికీ సఖ్యత ఉన్నా చిన్న చిన్న మనః స్పర్థలూ ఉన్నాయి. ఒకరిపై మరొకరు పైచేయి అయ్యేందుకు చేసిన ప్రయత్నాలూ ఉన్నాయి. ఒక్కోసారి ఇద్దరూ 'నాది ఒప్పంటే, నాది ఒప్పని' పందాలు కట్టుకొన్న సందర్భాలూ లేకపోలేదు.

ఒకసారి ఇద్దరూ గర్భం దాల్చారు. కద్రువ వెయ్యి అండాలకు, వినత రెండు అండాలకు జన్మనిచ్చారు. కద్రువ కన్న అండాలు పగిలి వెయ్యి సర్పాలు పుట్టుకొచ్చాయి. అలా కద్రువ నాగమాత అయ్యింది. వినతకు మాత్రం ఇంకా 'ఫల'ప్రదం కాలేదు. తన సవతి తల్లి కావడం తానింకా కాకపోవడంతో వినత విలవిల్లాడిపోయింది. వినత అండాలు చాలా కాలం వరకు సంతానంగా ఎదగకపోవడంతో... వినత సహనం చూపలేకపోయింది. పైగా తన సవతి కద్రువకు అంతమంది పిల్లలు పుట్టడం, తనకు ఇంకా సంతు కలగకపోవడంతో వినత ఆతృతను ఆపుకోలేక పోయింది.

అంతే... ఓరోజు వినత తన అండాలలో ఒకదాన్ని పగల గొట్టింది. ఇంకేముంది... అందులో ఇంకా పూర్తిగా ఎదగని బిడ్డ ఉంది. తొడల (ఊరువులు) నుంచి కింది భాగం ఇంకా రూపం పొందని మొండెం, తల మాత్రమే ఉన్న అంగవికలుడైన కొడుకు జన్మించాడు. అతనే అనూరుడు.

వినత తాను చేసిన తప్పిదం ఏమిటో తెలుసుకొంది. కానీ అప్పటికే జరగకూడని ఘోరం జరిగిపోయింది. ప్రకృతి సహజంగా జరగాల్సిన గతితార్కిక ప్రక్రియకు మనిషి అవరోధం కలిగిస్తే ఏమవుతుందో వినతకు తెలిసొచ్చింది. తనకు అలాంటి వైకల్యం కలిగించినందుకు తన తల్లి వినత-కద్రువకు దాసిగా వెయ్యేళ్ళు ఉండాలని అనూరుడు శపించాడు. రెండో అండాన్నయినా జాగ్రత్తగా కాపాడుకోమని సలహా ఇచ్చాడు. ఆ రెండో అండం నుండి జన్మించిన వాడే గరుత్మంతుడు (అంటే పెద్ద పెద్ద రెక్కలున్నవాడని అర్థం). అదంతా వేరే కథ.

ఒకటి మాత్రం నిజం. రెండుకాళ్ళూ లేని అంగవికలుడైన అనూరుడు... వేదనతో మిగిలిపోలేదు, మానసికంగా కుంగిపోలేదు. విధి వైపరీత్యం అనండి... మరేదైనా అనండి. తనకు కలిగిన వైకల్యానికి అనూరుడు వికలుడు కాలేదు. నిరాశలో మునిగిపోలేదు. ఆత్మ విశ్వాసంతో అడుగులు ముందుకు వేశాడు. మనోబలం గొప్పతనమేంటో నిరూపించాడు. ఆత్మశక్తి ముందు అంగవైకల్యం చిన్నదే అని నిరూపించాడు. అందుకే... అనూరుడు ఏకంగా సూర్య భగవానుడి ఏడుగుర్రాల రథానికి సారథి అయ్యాడు.

"అయ్యో, ఇంత బ్రహ్మాండమైన విశ్వంలో నేను ఎంత అల్పుడిని" అని కుంగి పోకుండా-అంటే శరీరానికి ప్రాధాన్యం ఇవ్వకుండా-

"ఇంత విశాల విశ్వసంగీతంలో నా స్వరమూ కలిసి ఉంది" అని పొంగిపోతూ - అంటే మనస్సుకు, ఆత్మకు గల శక్తిని, ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ జీవించడమే... అసలైన జీవన వికాసం. జీవితంపట్ల అసలైన స్పృహ, చైతన్యమూ ఇదే. అనూరుడి కథ చెప్పే సత్యం ఇదే!

ఇది తెలుసుకొంటే... పుట్టిన ఏడాదిన్నరకే కళ్ళు కనిపించక, చెవులు వినిపించక శాశ్వతంగా అంధ, బధిర,మూగ అయిన హెలెన్‌కెల్లర్ మానసికంగా క్రుంగి పోకుండా అంగవైకల్యాన్ని జయించి 88 ఏళ్ళు జీవించి... ఎంతో ఉన్నత స్థితికి చేరడంలోని రహస్యం ఏమిటో...

43 ఏళ్ళ వయసులో అంధత్వం రావడంతో లోకమంతా అంధకారమైనా తన మనోలోకంలో వెలుగుని నింపుకొని ప్యారడైజ్ లాస్ట్ లాంటి అనేక కావ్యాలతో మహాకవిగా నిలిచిన జాన్ మిల్టన్ గొప్పతనం ఏమిటో...

అంధుడే అయినా కృష్ణుడిపై పాటలు అల్లుకొంటూ సాగిన వాగ్గేయకారుడు సూర్‌దాస్‌లోని ఆత్మశక్తి ఏమిటో...

వెన్నెముక వ్యాధివల్ల కాళ్ళు కదపలేని, కుర్చీలోంచి లేవలేని స్థితిలో స్టీఫెన్ హాకింగ్ టైం గురించి, బ్లాక్‌హోల్స్ గురించి పరిశోధనాత్మక గ్రంథాలు రచించడంలోని శక్తి ఏమిటో...

చిత్రమైన వ్యాధితో రెండు కాళ్ళూ చచ్చుబడిపోయినా... ఆ అంగవైకల్యానికి కుంగిపోకుండా.... రాజకీయాల్లో ప్రవేశించి అమెరికా అధ్యక్షుడిగా ఎదిగిన ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ సంకల్పబలమేమిటో... తెలుస్తుంది.

అప్పుడు వైకల్యం అంటూ ఉంటే అది మనస్సుకే తప్పు, బుద్ధికే తప్పు మరిదేనికీ కాదని అవగతమవుతుంది. ❖

యువవాణి

– స్వామి పరిజ్ఞేయానంద

షేక్. షాహాబుద్దిన్, తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా.

ప్రశ్న: నన్ను మా అన్నయ్య ఎంతో కష్టపడి చదివించాడు. నేను బ్యాంక్ పోటీ పరీక్షలు వ్రాస్తున్నాను. కానీ విజయాన్ని సాధించలేకపోతున్నాను. రోజులు తరబడి మా అన్నయ్యకు భారమైనందుకు మనస్తాపాన్ని కలిగిస్తుంది. ఈ మనోవేదన నుంచి బయటపడే మార్గాన్ని తెలపండి.

జవాబు: మీరు పోటీ పరీక్షల్లో విజయం సాధించలేదనీ, మీ అన్నయ్యకు భారమయ్యాననీ మనస్తాపానికి గురయ్యారు. నిజానికి మీరు మీ అన్నయ్యకు భారమయ్యాననే బాధ మీ మానవత్వాన్ని సూచిస్తుంది. అయితే మీరు మీ అన్నయ్యకు ఏ విధంగానూ ఉపయోగపడలేదని కూర్చొని బాధపడినంతమాత్రాన ఆయన భారాన్ని తగ్గించలేరు కదా! కాబట్టి స్పందించే మీ హృదయానికి పనిచేసే చేతులను కలపండి. అంటే స్వామి వివేకానంద మాటల్లో 'కార్యశూరులుకండి' అని అర్థం. అంతేకానీ నేను నిష్ప్రయోజకుణ్ణి అని కూర్చుంటే మీరు ఎన్నటికీ ప్రయోజకులు కాలేరు.

'నేను అధముడననీ, పనికిమాలినవాడిననీ రేయింబవళ్ళూ దుఃఖిస్తూ కూర్చుంటే నిజంగానే పనికిమాలినవాడిగానే తయారవుతావు' అంటారు స్వామి వివేకానంద

If a man day and night thinks he is miserable, low and nothing, nothing he becomes... That is the great fact which you ought to remember.

- Swami Vivekananda

యుద్ధభూమిలో మనో దుర్బలతకులోనై యుద్ధం చేయనని అర్జునుడు అన్నప్పుడు 'నీ తరపున యుద్ధం చేసి నీకు విజయ కిరీటాన్ని అందిస్తాను' అని శ్రీకృష్ణుడు అనలేదు. అర్జునుడు యుద్ధ భూమిలో పోరాటం ప్రారంభించిన తరువాతే తన సహాయాన్ని అందించాడు శ్రీకృష్ణుడు. నరేంద్రనాథ్ (స్వామి వివేకానంద) తండ్రి మరణం తరువాత ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కోవలసి వచ్చింది. అప్పుడు 'నీ ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయి'అని శ్రీరామకృష్ణులు నరేంద్రుణ్ణి ఆశీర్వదించ లేదు. నరేంద్రుడు ఉద్యోగం కోసం ఎంతో ప్రయత్నించి, చివరికి ఒక న్యాయవాది దగ్గర చిన్న ఉద్యోగంలో చేరాడు. అతడు తనవంతు ప్రయత్నం చేసిన తరువాతే 'ఇకమీదట మీ కుటుంబ కనీస అవసరాలకు లోటుండదు' అని ఆశీర్వదించారు శ్రీరామకృష్ణులు. కాబట్టి కర్తవ్య నిర్వహణలో మన వంతు ప్రయత్నం చేయనప్పుడు అదృష్టమైనా, భగవంతుని అనుగ్రహమైనా మన దరికి చేరవు.

'మనస్సుంటే మార్గాలెన్నో' అనే సూక్తిని ఆచరణలో చూపిన యువకులు మన సమాజంలో ఎందరో ఉన్నారు. అలాంటి వారిలో ఒక యువకుడి గురించి తెలుసుకుందాం:

"చిన్నప్పుడే తండ్రి చనిపోవడం వల్ల కుటుంబ భారం అతనిపై పడింది. డిగ్రీ కూడా పూర్తిచేయని అతడు విధి వక్రీకరించినందుకు కూర్చొని బాధపడకుండా, భగవంతుణ్ణి బాధ్యుణ్ణి చేయకుండా ఆత్మవిశ్వాసంతో కష్టించి పనిచేయాలని నిర్ణయించుకున్నాడు. ఉదయం వార్తాపత్రికలను అమ్ముకుంటూ, సాయంత్రం ట్యూషన్‌లు చెప్పుకుంటూ అహర్నిశలూ కష్టపడి ప్రైవేటుగా డిగ్రీ పూర్తిచేశాడు. ఆ తరువాత ఐ.ఏ.ఎస్., కావాలని నిర్ణయించుకున్నాడు. ఆత్మవిశ్వాసం అనే అస్త్రంతో తను అనుకున్న లక్ష్యాన్ని గురిపెట్టాడు. ఫలితంగా సివిల్స్‌లో విజయాన్ని సాధించాడు. ఇప్పుడు అతడు ఐ.ఏ.ఎస్., అధికారిగా పనిచేస్తున్నాడు. ఆ ఆదర్శ యువకుడే బుర్రా వెంకటేశం".

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పుడు అందరూ ఏమనుకుంటారో నని నామోషీ పడకుండా, పరువు ప్రతిష్ఠల గురించి ఆలోచించ కుండా ఏ చిన్న ఉద్యోగమైనా చేయడానికి సిద్ధపడాలి. అలా కుటుంబానికి ఆర్థికంగా సహాయపడుతూనే పోటీ పరీక్షల్లో విజయం కోసం కృషి చేయండి. అంతేగానీ నాకు బ్యాంక్ అధికారి ఉద్యోగం వచ్చేదాకా మరేపనీ చేయనని కూర్చుంటే ఆర్థిక ఇబ్బందుల్ని ఎలా అధిగమించగలరు? మీ అన్నయ్యకు ఎలా సహాయపడగలరు?

కాబట్టి మీరు ముందు ఏదైనా చిన్న ఉద్యోగం సంపాదించి ఆర్థికంగా మీ అన్నయ్యకు తోడ్పడండి. అప్పుడు మీ మనస్తాపం పోయి మీ మీద మీకు విశ్వాసం పెరుగుతుంది. ఆ విశ్వాసంతో దేనినైనా సాధించగలరు. ❖

మీ సందేహాల్ని పంపాల్సిన చిరునామా :
యువవాణి
శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం,
దోమల్‌గూడ, హైదరాబాద్ – 500 029

దానం

– స్వామి సేవ్యానంద

మనం ఇతరులకు సహాయ, సహకారాలు చేయడం, మనకు ఉన్నంతలో కొంత ఇతరులకు ఇవ్వడం మన సహజమైన స్వభావం. మన మనస్సు పవిత్రం అయ్యే కొద్దీ ఈ స్వభావం మనలో పెరుగుతుంది. మనం స్వార్థపరులం అయ్యేకొద్దీ ఈ స్వభావం తగ్గుతుంది.

దానం ఎందుకు చెయ్యాలి? : "ఈ కలియుగంలో చేయాల్సిన కర్మ ఒక్కటే ఉంది. అదే దానం" అని వ్యాస మహర్షి చెబుతారు.

మనం ఎందుకు దానం చెయ్యాలి? మనం కష్టపడి సంపాదించుకున్నది మనమే అనుభవించవచ్చు కదా! ఈ ప్రశ్నకు సరైన సమాధానం ఒక్కటే! ప్రతి జీవిలోనూ భగవంతుడు ఉన్నాడు. మనం దానం చేయడం ద్వారా స్వయంగా భగవంతునికి సేవ చేసే సదవకాశం మనకు కలుగుతుంది. "ఇచ్చేవాడు (దాత), స్వీకరించేవాడికంటే (గ్రహీత) అల్పమైనవాడు. ఎందుకంటే స్వీకరించేవాడు ఆ సమయానికి స్వయంగా భగవంతునితో సమానం!" అని స్మృతులు చెబుతాయి. అందుకే మనం చేసే దానం మీదా, దయా, దాక్షిణ్యాల మీదా ఇతరులు ఆధారపడి ఉన్నారన్న అపోహను, అహంకారాన్ని వదిలి, దానం చేసే అవకాశం ఇచ్చినందుకు మనం వారి పట్ల కృతజ్ఞులమై ఉండాలి.

ఉన్నతమైన దానం : అన్ని దానాల కంటే ఉన్నతమైనది 'ఆధ్యాత్మిక జ్ఞానదానం'; తరువాత 'విద్యాదానం'; తరువాత 'ప్రాణదానం'; నాలుగవది 'అన్నదానం'. ఆధ్యాత్మిక జ్ఞానంతో మనం జనన, మరణాలకు అతీతంగా అనంతమైన ఆనందాన్ని అనుభవించగలం. అందుకే, ఇది అన్నిటికంటే ఉన్నతమైనది. అయితే, ఆకలితో అలమటిస్తున్న వారికి 'వేదాంతం' చెప్పడం అవివేకమే అవుతుంది. అందుకే సరైన వ్యక్తికి, సరైన విధంగా, సరైన సమయంలో దానం చెయ్యాలి.

మనపై విదేశీయులు దాడి చేసినప్పుడూ, మన సంస్కృతిని నాశనం చేసే ప్రయత్నం చేసినప్పుడూ మనం వారికిచ్చిన బహుమతి-ఆధ్యాత్మిక సంపద. ఇప్పటికీ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రపంచానికి అందించేది మనదేశమే.

నిస్వార్థదానం – ప్రగతికి సోపానం : "ఎవరి చేతులైతే ఎప్పుడూ ఇవ్వడానికై సిద్ధంగా ఉంటాయో వారు ఉన్నతమైన వారు" అని స్వామి వివేకానంద చెబుతారు. ఇతరులకు ఇచ్చే ప్రయత్నంలో ఆకలితో మరణించినట్లయితే ఆ ముహూర్తంలోనే మనం ముక్తి పథానికి చేరుకోగలం. మహాభారతంలో దీనికి చక్కని దృష్టాంతం ఉంది:

"ఒక చిన్న గ్రామంలో ఒక బ్రాహ్మణుడు అతని భార్య, కొడుకు, కోడళ్ళతో నివసిస్తున్నాడు. వారు చాలా పేదవారు. ఇతరులకు బోధించగా వచ్చిన కాస్త ఆదాయంతోనే వారు జీవితాన్ని గడుపుతున్నారు. ఒకసారి మూడు సంవత్సరాల పాటు 'కరువు' రావడంతో వారి కష్టాలు మరింత పెరిగాయి. వారు కొన్నాళ్ళు పస్తులున్నాక ఒక ఉదయం ఆ పేద బ్రాహ్మణుడు, తాను చాలా కష్టపడి సంపాదించిన కొంత ఆహారాన్ని తీసుకొచ్చి, దాన్ని నాలుగు భాగాలుగా చేశాడు. వారు భోజనం చేయడానికి సిద్ధంగా ఉన్న సమయంలో ఎవరో తలుపు కొట్టారు. తలుపు తీసి చూడగా ఒక అతిథి ఎదురుగా నిల్చున్నాడు. బ్రాహ్మణుడు వెంటనే అతన్ని సాదరంగా ఆహ్వానించి, తన వంతు భోజనాన్ని అతని ముందుంచాడు. అతిథి వెంటనే ఆహారాన్ని స్వీకరించి, "నాకు పదిరోజుల నుండి తిండి లేదు. మీరిచ్చిన ఈ కొద్ది ఆహారం నా ఆకలిని మరింత పెంచింది" అన్నాడు. వెంటనే బ్రాహ్మణుని భార్య తన భర్త ఆరంభించిన యజ్ఞాన్ని కొనసాగించడానికై తనవంతు ఆహారాన్ని అతిథికి అర్పించింది. అతను ఇంకా తృప్తి చెందలేదు. బ్రాహ్మణుని కుమారుడు, తరువాత అతని భార్య కూడా తమ వంతు ఆహారాన్ని అతిథికి సమర్పించారు. ఇప్పుడు అతిథి తృప్తి చెంది, వారిని ఆశీర్వదించి, సెలవు తీసుకున్నాడు. ఆ రోజు రాత్రి ఆ నలుగురూ ఆకలితో మరణించారు".

ఇంత నిస్వార్థంగా దానం చేసే స్వభావం మనలో ఎంత మందికి ఉంది? అతిథులను ఆదరించడం మాట అలా ఉంచితే కన్న తల్లితండ్రులను ప్రేమతో చూసుకోవడం కూడా ఈ రోజుల్లో చాలా మందికి తలకు మించిన భారమవుతోంది.

మనం ఎంత దానం చేశామని లెక్కలు పెట్టేకన్నా ఎంత నిస్వార్థభావంతో దానం చేస్తున్నామన్న విషయానికి ప్రాధాన్య మిస్తే ఆధ్యాత్మిక జీవితంలో ప్రగతిని సాధించగలం. ❖

నవ్యనినాదాలతో విజయనాదాలు...

– బి. సైదులు

ఆశానిరాశల్ని.... విజయవైఫల్యాల్ని మైలురాళ్ళుగా మిగిల్చి మరో సంవత్సరం మన కళ్ళముందు నుంచి కనుమరుగయింది. సరికొత్త సవాళ్ళతో మనం ఎంత సాహసికులమో తేల్చేందుకు ఆగామి వత్సరం స్వాగతించింది. నిజానికి కాలానికి తరతమ భేదాలుండవు. అందరికీ శుభాల సముచ్ఛయాన్నే పంచాలనుకుంటుంది. కాని ఎవరి ప్రయత్నాన్ని బట్టి వారికి ఆ యా ఫలితాల్ని ప్రసాదిస్తుంది. అందుకే ఆశావహులకు అది అందాల బృందావనమైతే... నిరాశావాదులకు అదే కాలం కాటేసే కాలనాగవుతుంది. స్వామి వివేకానంద ప్రవచించినట్లు గతాన్ని గతంలోనే పూడ్చిపెడదాం... సరికొత్త ఆశలతో ముందుకు సాగిపోదాం. వేల విజయసుమాల పరిమళాలతో... వేకువజాము తొలి ఆశలకిరణాలతో అడుగిడిన ఈ నవవర్షంలో దృఢదీక్షులమవుదాం.... నవ్యనినాదాలతో విజేతలమై విజయనాదాలు పలికిద్దాం.

అస్పష్టం... అనాలోచితం

ప్రస్తుతం చాలా సందర్భాల్లో విఫలమవడానికి కారణం మన పరిధిని, మన సామర్థ్యాన్ని మనం సరిగ్గా అంచనా వేసుకోకపోవడం. ఫలితంగా చాలా మంది జీవితాలు అస్పష్టంగా, అనాలోచితంగా సాగిపోతున్నాయి. ఆంగ్ల విద్యావేత్త బ్రెండన్ ఫ్రాన్సిస్ 'once we accept our limits, we go beyond them' అంటారు. ముందు మన పరిమితుల్ని, వనరుల్ని తెలుసుకోగలగాలి. కాని దురదృష్టవశాత్తూ మనలో చాలామంది వయసు మించిపోతున్నా వారి, వారి సామర్థ్యాల్ని గుర్తించి మసలుకోలేకపోతున్నారు. పరుగులయితే పెడుతున్నాం... కానీ ఎక్కడికో చెప్పలేకపోతున్నాం; అలసిపోతున్నాం; కాని అసలు ఎందుకో తెలుసుకోలేకపోతున్నాం. అందుకే ముందు ఈ కొత్త ఏడాదిలోనైనా మన గమ్యం పట్ల పూర్తి స్పష్టతను ఏర్పరచుకుందాం. దానికి అనుగుణంగా మన గమనాన్ని నిర్దేశించుకుందాం.

ఆధునిక బలహీనతలు... అష్టకష్టాలు..

సహజంగా మనలో ఉండే బలహీనతలకు తోడు నేడు ఆధునికమైనవి కూడా వచ్చి తోడయ్యాయి. అసలే కోతి, ఆపై పిచ్చి, కల్లు తాగి, నిప్పులు తొక్కి.... అన్నట్లుగా మారిపోయింది ప్రస్తుతం మన మనఃస్థితి. యుక్తవయసులో అసలే కుదురుగా ఉండని మనస్సును సెల్‌ఫోన్లు, ఇంటర్‌నెట్లు మరింత ఇరకాటంలో పడేశాయి. ఆధునిక మానవుడికి సెల్‌ఫోన్ రూపంలో మరో శరీరభాగం వచ్చి చేరినట్లయింది. విలాసాల్ని అవసరాలుగా భ్రమించడం వల్లనే ఈ ప్రమాదమంతా. ప్రపంచంలో ఇలాంటి ఆధునిక దూరవాణి సాంకేతిక సౌలభ్యాల్ని వినియోగించడంలో భారతీయ యువతే ముందు స్థానంలో ఉందని ఇటీవలి పరిశోధనల్లో తేలడం దురదృష్టకరం. ఇవి మానసికంగా, శారీరకంగా ఎంత బలహీనుల్ని చేస్తున్నాయో యువతీయువకులు గమనించడం లేదు. ముఖ్యంగా జీవితానికి పటిష్ఠమైన మార్గాన్ని నిర్మించుకోవలసిన విలువైన ప్రాయంలో ఇవి మన ఏకాగ్రతను ఛిన్నాభిన్నం చేస్తాయి. 'simple living high thinking' మన జీవనశైలిగా మలచుకోవాలని తరచూ బోధించేవారు స్వామి రంగనాథానందజీ. ఇప్పటి నుంచి అయినా ఇలాంటి ఆధునిక బలహీనతల నుంచి బయటపడేందుకు కంకణబద్ధులమవుదాం.

ఆహారాలు... ఆహార్యాలు...

భగవద్గీతను చదవడం కన్నా ముందు ఫుట్‌బాల్ ఆడి శరీరాన్ని దృఢం చేసుకోండి, మిమ్మల్ని మానసికంగా, శారీరకంగా బలహీనపరిచే దేనినయినా విషంలా తిరస్కరించండి అనే వారు స్వామి వివేకానంద. బాణం గురి చేరాలంటే ముందు ధనుస్సు బలంగా ఉండాలి. ధనుస్సే బలహీనంగా ఉంటే, ఇక బాణం గురించి చెప్పేదేముంటుంది. ఆధునికత పేరుతో అస్తవ్యస్తమైన ఆహార, ఆహార్యాల వెంట పరుగులు తీస్తున్నాం. అందుకే మనలో చాలామంది ముఖాల్లో కృత్రిమ కాంతులు.... అద్దకపు అందాలు. వీటన్నింటికీ కారణం మన జీవనంలో సహజత్వం లోపించడం. పసిబిడ్డ ఉగ్గుపాల నుంచి పండ్లరసాల వరకు అన్నింటినీ మార్కెట్లలో కొనుగోలు చేస్తున్నాం. భారతీయ జీవనవిధానానికి సరిపోలని సంస్కృతుల్ని దిగుమతి చేసుకొని మనకు మనమే

కృతకంగా బ్రతుకులీడుస్తున్నాం. ఆహార, ఆహార్యాలనేవి వారి వారి భౌగోళిక, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా వారసత్వంగా సంక్రమిస్తూ ఉంటాయి. ఒకరు ఇంకొకరి ఆహార, ఆహార్య, ఆచారాలను గుడ్డిగా అనుకరించడం వలన పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్న చందంగా మారిపోతుంది. అందుకే భౌతికంగా, బౌద్ధికంగా మనల్ని ధీరోదాత్తులను చేసే జీవనశైలిని అలవరచుకునేందుకు ఈ శుభక్షణాల్లో శ్రీకారం చుడదాం.

మనసే మనిషి....

'మానసం విద్ధి మానవమ్' అంటోంది యోగవాశిష్ఠం. మనిషి ఉత్థానపతనాలన్నీ ఈ మనోనియంత్రణపైనే ఆధారపడి ఉన్నాయి. అందుకే ముందు మనస్సును నిర్మలంగా ఉంచుకునేందుకు ప్రయత్నిద్దాం. ఆధునిక జీవనవిధానాలూ, వర్తమాన వ్యవహారాలూ చాలా వరకు కపటత్వంతో కూడి ఉన్నాయి. ముఖ్యంగా మనలో చాలా మంది ఇలాంటి హిపోక్రసీ(కపటత్వం)నే వ్యవహార దక్షతగా భ్రమపడుతున్నారు. ఇలాంటి కపటత్వం మన విశ్వసనీయతకే విఘాతం కలిగిస్తుంది. ఈ నవవర్షంలో ఈ కపటత్వాలు, కలతల నుంచి బయటపడదాం.

శీలం... సంస్కారం

some say knowledge is power, but that is not true, actually character is power.... అంటారు ఓ ఆంగ్లమేధావి. నిన్నటి తరాన్ని చూసి మన తరం నేర్చుకోవలసిన ప్రధాన అంశమిది. అందుకే స్వామి వివేకానంద అంటారు 'లక్ష్యం ఎంత ప్రధానమో, లక్ష్యసాధనా మార్గం కూడా అంతే ముఖ్యం'అని. కానీ మనలో చాలా మంది దీనికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. లోకమంతా లక్ష్యాన్ని చేరడాన్నే చూస్తుంది; కాని ఆ లోకేశ్వరుడు మాత్రం ఎలా లక్ష్యాన్ని చేరుకున్నామో కూడా చూస్తాడు. నిజానికి విజయానికి అడ్డదారులు, అతిదగ్గర దారులు ఉండవు. ఈ నేపథ్యంలో ఈ నవవసంతంలోనైనా విలువలతో విజయసౌధాన్ని నిర్మించుకునే ప్రయత్నం చేద్దాం. అప్పుడే కాస్తంత ఆలస్యమైనా మన 'గెలుపు' ప్రపంచానికి స్ఫూర్తిమంతంగా గుర్తుండిపోతుంది.

స్వార్థత్యాగం... సేవాభావం

Make yourself necessary to somebody... అంటాడు రాల్ఫ్ వేడో ఎమర్సన్. సమాజంలో గతంతో పోలిస్తే సంపన్నుల శాతం పెరిగింది; కానీ దురదృష్టవశాత్తూ అదే స్థాయిలో దాతృత్వభావన మాత్రం లోపించింది. 'తరతరాలు కూర్చొని తిన్నా తరగని సంపద ఉన్నా ఇంకా వక్రమార్గాల్లో ఆర్జించడం అవసరమా? అని ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి. ఉదాహరణకు ఇటీవల ఆదాయపుపన్ను శాఖ దాడిలో చిక్కుకున్న ఒక అధికారి బ్యాంకు లాకర్ తెరిస్తే, ఆయన దాచిన నోట్ల కట్టలు పొడిమాదిరి రాలిపడ్డాయి. దాదాపు ఇరవై, ముప్పై ఏళ్ళ క్రితం దాచిన నోట్లకట్టలవి. అందులో ధనం దాచిన విషయమే మరచిపోయాడట ఆ అధికారి. ఎంత దారుణం! ఎవరి కోసమైతే సంపాదిస్తున్నామో వారు కూడా అసహ్యించుకునే రీతిలో ఇలా జీవిస్తే అంతకు మించిన దౌర్భాగ్యం ఇంకొకటి లేదు. విదేశీయులకు సకల సుఖాలు అనుభవించే సంపన్నుడు ఆదర్శం... కాని మనకు సర్వం పరిత్యజించే త్యాగమూర్తి ఆదర్శం. పోగు చేసుకోవడం హీనజీవనం, పదుగురితో పంచుకోవడం దివ్య జీవనం. ఈ నూతన వత్సరంలో అలాంటి దివ్యజీవనానికి శ్రీకారం చుడదాం. ❖



మోదుల్లా, మొండిగోడల్లా ఎన్నాళ్ళని బ్రతుకుతాం; లంగరు లేని నావల్లా ఎక్కడికని సాగిపోతాం. ఇకనైనా మేలుకొందాం... వజ్రకఠోరమైన సంకల్పం కోసం, ఉక్కునరాలను, ఇనుప కండరాలను బలిపెడదాం. జింకల్లా కల్లోలపడుతూ... నక్కల్లా కుతంత్రాలు పన్నుతూ కాదు మనం జీవించాల్సింది, మృగరాజులా మహాగంభీరంగా మసలుకుందాం. విశ్వాంతరాళాన్నే మథించగలిగే మేధస్సు నిండిన అమృత పుత్రులం మనం. మణుల వేటకై వెళుతూ మిణుగురుల వెలుగుకు ఆకర్షితులం కావడం అవమానకరం; పరమోన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుందాం.

ఆ మహనీయుని మార్గంలో...

మన కోసం నిరీక్షిస్తున్న ఆర్తులు, అనాథలు, అభాగ్యులు ఎందరో ఉన్నారు; స్వామీజీ నినదించినట్లు వారందరిలో ఆ సర్వేశ్వరుడిని దర్శించుకుందాం; నా దేశంలో కుక్క కూడా ఆకలితో చావడాన్ని నేను భరించలేనన్నవారు స్వామి వివేకానంద; మరి నేడు మన కళ్ళముందే తోటి మానవులు ఆకలితో అలమటిస్తున్నారు; వారిలో ఏ ఒక్కరి క్షుద్బాధను తీర్చినా మన జీవితం ధన్యమైనట్లే. మనలో ఎన్నో బలహీనతలు ఉండవచ్చు; అంతమాత్రాన బాధపడాల్సిన పనిలేదు. వాటిని అధిగమించే బలం కూడా మనలోనే ఉంది; వేయిసార్లు విఫలమైనా ఏదో ఒకరోజు మనం వాటి నుంచి బయటపడగలం. ఈ ప్రపంచమనే కర్మాగారంలో వినియోగించక తుప్పుపట్టే యంత్రంలా కాకుండా, శ్రమకు సమర్పణమై సార్థకతను సాధించుకుందాం. కండరాలతో కూడిన మన శరీరాలు అంత్యదశలో ఎముకల గూడును మోసుకుపోవడం వల్ల ప్రయోజనం ఏముంది? స్వామీజీ అంటారు 'రోగం చేతనో, ఆకలి చేతనో చనిపోవడం కాదు; పరుల కోసం పోరాడి కన్నుమూయండి'... ఈ నూతన సంవత్సరంలో ఆ మహనీయుని అడుగుజాడల్లో పయనిద్దాం... పునీతులమవుదాం. ❖

బ్రహ్మచర్యం

– స్వామి రఘునాయకానంద



స్వామి వివేకానంద విజయదుందుభి మ్రోగించి పాశ్చాత్య దేశాలలో భారతీయ సనాతన ధర్మాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేసింది చికాగోలో జరిగిన సర్వమత మహాసభలో. తాను సాధించిన విజయాన్ని స్వామి వివేకానందుని మాటల్లో: సభలో "అమెరికా దేశ సోదర, సోదరీమణులారా!" అని సంబోధించాను. సభలో రెండు నిమిషాలు పాటు హర్షధ్వానాలు చెలరేగాయి. మరుసటి రోజు నుండి అమెరికాలో నేనొక సుప్రసిద్ధ వ్యక్తినయ్యాను. దీనికి కారణం నాలో ఏదో అతీత శక్తి ఉందని మీకు చెబుతున్నాను. అదేమిటంటే నా జీవితంలో ఒక్కసారి కూడా కామభావన నా మనస్సులోనికి రానీయలేదు. నా బుద్ధిని, నా ఆలోచనను, మానవులు సాధారణంగా ఆసక్తి చూపించే విషయాల నుంచి ఉన్నత శిఖరాల వైపు పయనించే విధంగా శిక్షణ ఇచ్చాను. అది ఎంత బలవత్తర శక్తిగా మారిందంటే, దానిని ప్రతిఘటించడం ఎవరితరమూ కాదు. నాకు లభించిన అఖండ విజయానికీ, ప్రపంచ చింతనా ధోరణులలో వచ్చిన గొప్ప మార్పుకూ, నా యావత్తు విజయానికీ కారణం బ్రహ్మచర్య శక్తే."

ప్రస్తుత సమాజంలో అత్యధిక సంఖ్య యువతే. భారతదేశ భవిష్యత్తు విధాతలైన యువత మీద ఉంది. ఈనాటి యువత పాశ్చాత్య సంస్కృతి ప్రభావం వలన అన్ని రకాల వ్యసనాలకు బానిసలై శారీరకంగానూ, మానసికంగానూ, మేధాపరంగానూ, ఆధ్యాత్మికంగానూ బలహీనులు అవుతున్నారు. యువత తమ బాధ్యతలను, తమను తాము స్వాధీనంలో ఉంచుకోవడాన్ని, ఏకాగ్రత ద్వారా జ్ఞానాన్ని, నైపుణ్యాలను సంపాదించడం మర్చిపోతున్నారు. ఏ గొప్ప పనినైనా సాధించడానికి సరైన తరుణోపాయం యౌవనమే. ఆ యౌవన లక్ష్యం నేర్చుకోవడమే! సనాతన విద్యావిధానంలో విద్యార్థులను బ్రహ్మచారులు అనేవారు. అక్కడ బ్రహ్మచర్యం, విద్యార్థి జీవితం మిళితమై సాగేవి. విషయ సుఖాల కోసం, వినోదాల కోసం పరుగులు తీస్తూ సమయాన్ని వెచ్చించడం నిజంగా ఆ ఆదర్శం నుండి వైదొలగడమే. చంచలమైన మనస్సుతో ఏకాగ్రత సాధించలేరు. మనస్సును ఏకాగ్రం చెయ్యకుండా గొప్ప పనులు సాధ్యం కావు. "విద్యసారమంతా మనస్సును ఏకాగ్రం చెయ్యడంలోనే ఉంది, సమాచారాన్ని సేకరించడంలో లేదు" అంటారు స్వామి వివేకానంద. శరీర దారుఢ్యం, కుశాగ్ర బుద్ధి, ఉత్తేజం – ఇవే ఆదర్శ యువత అలవరచుకోవాల్సినవి. యువత వ్యక్తిత్వ రహస్యం అంతా బ్రహ్మచర్యంలోనే ఇమిడి ఉంది.

బ్రహ్మచర్య నిర్వచనం: విషయ వాంఛలను మనస్సులోకి రానీయకుండా, మనస్సును పవిత్రంగా ఉంచుకోవడానికి చేసే సాధననే బ్రహ్మచర్యం అంటారు. ఆలోచనలలో, మాటలలో, పనులలో విషయ సుఖాల జోలికిపోకుండా తనను తాను అదుపు చేసుకోవడమే బ్రహ్మచర్యం. ఏకాగ్రత సాధించాలంటే మానసిక ప్రశాంతత అవసరం. ప్రశాంతత అనేది మహోన్నత మానసిక స్థితి. బ్రహ్మచర్యపాలన శరీరాన్ని, మనస్సును శాంతి యుతంగానూ, ప్రశాంతంగానూ ఉంచుతుంది. అదే యువ శక్తి. ఆ శక్తితోనే యువత ఘనకార్యాలు సాధించేందుకు ధైర్యంతో, నూతనోత్సాహాలతో ముందంజ వేస్తారు. స్వామి వివేకానందను మహోన్నత స్థితికి చేర్చింది ఈ బ్రహ్మచర్యపాలనే. బ్రహ్మచర్యపాలన ద్వారానే మానసిక బలం, ఆత్మశక్తి, ఆత్మవిశ్వాసం, తేజస్సు, పవిత్రత, ధైర్యం, శక్తి వంటి గుణాలు అలవడతాయి.

వ్యక్తిత్వ నిర్మాణంలో బ్రహ్మచర్యం పాత్ర: ఒక వ్యక్తి ధీరసైనికుడిగా అవడానికి చాలా సాధన అవసరం. ఒక వ్యోమగామి, రోదసిలోకి వెళ్ళడానికి వెనుక ఎంతో కఠోర పరిశ్రమ దాగి ఉంది. మనస్సును నిగ్రహించి బ్రహ్మచర్యం పాటించడానికి కూడా సాధన చాలా అవసరం. మనం తినే ఆహారం, చూసే దృశ్యాలు, వినే మాటలు, వాడే పదాలు, మన సహవాసం – ఇవన్నీ కూడా మన బ్రహ్మచర్యం మీద ప్రభావాన్ని చూపుతాయి. మనస్సు ఎంత స్వచ్ఛంగా ఉంటే, దానిని నిగ్రహించడం అంత సులభం. మనస్సును నిగ్రహించాలంటే పవిత్రత తప్పనిసరి. సంపూర్ణ మనో నిగ్రహానికి కచ్చితమైన నైతిక వర్తనమే సర్వస్వం అంటారు స్వామి వివేకానంద. ❖

('బ్రహ్మచర్య సాధనకు సూచనలు' వచ్చే సంచికలో..)

(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

ప్రియమైన గోకులానంద

అక్కడి కళాశాల విద్యార్థులకు స్వామి వివేకానంద బోధనలను పరిచయం చేసే ప్రయత్నంలో ఉన్నావని తెలిసి చాలా ఆనందపడ్డాను. ఒక కొత్త యుగానికి ప్రారంభం మన కళ్ళ ముందు కదలాడుతోంది. స్వామీజీయే అందుకు మార్గదర్శి. బెంగాల్ రాష్ట్రంలో వైదిక కుటుంబాలలో జన్మించిన వారికి స్వామీజీ ఆలోచనాసరళిని అర్థం చేసుకునే అవకాశం లభించలేదంటే అంతకన్నా దురదృష్టం మరొకటి ఉండదు.

స్వామీజీ సాహిత్య సర్వస్వం అద్భుతమైన ఆలోచనల మహాసాగరం. వాటిలో ఏ కొద్దిపాటి వాటినైనా సరే మనస్ఫూర్తిగా ఆమోదిస్తే, వారి జన్మలు ధన్యమే!

స్వామీజీ యొక్క ఏ ఒక్క వివరణపైన అయినా ఏకాగ్రతను కేంద్రీకృతం చేసేలా విద్యార్థులను ప్రోత్సహించు. ఉదాహరణకు "మానవునిలోని సంపూర్ణత్వాన్ని ఆవిష్కరించ గలిగిందే విద్య" అనే వాక్యం. కొన్ని రోజులపాటు ఈ ఒక్క వాక్యం యొక్క అంతర్గతమైన భావం ఏమిటి అనే దాన్ని చర్చించడానికి విద్యార్థులను పురిగొల్పు.

స్వామీజీ బోధనలు కేవలం పఠించడం వల్ల ఏ విధమైన ప్రయోజనమూ ఉండదు. వాటి అంతరార్థాలను శోధించి, వాటిని తమ నిత్యజీవితంలో ఆచరణలో పెట్టాలి. స్వామీజీ పలుకులు విశ్వజనీన సత్యాలు. పైగా శాస్త్రసమ్మతంగా ఆమోదం పొందిన సత్యాల లాంటివి.

మొదట విద్యార్థులతో ఈ క్రింది పుస్తకాలను చదివిస్తే వారిలో ఉత్సుకత పెరుగుతుంది:

1. స్వామి వివేకానంద జీవిత చరిత్ర.
2. స్వామి వివేకానంద లేఖావళి.
3. ప్రాచ్యము - పాశ్చాత్యము.
4. పరివ్రాజక అనుభవాలు (మెమోరీస్ ఆఫ్ యూరోపియన్ ట్రావెల్).
5. స్వామి - శిష్య సంవాదం.

ఈ పుస్తకాలన్నీ చదవడం పూర్తయ్యేసరికి నువ్వు ఇక ప్రత్యేకంగా స్వామీజీ పుస్తకాలను చదవాల్సిందిగా వారిని ప్రోత్సహించవలసిన పని ఉండదు. విద్యార్థులు వారంతట వారే సంతోషంగా ఆంగ్లభాషలో గానీ, వారి మాతృభాషలో గానీ స్వామీజీ సాహిత్య సర్వస్వాన్ని పఠిస్తారు.

ఆదర్శవంతమైన జీవితం గడపడానికి మన సనాతన సంప్రదాయం సూచించిన కొన్ని అంశాలను విద్యార్థులకు తెలియజేస్తే ఎంతో బాగుంటుంది.

మొదటిది: మనం ఆనందమయంగా జీవించడానికి తగిన విధంగా మన జీవితాలను మలచుకోవాలి.

రెండోది: మనం మన జీవితాన్ని మలచుకునే శక్తి సామర్థ్యాల సహాయంతోనే మన కుటుంబ సభ్యులందరినీ సంతోషంగా ఉండేలా చేయగలుగుతాం.

మూడోది: మన చేష్టలు, ఆలోచనలు ఎల్లవేళలా విశ్వశాంతికి దోహదపడాలి.

దీని అర్థం ఏమిటంటే కుటుంబం ఒక శరీరం అనుకుంటే ప్రతి వ్యక్తీ ఆ శరీరంలోని ఒక భాగం. అలాగే సంఘాన్ని ఒక శరీరంగా భావిస్తే ప్రతి కుటుంబమూ ఆ శరీరంలోని ఒక అవయవం లాంటిది. క్లుప్తంగా చెప్పాలంటే మన వ్యక్తిగత జీవితం ఎల్లవేళలా సామాజిక జీవితంతో ముడిపడి ఉండాలని మనం భావన చెయ్యాలి.

మనం సర్వకాల సర్వావస్థలలోనూ "నేను నమ్మే దైవం సమస్త జీవజాలం యొక్క ఆత్మల సమ్మేళనం" అన్న స్వామీజీ సందేశాన్ని జ్ఞప్తిలో ఉంచుకోవాలి.

ప్రేమాశీస్సులతో...

స్వామి ప్రేమేశానంద

తెలుగుసేత : కె. త్రివిక్రమరావు

నవయుగ కర్త - మహాప్రవక్త

- ఆర్. కృష్ణ



"భారతీయ ఆత్మను సమగ్రంగా అవగాహన చేసుకోవాలంటే వివేకానందుని బోధనలను అధ్యయనం చేయాలి. ఆయన ప్రవచించిన ప్రతి వాక్యం నిర్మాణాత్మకమైంది" అని రవీంద్రనాథ్ టాగూర్ స్వామి వివేకానందని ప్రస్తుతించారు. విదేశీయుల పరిపాలనలో మగ్గుతూ, ఆత్మాభిమానం కోల్పోయి, నిస్తేజమై, నిద్రాణమై, నిర్వీర్యమైన జాతిని జాగృతం చేసి, 'ఆత్మవిశ్వాసాన్ని రగిల్చి, హైందవ సంస్కృతీ విశిష్టతను గుర్తింపజేసి, ప్రజల హృదయాలను నవచైతన్యంతో పులకింప జేసిన మహనీయులలో స్వామి వివేకానందుడు అగ్రగణ్యుడు. భారతదేశ చరిత్ర మీద అతడు వేసిన ముద్ర ప్రగాఢమైనది. ఏ నాటికీ చెరగనది.

1893లో అమెరికాలో చికాగో నగరంలో సర్వమత మహాసభలో ఆయన ఉపన్యాసం ఎలాంటి సంచలనాన్ని కలగజేసిందో, విద్యుత్ప్రవాహంలా ప్రపంచాన్ని ఎలాంటి సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తిందో తెలియని వ్యక్తి ఉండడు. వైదిక వాఙ్మయాన్ని విశదీకరించేటప్పుడు ఆయన ప్రదర్శించిన పాండితీ ప్రకర్ష, విశ్లేషణా వైదగ్ధ్యం, ఆంగ్ల భాషా వైదుష్యం, అమేయమైన ధారణాశక్తి, వాగ్విభూతి నిరుపమానాలు. ఆయన మాతృదేశానికి తిరిగివచ్చినప్పుడు ఏ చక్రవర్తికీ, ప్రపంచంలో ఏ వ్యక్తికీ లభించని గౌరవం, సత్కారం ఆయనకు లభించాయి.

స్వామి వివేకానంద వేదాంతాన్ని విదేశాలలో సిద్ధాంతపరంగా బోధించారు. స్వదేశంలో ఆచరణీయమైన జీవన విధానంగా విశదీకరించారు. వేదాంత తత్త్వం, మతాచరణ, నైతిక సూత్రాలు ప్రజల నిత్యజీవితంలో ముడిపడి ఉండాలన్నది ఆయన సిద్ధాంతం. దేశంలోని దుర్భర దారిద్ర్యాన్ని చూసి ఆయన చలించారు. మండే కడుపులకు తత్త్వబోధ నిరర్థకమని భావించి, దరిద్రులనూ, దీనులనూ, ఆర్తులనూ, ఉద్ధరించడం జీవిత పరమావధిగా పెట్టుకున్నారు. పాశ్చాత్యుల కార్యాచరణ శీలత్వాన్నీ, భౌతిక విజ్ఞాన సంపదనూ, సాంకేతిక నైపుణ్యాన్నీ, ఉత్పాదక సామర్థ్యాన్నీ ప్రశంసించి, వారి పద్ధతులను మన దేశం అనుకరించి, భౌతిక సంపదను పెంపొందించి, ప్రజల జీవిత ప్రమాణాలను మెరుగుపరచాలని ఉద్ఘాటించారు. భారతీయుల ఆధ్యాత్మిక ప్రవృత్తితో పాశ్చాత్యుల వైజ్ఞానిక సంపదను ఆర్థిక శక్తిని మేళవిస్తేనే కానీ, మానవజాతికి సుఖశాంతులు ప్రాప్తించవని భావించారు.

వివేకానందుని దృష్టిలో మతమన్నది నిత్య లౌకిక జీవనానికి సంబంధించిన వ్యాసంగం కానే కాదు. ప్రతి మానవునిలోని దైవీ సంపదను జాగృతం చేసి, మహోన్నతమైన భూమికలను అధిరోహింపజేయగలిగేదే మతం. ప్రతి వ్యక్తికీ బలాన్నీ, ఓజస్సునూ, తేజస్సునూ, మానవతనూ ప్రసాదించేదే మతం. అజ్ఞానాన్నీ, సంకుచితత్వాన్నీ, భయాన్నీ, ఆందోళననూ, సంకోచాలనూ, దారిద్ర్యాన్నీ పారద్రోలేదే మతం. ఏ వ్యక్తి అయినా తన మతమే సర్వోత్కృష్టమైందనీ, అదే కలకాలం ఉండాలనీ, మిగిలినవన్నీ నిశ్శేషంగా సమసిపోవాలనీ కోరుకుంటే అతనిపై నాకు అపారమైన జాలి కలుగుతుందని స్వామి వివేకానంద ఉద్ఘాటించారు.

హృదయాంతరాళం తీవ్రంగా స్పందించి, ఒక సందర్భంలో ఆయన జాతిని ఉద్దేశించి అన్న మాటలు: "ఓ ధీరుడా! మరింత ధీరుడివికా! ధైర్యం వహించు, నువ్వు భారతీయుడవైనందుకు గర్వించు. నేను భారతీయుడిని, ప్రతి భారతీయుడూ నా సోదరుడు అని సగర్వంగా ప్రకటించు. భరత భూమే నా అత్యున్నత స్వర్గం. భారతదేశ శ్రేయస్సే నా శ్రేయస్సు అని ఎలుగెత్తిచాటు".

ఎందరెందరో మహనీయులు స్వామి వివేకానందుని స్ఫూర్తితో తమ దేశభక్తిని ద్విగుణీకృతం చేసుకున్నారు. "హిందూమతాన్నీ, భారతదేశాన్నీ కాపాడిన మహనీయుడు స్వామి వివేకానంద. ఆయన జన్మించి ఉండకపోతే భారతదేశంలో హిందూమతం ఎప్పుడో అంతరించి ఉండేది. మనం స్వాతంత్ర్యం సాధించి ఉండేవాళ్ళం కాదు" అని డాక్టర్ చక్రవర్తుల రాజగోపాలాచారి, వివేకానందునికి నివాళి అర్పించారు.

కులమత వైషమ్యాలతో, విద్వేషాలతో విచలితమవుతున్న మన జాతికి ఈ నవ యుగకర్త ప్రబోధాలు నేటి తరానికి ఔషధాలు. ❖

వివేకానందుని మాతృభక్తి

– స్వామి తథాగతానంద

నరేంద్రుడు, తల్లి భువనేశ్వరీదేవికి గారాబు బిడ్డ. బాల్యం నుంచీ వివేకానందునికి ఆమె పట్ల ఎంతో ప్రేమ ఉండేది. వివేకానందులు జునాగఢ్‌లో ఉన్న మిత్రుడు హరిదాస్ దేశాయ్‌కి 1894 జనవరి 29న వ్రాసిన లేఖలో ఇలా వెల్లడించారు: 'మీరు మా తల్లీ తమ్ముళ్ళను చూసేందుకు వెళ్ళడం నాకు సంతోషాన్నిచ్చింది. నా హృదయంలోని సున్నితమైన భాగాన్ని స్పృశించారు. నేను కఠిన హృదయుణ్ణి కాను. ఈ ప్రపంచంలో నేను ప్రేమించే ఒకే ఒక్క వ్యక్తి నా తల్లి'.

స్వామీజీ వ్రాసిన 775 లేఖలు ప్రచురితమయ్యాయి. వాటిలో వారు తమ తల్లి గారికి వ్రాసినవి కానీ, ఆమె ఆ కుమారునికి వ్రాసిన లేఖ కానీ లేదు. 1893లో ప్రపంచ సర్వమత మహాసభలో వివేకానందుని ఖ్యాతి విశ్వవ్యాప్తమైంది. "అసూయాగ్రస్తుడైన బ్రహ్మసమాజ నాయకుడు ప్రతాప చంద్ర మజుందార్, నా గురించి అపఖ్యాతి కల్గించే దుష్ప్రచారం చేశాడు. ఈ విషయం గురించి నేను ఏ మాత్రమూ పట్టించుకోదలచ లేదు. నాకు వయోవృద్ధురాలైన తల్లి ఉంది. ఆమె జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొంది. మజుందార్ చేస్తున్న దుష్ప్రచారం ఆమెను మృత్యువుకు చేరువ చేయవచ్చు కానీ దేవుడు గొప్పవాడు. అమృతపుత్రులకు కీడు చేయడం అసాధ్యం" అని పేర్కొన్నారు.

1898 నవంబర్ 22న స్వామి వివేకానంద బేలూరు మఠం నుంచి తమకు అత్యంత ప్రీతిపాత్రుడైన ఖేత్రీ మహారాజ్ అజిత్ సింగ్‌కు "నా జీవితంలో మిమ్మల్ని మాత్రమే మిత్రుడిగా భావించాను. అందువల్ల నా మనస్సులోని భావాలను స్పష్టపరుస్తున్నాను. లోకోద్ధరణకు పూనుకొని, కన్నతల్లిని అలక్ష్యం చేశానన్న బాధ అమితంగా ఉంది. నా చివరి కోరిక ఒక్కటే. నా మాతృమూర్తి వద్ద ఉంటూ ఆమెకు సేవ చేయడం. దానివల్ల ఆమె శేష జీవితం ప్రశాంతంగా ఉంటుంది. ప్రస్తుతం ఆమె ఒక పూరి గుడిసెలో ఉంటున్నారు. ఆమెకొక చిన్న గదిని నిర్మించాలని అనుకుంటున్నాను. నా సొంత పనుల కోసం ఎవరినీ ఇంత వరకూ ఏమీ అడగలేదు. నా జీవితంలో మొట్టమొదటి సారిగా ఈ ఉపకారం చేయాల్సిందిగా కోరుతున్నాను. ఐరోపా నుంచి నాకు అందిన పైకాన్ని అంతటినీ శ్రీరామకృష్ణమిషన్ సేవాకార్యాలకు వినియోగించడం జరిగింది."

స్వామీజీకి తన మాతృమూర్తి పట్ల ఉన్న ప్రేమను ఈ లేఖలోని ప్రతీ అక్షరం నిరూపిస్తోంది. వజ్రం లాంటి కాఠిన్యంతో పాటు పుష్పం లాంటి కోమలత్వాన్ని ఈ లేఖలో గమనించగలం.

17-01-1900 అమెరికన్ శిష్యురాలు ఓబెల్‌కు వ్రాసిన ఒక లేఖలో "నాకోసం నా తల్లి ఎన్నో కష్టాలను అనుభవించింది. ఆమె చివరిరోజులు ప్రశాంతంగా ఉండేలా ప్రయత్నించాలి. ఆదిశంకరులు ఆ రీతిగా తన తల్లికి సేవలందించారు" అని వ్రాశారు.

వివేకానందులు బాల్యంలో తీవ్ర అనారోగ్యానికి గురైనప్పుడు, భునేశ్వరీదేవి కాళీఘాట్‌లోని కాళికాంబను ప్రార్థించి, కోలుకున్న తర్వాత ప్రత్యేక పూజలు చేస్తానని మొక్కుకుంది. ప్రస్తుతం కూడా స్వామి ఆరోగ్యం దెబ్బతిన్నదని విని, కాళీ ఆలయానికి వెళ్ళి, గంగానదిలో స్నానం చేసి తడిగుడ్డలతో కాళీమాత విగ్రహానికి మూడు మార్లు అంగప్రదక్షిణ చేసింది. దేవాలయం చుట్టూ ఏడుమార్లు ప్రదక్షిణ చేసింది.

తల్లి కోరిక మేరకు ఢాకాలోని చంద్రనాథ్ ఆలయానికీ, అస్సాంలోని కామాఖ్య క్షేత్రానికీ, పూరీలోని జగన్నాథ క్షేత్రానికీ ఆమెను స్వామీజీ తీసుకువెళ్ళారు. త్యాగమూర్తి అయిన భువనేశ్వరీదేవి 1911 జూలై 25న దివంగతులయ్యారు. లోకోద్ధరణ కోసం మాతృభక్తి పరంపరను స్వామి వివేకానంద అందించారు. ❖ **అనువాదం : జానమద్ది హనుమచ్ఛాస్త్రి**

‘శ్రీరామకృష్ణ ప్రభ’ కానుక పథకం

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీ జి. శ్రీనివాసన్, అశోక్‌నగర్, కర్నూలు - 518 005	జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర), బద్వేల్, కడప జిల్లా
శ్రీమతి పి. జ్యోతి, శ్యామలానగర్, గుంటూరు - 522 006	శ్రీవేంకటేశ్వర బాల కుటీర్, శ్యామలానగర్, గుంటూరు - 522 006
శ్రీమతి ఫణి రాజకుమారి,బురన్‌పురం,ఖమ్మం (కీ।।శే।। వి. చంద్రశేఖర్ జ్ఞాపకార్థం)	శ్రీ భాస్కర మెమోరియల్ విద్యానికేతన్, మీనవోలు, ఖమ్మం జిల్లా
శ్రీమతి సి.ఇందిర, రామగుండం, కరీంనగర్ జిల్లా	జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల(బాలికల), పాలకొండ, శ్రీకాకుళం జిల్లా
(కీ।।శే।। విశ్వనాథ్‌రావు జ్ఞాపకార్థం)	జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కాగితాపల్లి, శ్రీకాకుళం జిల్లా
" " "	జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, వీరఘట్టం, శ్రీకాకుళం జిల్లా
శ్రీ ఎస్. విశ్వేశ్వరరావు, సురవరం, కొమ్మనాపల్లి, శ్రీకాకుళం జిల్లా	సూర్య నాలెడ్జ్ సెంటర్, తీమర, పాతపట్నం, శ్రీకాకుళం జిల్లా
శ్రీ బి. ధర్మేందర్ రెడ్డి, పోశబ్ గుట్ట, మహబూబ్‌నగర్.	మహబూబ్‌నగర్ జిల్లాలోని 15 పాఠశాలలకు,
" " "	హైదరాబాద్ జిల్లాలోని 15 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.
శ్రీ సి. కాళిదాస్, కాశీబుగ్గ, శ్రీకాకుళం - 532 222	జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కాశీబుగ్గ, శ్రీకాకుళం జిల్లా.
శ్రీ దక్షిణా మూర్తి, రామనాథపురం కాలనీ, హైదరాబాద్ (కీ।।శే।। గంగరాజు పూర్ణ చిదంబరరావు జ్ఞాపకార్థం)	వివేక వర్ధిని డిగ్రీ కళాశాల, జామ్‌బాగ్, హైదరాబాద్-500 095
శ్రీ మిరియాల రామచంద్రయ్య, ఎన్నారం, రామన్నపేట్, నల్గొండ జిల్లా	జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ఎన్నారం, రామన్నపేట్, నల్గొండ జిల్లా
శ్రీ ఫణిరెడ్డి గోవిందు, రాజమండ్రి.	గ్రామ పంచాయతీ, ఇలప్పనైపాడు, మండపేట, తూ.గో.జిల్లా
శ్రీ ఆర్ రాజశేఖర్, మెహిదీపట్నం, హైదరాబాద్	వనజ చంద్ర పబ్లిక్ స్కూల్, గూడవల్లి, గుంటూరు జిల్లా -522 229
" " "	ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, మంత్రిపాలెం, గుంటూరు జిల్లా
శ్రీ రామకోటయ్య గారి మనుమరాలు పి. వనజ	జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, పెదపురి, అమృతలూరు, గుంటూరు
శ్రీమతి & శ్రీ రామారావు అగడ్కర్,	ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అగ్రహారం, వేములవాడ, కరీంనగర్ - 505 302
శ్రీ జయనాయక్, విద్యుత్‌నగర్, అనంతపూర్ (కీ।।శే।। ఎస్.గాంగే నాయక్ జ్ఞాపకార్థం)	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కందుకూరు, అనంతపురం జిల్లా
శ్రీ తుమ్మల సంతోష్ రెడ్డి, బోయిన్‌పల్లి, సికింద్రాబాద్	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యెలగండ్ల, కరీంనగర్ జిల్లా
శ్రీ సి.ఎస్. రామాంజనేయ రెడ్డి, వేంపల్లి, కడప జిల్లా	టి.ఎస్. జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాల, వేంపల్లి, కడప
" " "	టి.ఎస్. జిల్లా పరిషత్ (బాలికల) ఉన్నత పాఠశాల, వేంపల్లి, కడప
" " "	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తాళ్ళపల్లి, కడప - 516 350

With Best compliments from : **Sri D. Ramesh,** Managing Director

Hotel Sri Krishna Residency

S.R. Nagar, Hyderabad - 500 073

‘శ్రీరామకృష్ణ ప్రభ’ మాసపత్రికను 2000 పాఠశాలలు, కళాశాలలకు స్పాన్సర్ చేశారు.

With Best compliments from :

Smt. KUSUMAMMA (in memory of **Smt. SHYAMALA DEVI**)

Ashok Nagar, Hyderabad - 500 020

‘శ్రీరామకృష్ణ ప్రభ’ మాసపత్రికను 1000 పాఠశాలలు, కళాశాలలకు స్పాన్సర్ చేశారు.

ఈ పథకం ద్వారా శ్రీరామకృష్ణ ప్రభను మరింతమందికి చేరువ చేస్తున్న దాతలకు కృతజ్ఞతలు.

నా జీవితంలో స్వామి వివేకానంద

ఆ వాక్యాలు 'అమృత తుల్యాలు'

– పి. వీరబాబు

నా పేరు పెద్దపల్లి వీరబాబు. మాది తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ. నేను 10వ తరగతి చదువుతున్న రోజుల్లో, అనుకోకుండా మా ఊళ్ళో ఉన్న జిల్లా గ్రంథాలయానికి వెళ్ళాను. గ్రంథాలయంలో ఉన్న 'భారత జాతికి నా హితవు' అనే స్వామి వివేకానంద పుస్తకాన్ని చదివాను. ఆ పుస్తకం చదవక ముందు నేను ఒక సాధారణ విద్యార్థిని. ఆ పుస్తకంలో ఉన్న వాక్యాలు 'అమృత తుల్యాలు'.

1. కాదు. "నా చేత కాదు" అని ఏనాడూ అనుకోవద్దు. మీరు అపార శక్తిమంతులు.
2. బలహీనతకు పరిష్కారం దాన్ని గురించి చింతించడం కాదు. బలాన్ని గురించి ఆలోచించడమే.
3. మిమ్మల్ని మీరు బలహీనులుగా భావించుకుంటే మీరు బలహీనులే అవుతారు. బలవంతులుగా భావించుకుంటే బలవంతులే అవుతారు.

– పై మూడు వాక్యాలు నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. అప్పటి నుంచీ నేను చదవగలను, నేను ఏదైనా సాధించగలను అనే ఆత్మవిశ్వాసం కలిగింది. అదే ఆత్మవిశ్వాసంతో చదివాను. 10వ తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుణ్ణి అయ్యాను. అదే విధంగా ఇంటర్ మీడియెట్‌లో కూడా ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాను. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నాను. డిగ్రీ పూర్తి చేశాక కలకత్తాలో ఉన్న "రామకృష్ణ మఠం (బేలూరు మఠం)ను సందర్శించాలనీ, వివేకానంద లాగా భారతీయులకు సనాతన ధర్మం గురించి చెప్పాలనీ నా ఆశ. 'ఇదేమిటి! భారతీయులకు సనాతన ధర్మం గురించి వేరే చెప్పాలా?' అని సందేహించకండి. ఈ మాటలు ఎందుకు అన్నానంటే, పాశ్చాత్య పోకడలో పడి ఆధ్యాత్మికతను మరిచిపోతున్న భారతీయులకు సనాతన ధర్మంలో ఆధ్యాత్మికత ప్రాముఖ్యాన్ని తెలియజేయాలి అన్నదే నా కోరిక.

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని, భారతదేశానికి పూర్వ ఔన్నత్యాన్ని తీసుకురావాల్సిన బాధ్యత ఆధునిక యువతరం మీద ఉంది. ❖ (పి. వీరబాబు, సూర్యారావుపేట, కాకినాడ)

'స్ఫూర్తి భావనలకు స్వాగతం'

జీర్ణమయిన దుస్తుల్ని త్యజించినట్లు ఈ శరీరాన్ని త్యజించినా నా భావాలతో ముందు తరాలను నిరంతరం చైతన్య పరుస్తూనే ఉంటాను అనేవారు స్వామి వివేకానంద. విశ్వానికే ఆత్మవిశ్వాసాన్ని ప్రబోధించిన యుగపురుషుడాయన. ఆబాల గోపాలాన్నీ ఉత్తేజపరిచే ఉత్తుంగ చైతన్య సాగరం స్వామీజీ.

స్వామి వివేకానంద ఈ ప్రపంచం నుంచి భౌతికంగా నిష్క్రమించి ఒక శతాబ్దం అయినా వారి స్ఫూర్తి మాత్రం ఆచంద్రార్కం మనల్ని మేల్కొలుపుతూనే ఉంటుంది. అలా ఆ మహనీయుని జీవితంతో ఉత్తేజితులైన వారి అనుభూతులకు, అనుభవాలకు 'శ్రీరామకృష్ణ ప్రభ' స్వాగతం పలుకుతోంది.

స్వామి వివేకానంద జీవితంలోని ఒక సంఘటన కావచ్చు, సంభాషణ కావచ్చు.... ఉత్తరం కావచ్చు, ఉపన్యాసం కావచ్చు... ఏదైనా మిమ్మల్ని మహత్తరంగా ప్రభావితం చేసి ఉంటుంది. ఆ అనుభూతిని, అనుపమానమైన స్ఫూర్తిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులతో పంచుకోండి.

సమస్యల సాగరంలో చిక్కుకొని చుక్కాని లేని అగమ్యగోచరమైన నేటితరానికి స్వామి వివేకానంద సాహిత్యం ఆశాదీపమని మీ అనుభవాలు నిరూపిస్తాయి. మీ అనుభవాలను, అనుభూతులను వ్రాసి మీ ఛాయచిత్రం (కలర్ ఫోటో)తో సహా పంపిస్తే 'నా జీవితంలో స్వామి వివేకానంద' అనే శీర్షికలో ప్రచురిస్తాం.

మీ అనుభవాలను, భావనలను పంపవలసిన చిరునామా
'నా జీవితంలో స్వామి వివేకానంద'
శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం,
దోమల్ గూడ, హైదరాబాద్ – 500 029

సద్గురు శ్రీశేషాద్రి స్వామి

– గుళ్ళపూడి శ్రీనివాసకుమార్

తమిళనాడులోని తిరువణ్ణామలై (అరుణాచలం) క్షేత్రాన్ని తన నివాసంగా చేసుకుని ఎందరో భక్తులను ఆధ్యాత్మికంగా ఉద్ధరించిన శ్రీరమణ మహర్షి గురించి తెలియనివారుండరు. భారతదేశపు ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహర్షుల్లో ఒకరైన వీరి గురించి తెలిసినవారికి యోగిపుంగవులైన శ్రీశేషాద్రిస్వామి గురించి కూడా తప్పక తెలిసి ఉంటుంది. రమణ మహర్షిని స్కందావతారంగానూ, శేషాద్రిస్వామిని పార్వతి అవతారంగానూ భావించడం కద్దు.

బాల్యంలో రమణమహర్షి అక్కడి అరుణాచలేశ్వరాలయంలో ఉన్న పాతాళలింగ గుహలో తపస్సు చేసుకునేవారు. అత్యంత పురాతనమైన ఆ కటిక చీకటి గుహలోకి అడుగుపెట్టే ధైర్యం ఎవరికీ లేదు. వారక్కడ తపస్సు చేసుకునేవారు. అందులోని కీటకాలు, పురుగులు ఆయన తొడల కింద రక్తం కారేలా తొలిచేస్తున్నప్పటికీ, పుండ్లు ఏర్పడినా వారు ధ్యాన పారవశ్యంలో వీటిని లక్ష్యపెట్టేవారు కాదు. అక్కడి తుంటరి బాలురు ఆ గుహలో పడేలా రాళ్ళు, పెంకులు విసురుతుండేవారు. ఈ బాలుర చేష్టలతో రమణుల తపస్సుకు అంతరాయం కలుగకుండా శ్రీశేషాద్రి స్వామి వారిని కాపాడుతుండేవారు. తపస్సమాధి లోనున్న బాల రమణుల ఉనికిని లోకానికి వెల్లడించినవారు శ్రీశేషాద్రి స్వామి. బాల రమణుని చూపించి, "నా బిడ్డ లోపల తపస్సు చేసుకుంటున్నాడు" అని చెప్పేవారు. "నేను పార్వతినని చెప్పలేదా? అడుగో కందుడు (స్కందుడు)" అనేవారు. రమణ మహర్షిని పలువురు అప్పట్లో చిన్న శేషాద్రి అని కూడా పిలిచేవారు.

ఇక శేషాద్రి స్వామి విషయానికి వస్తే – కాంచీపురం వీరి స్వస్థలం. "అరుణాచలా! అంటే చాలు. ముక్తిని ప్రసాదిస్తాడు" అని చెప్పి మరణించిన తన తల్లి చివరి పలుకులతో ప్రభావితులైన శేషాద్రి స్వామి సుమారు 19 ఏళ్ళ వయసులో అరుణాచలం వచ్చేశారు. తపస్సాధనలతో ఇక్కడే స్థిరంగా ఉండిపోయారు. బాల్యం నుంచీ ప్రాపంచిక విషయాలకు దూరంగా ఉండేవారు. ఎల్లప్పుడూ భగవన్నామ జపం చేస్తూ, ఆధ్యాత్మికంగా ఎంతో సమున్నతిని పొందారు. ప్రగాఢమైన సమాధి స్థితికి చేరుకునేవారు. వీరిని ప్రాపంచిక జీవితంలోకి తీసుకురావడానికి ప్రయత్నించిన బంధువుల ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఒకసారి బంధువులు శేషాద్రి స్వామిని గదిలో పెట్టి తాళం వేశారు. తరువాత తలుపులు తెరచి చూడగా, స్వామి కనిపించ లేదు. వీరి దివ్యత్వాన్ని గ్రహించిన ఆ బంధువులు తమ ప్రయత్నాలను మానుకున్నారు.

అవసరమైనప్పుడల్లా తన లీలలను చూపిన శ్రీశేషాద్రి స్వామి దివ్యజీవితంలో ఎన్నో అమృత గుళికలున్నాయి. ఎవరైనా నూతన వస్త్రాలు తనకు సమర్పిస్తే స్వామి, వాటిని భిక్షకులకు ఇచ్చివేసి వారి చిరిగిన బట్టలను తాము ధరించేవారు. స్త్రీలను చూసి, "నా తల్లి" అని చెప్పి నమస్కరించేవారు. నిద్రపోయే వారిని చూసి "నిద్రపోవద్దు. యముడు పట్టుకుపోతాడు" అనేవారు. అంటే జ్ఞానదృష్టితో మెలకువగా ఉండమని అర్థం. ఒకేసారి పలుచోట్ల దర్శనమివ్వడం, వందల సంఖ్యలో ఆకాశంలో గరుడ పక్షులను చూపడం చేసేవారు.

శేషాద్రి స్వామి పిచ్చివారిలా నటించేవారు. దుకాణంలోకి వెళ్ళి అక్కడి గల్లాపెట్టెలోని చిల్లర విసిరివేస్తే ఆ దుకాణ దారుకి మరింత లాభం వచ్చేది. కన్యలను తాకి ఆశీర్వదిస్తే వివాహమయ్యేది. వీరు ఎవరితోనైనా మాట్లాడినా, తిట్టినా, కొట్టినా వారికి ప్రయోజనాలు ఒనగూడేవి. పశుపక్ష్యాదులపై సైతం తన కరుణను ప్రసరించారు. "మనందరమూ ఒకనాడు వెళ్ళిపోవలసినవారమే... మనకు ఒక్క వస్తువు కూడా సొంతమైనది లేదు" అని స్పష్టం చేసేవారు.

భక్తులకు ఆయన త్రిమూర్తులనూ, పార్వతీ దేవినీ చూపించారట. స్వయంగా వారే పరాశక్తిగా దర్శనమిచ్చారట. తిరువణ్ణామలైలో శ్రీరమణాశ్రమం పక్కనే ఉన్న శ్రీశేషాద్రి స్వామి సమాధి వద్ద ప్రతి ఏటా జనవరిలో ఎంతో వైభవంగా ఆరాధనోత్సవాలు జరుగుతుంటాయి. ❖

అహం వదిలితే ఆ దేవుడే మన చెంత!

- స్వామి వినిశ్చలానంద

మనలో అహంకారం నశించినప్పుడు భగవంతుడు మనవాడు అవుతాడు. నేను, నాది, నా అనే అర్థాలకు వాడు, వాడిది, వాడే అనే భావాన్ని జొప్పించాలి. భగవంతుడు తప్ప అన్యం ఏదీ లేదు అనే సత్యానికి మనం దగ్గర కావాలి. 'సత్య నిష్ఠయే ఈ కలియుగానికి తరణోపాయం' అని శ్రీరామకృష్ణులు వాక్రుచ్చారు. సత్యం అన్నది సత్తుకు సంబంధించినటువంటిది. సత్ పరబ్రహ్మ వస్తువు. సత్‌యే ఆనందం. ఆనందమే బ్రహ్మం.

ఒక వ్యక్తి తన స్వగ్రామం నుంచి కాలి బాటలో మరొక గ్రామానికి పని నిమిత్తం వెళ్ళాడు. తిరుగు ప్రయాణంలో చీకటి పడిన కారణంగా దారి తప్పి దురదృష్టవశాత్తూ ఒక పాడుబడిన బావిలో పడ్డాడు. అదృష్టమో, దురదృష్టమో తెలియదు కానీ అతని చేతికి చెట్టు కొమ్మ ఒకటి దొరికింది. ఆ చెట్టు కొమ్మను పట్టుకు వ్రేలాడుతూ పైకి రావడానికి విశ్వప్రయత్నం చేసినప్పటికీ సాధ్యపడక అలాగే వ్రేలాడుతూ ఉండిపోయాడు. ఉదయం వెలుతురు వచ్చిన వెంటనే బావిలో సగం లోతులో వ్రేలాడుతున్న అతను క్రిందకు చూసినప్పుడు పెద్ద పెద్ద బండ రాళ్ళు కనబడ్డాయి. వాటిని చూసి, 'ఆహా! ఏమి నా అదృష్టం ఈ కొమ్మ దొరికి ఉండకపోతే ఈ పాటికి చచ్చిపోయి ఉండేవాణ్ణి' అని అనుకొని భగవంతునికి కృతజ్ఞతలు తెలియజేశాడు.

ఆపద నుండి బయట పడడానికి ఇంకొకరి సహాయం కోసం ఎంత అరిచినా ఎవరూ రాలేదు. అరిచి అరిచి సొమ్మసిల్లిన అతను వీళ్ళనూ వాళ్ళనూ పిలిచి ప్రయోజనం ఏమిటి భగవంతుణ్ణే పిలుస్తాను అని అనుకొని భగవంతుణ్ణి పిలవడం మొదలెట్టాడు.

కొద్దిసేపటికి ఒక వ్యక్తి బావి వద్దకు వచ్చి 'నన్ను ఎందుకు పిలిచావు' అని లోపల ఉన్న వ్యక్తిని అడిగాడు. 'నిన్ను ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదు. నువ్వు ఎవరు?' అని బావిలోని వ్యక్తి అడిగాడు. దానికి బదులుగా 'అదేమిటి! నేనే భగవంతుణ్ణి! నీవు పిలిచావు కాబట్టి వచ్చాను' అన్నాడు.

'అవును. నువ్వు నిజంగా భగవంతుడివే! ఆలస్యం చేయక నన్ను పైకి లాగి కాపాడు' అని బావిలోని వ్యక్తి వేడుకున్నాడు. 'నిన్ను కాపాడడానికే వచ్చాను, అయితే దానికి ముందు నేను వేసే కొన్ని ప్రశ్నలకు నువ్వు సమాధానం చెప్పవలసి ఉంటుంది' అన్నాడు. 'అడగవలసింది ఏమిటో త్వరగా అడుగు' అన్నాడు లోపలి వ్యక్తి.



'నన్ను నిజంగా భగవంతుణ్ణి అని నీవు విశ్వసిస్తున్నావా?'

దానికి బదులుగా బావిలోని వ్యక్తి, 'విశ్వసిస్తున్నాను. నీవు నిజంగా భగవంతుడివే' అన్నాడు.

'నిన్ను కాపాడడం నా వల్ల సాధ్యమవుతుందని నీవు నిజంగా నమ్ముతున్నావా?'

'నమ్ముతున్నాను' అన్నాడు.

'నేను ఏది చెప్పినా చేస్తావా?'

'కచ్చితంగా చేస్తాను. నా ప్రాణమైనా ఇస్తాను' అన్నాడు.

'అలా అయితే నేను చెప్పినట్లు నువ్వు చెయ్యి. నువ్వు ఏ కొమ్మనైతే పట్టుకొని ఉన్నావో, దాన్ని వదిలివేయి. నేను నిన్ను కాపాడతాను' అన్నాడు భగవంతుడు.

బావి లోపలి వ్యక్తి బయటి వ్యక్తిని చూసి, ఆయన చేతిలో ఏ విధమైన తాడు కానీ, నిచ్చెన కానీ, మరే విధమైన పరికరం కానీ లేకపోవడంతో సందిగ్ధంలో పడ్డాడు. కొమ్మను వదిలితే భగవంతుడు రక్షించడం మాట అటుంచి, ముందు కిందనున్న బండరాళ్ళ మీద పడి, తల పగిలి చస్తానని అనుకొన్నాడు.

'ఇది చాలా కఠినమైన షరతు. కొమ్మను వదలడం తప్ప, నువ్వు ఏం చెప్పినా చేస్తాను' అన్నాడు బావిలోని వ్యక్తి.

'నువ్వు ఏమీ చేయనక్కరలేదు. కొమ్మను వదిలితే చాలు' అన్నాడు భగవంతుడు.

సరిగ్గా ఇదే రీతిగా మనం కూడా అహంకారమనే కొమ్మను పట్టుకొని వ్రేలాడుతున్నాం. ఎప్పుడైతే మనం ఆ అహంకారాన్ని వదులుకుంటామో, అప్పుడు భగవంతుడు తప్పకుండా మనల్ని కాపాడతాడు. కాబట్టి, మనమందరం అహంకార శూన్యులుగా మారాలి. ❖


కురు బంగారు నాగలి చేయించి, ఈశ్వరుణ్ణీ, యముణ్ణీ ప్రార్థించి వారి వాహనాలైన ఎద్దునీ, దున్నపోతునీ రప్పించి ఆ నాగలికి కట్టి తానే స్వయంగా భూమి దున్నసాగాడు. అది చూసి...
ఇంద్రుడు పరిహాసంగా... ఇది అర్థం లేని పని. అష్టాంగ యోగాలను మొలకెత్తించడం నీ వల్ల కాదు.
తరువాత విష్ణుమూర్తి అక్కడకు వచ్చాడు.
రాజా! బీజాలు లేకుండా అష్టాంగ ధర్మాలను ఎలా మొలకెత్తిస్తావు?
నా శరీరంలో అష్టాంగ ధర్మాలు ఉన్నాయి. ఈ భూమిని దున్నుతూ నా శరీరం క్రమంగా క్షీణించి భూమిలో కలసి పోతుంది. అప్పుడు ఆ ధర్మాలు మొలకెత్తుతాయి.
దానికి చాలా సమయం పడుతుంది. నీ శరీర భాగాలను నరికి నాకివ్వు! ఈ భూమిని నేను దున్నుతాను.


వెంటనే కురు తన కాళ్ళనూ, ఒక చేతిని నరికి...
స్వామీ! పొలాన్ని దున్ని, నా ఆశయాన్ని నెరవేరేలా ఆశీర్వదించండి.
కురురాజు అఖండ దీక్షకు మెచ్చి విష్ణుమూర్తి ఆయన్ని ఆశీర్వదించాడు.
కోల్పోయిన కాళ్ళూ, చేతులూ తిరిగి వచ్చాయి.
ఓ రాజా! ఈ క్షేత్రం నీ పేరు మీద కురుక్షేత్రంగా ప్రసిద్ధి కెక్కుతుంది. ఇక నుంచీ నేను, చంద్రుడు, వాసుకి, శంకుకర్ణుడు, సుకేశి, అజావనుడు ఈ క్షేత్రాన్ని రక్షిస్తాం. నువ్వు దివ్యశరీరంతో స్వర్గంలో స్థిరనివాసం ఏర్పరచుకుంటావు. ఇక్కడ యుద్ధంలో మరణించిన వారికి స్వర్గప్రాప్తి కలుగుతుంది.
కురురాజు స్వర్గలోకానికి చేరాడు.
కురుక్షేత్రంలో మరణిస్తే స్వర్గప్రాప్తి కలుగుతుంది కనుకనే కౌరవ పాండవులు ఇక్కడ యుద్ధం చేశారు. చరిత్రలో కురుక్షేత్రం పేరు ధర్మక్షేత్రంగా నిలిచిపోయింది.

గ్రంథ పరిచయం

ప్రశ్నోపనిషత్తు

జ్ఞానాన్వేషణలో...

వ్యాఖ్యానం : స్వామి జ్ఞానదానంద
వెల : రూ.20/-, పేజీలు : 104
ప్రతులకు : తెలుగు ప్రచురణల విభాగం
రామకృష్ణ మఠం, దోమలగూడ, హైదరాబాద్-500 029
Email: rktelugubook@gmail.com ఫోన్: 040-27631149

జ్ఞానాన్ని సముపార్జించడమూ, అలా సముపార్జించిన జ్ఞానాన్ని ఇతరులకు పంచి ఇవ్వడమూ ప్రాచీన భారతావనిలో ఒక తపస్సుగా శ్లాఘించబడింది. అటు వంటి జ్ఞానాన్ని సముపార్జించిన మునివరేణ్యుని అన్వేషిస్తూ విభిన్న ప్రాంతాల నుంచి ఆరుగురు సాధకులు బయలుదేరారు. చివరకు ఆ ఆరుగురు సముచిత గురువు వద్దకు వెళ్ళి, ఆయనను ఆరు ప్రశ్నలు అడిగారు. ఆ గురువు వాటికి తగిన జవాబు లిచ్చారు. ఈ ప్రశ్నోత్తరాలే ప్రశ్నోపనిషత్తుగా పరిణమించింది.



మనిషి, లోకం, భగవంతుడు - అనే వాటి సత్యాలను తనదైన కోణంలో ఈ ఉపనిషత్తు విచారణ చేసింది.

ప్రాణులు, మనిషి, ఆధ్యాత్మిక సాధనల గురించిన జ్ఞానాన్వేషణ క్రమంగా ఆధ్యాత్మిక అన్వేషణలో పరిణమించడం ప్రశ్నోపనిషత్తు చక్కగా చర్చించింది. మౌలిక శక్తియైన ప్రాణం గూర్చిన విశ్లేషణ దీన్లో చోటుచేసుకున్నది.

అనుసృజన సాఫీగా సాగడంతో పాటు, ఉపనిషత్తులను మొదటిసారి చదివే పాఠక మహాశయునికి భాష ఇట్టే అర్థమయ్యే సులభ శైలిలో ఉండడం విశేషం. ❖ - బ్రహ్మచారి హేమంత్



మూర్తిత్రయ ఆదర్శము

రచన : శ్రీ అనుభవానంద స్వామి
వెల : రూ.10/-, పేజీలు : 54

శ్రీరామకృష్ణ లీలా సంకీర్తన

రచన : శ్రీ అనుభవానంద స్వామి
శ్రీమాతాజీ త్యాగీశానందపురి
వెల : రూ.20/-, పేజీలు : 182

ప్రతులకు:శ్రీఅనుభవానంద గ్రంథమాల
11-1-13, ఎమ్.జి.రోడ్డు
బాపట్ల-522 101, గుంటూరు జిల్లా.



శ్రీఅనుభవానంద స్వామి సాధకుల ఉపయోగార్థం అనేక గ్రంథాలనూ, ఎన్నో కీర్తనలనూ రచించారు. శ్రీస్వామి రచించిన "మూర్తిత్రయ ఆదర్శం" అన్న పుస్తకం మొదట 1956లో ప్రచురింపబడింది; 2009లో మూడవ ముద్రణ వెలువడింది. ఈ పుస్తకంలో శ్రీరామకృష్ణుల సాధన సిద్ధుల రహస్యాల్నీ, శ్రీశారదాదేవి అవతార వైశిష్ట్యాన్నీ, స్వామి వివేకానందుని ఆదర్శవ్యక్తిత్వాన్నీ చక్కగా వర్ణించారు. ఈ చిన్న పుస్తకాన్ని భక్తులు చదివి తీరాలి అని చెప్పవచ్చు.

శ్రీ అనుభవానంద స్వామి అనేక కీర్తనలు రచించి ఆశ్రమాలలో తాము పాడి భక్తులచేత పాడించేవారు. ఆ కీర్తనలను 1938లో "శ్రీరామకృష్ణలీలా సంకీర్తన" పేరుతో ప్రచురించారు. నాటి నుండి నేటి వరకూ ఆరు మార్లు ముద్రింపబడిన ఈ పుస్తకం 2009లో ఏడవ మారు ముద్రింపబడింది. దీనిలో ఎన్నో కొత్త కీర్తనలు, భజనలు, అద్వైత కీర్తనలు, మంగళ హారతులు... చోటు చేసుకున్నాయి. ఈ కీర్తనలలో కొన్ని ప్రముఖ గాయనీ గాయకులు గానం చేసిన సి.డి.లు, కాసెట్లుగా విడుదల అయ్యాయి. భక్తులు దీనిలోని కీర్తనలను పాడి, తన్మయులై, శ్రీరామకృష్ణుల అనుగ్రహాన్ని పొందుతారనడంలో సందేహం లేదు. ❖ - శ్రీమతి ఎన్. శేషు

పండుగలు-పర్వదినాలు

జనవరి - 2010

01	శుక్రవారం	: కల్పతరు మహోత్సవం
06	బుధవారం	: స్వామి వివేకానంద జయంతి (తిథి ప్రకారం)
11	సోమవారం	: ఏకాదశి
12	మంగళవారం	: జాతీయ యువజన దినోత్సవం
14	గురువారం	: సంక్రాంతి
17	ఆదివారం	: స్వామి బ్రహ్మానంద జయంతి
19	మంగళవారం	: స్వామి త్రిగుణాతీతానంద జయంతి
26	మంగళవారం	: ఏకాదశి
30	శనివారం	: స్వామి అద్భుతానంద జయంతి

ఫిబ్రవరి - 2010

09	మంగళవారం	: ఏకాదశి
12	శుక్రవారం	: మహా శివరాత్రి (రాత్రంతా పూజ, భజన కార్యక్రమాలు)
16	మంగళవారం	: భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస జయంతోత్సవం (తిథి ప్రకారం)
25	గురువారం	: ఏకాదశి
28	ఆదివారం	: శ్రీ చైతన్య మహాప్రభు జయంతి

వ్యక్తిత్వవికాస సదస్సులు

విజయవాడ రామకృష్ణ మిషన్ సీతానగరంలోని 'వివేకానంద విద్యావిహార్' ప్రాంగణంలో 2009 నవంబర్ 27,28,29 తేదీల్లో యువజనుల, ఉపాధ్యాయుల, తల్లితండ్రుల సదస్సులను నిర్వహించింది. ఈ సదస్సులలో 700 మంది విద్యార్థులు, 300 మంది ఉపాధ్యాయులు, 400 మంది తల్లితండ్రులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ సదస్సుల్లో చెన్నై రామకృష్ణ ఆశ్రమ స్వామి బోధమయానందజీ, విశాఖపట్నం రామకృష్ణ ఆశ్రమ స్వామి గుణేశానందజీ, శ్రీ శంకరవ్రత బాగ్చి (గుంటూరు యస్.పి.), నాగార్జున విశ్వవిద్యాలయ రెక్టర్ ఆచార్య వియన్నరావు, డాక్టర్ కమలా ఎస్. జయరావు (హైదరాబాద్) పాల్గొని 'వివేకానంద సందేశం-జీవన వికాసం'; 'విజయం మన ముంగిటే'; 'ఉపాధ్యాయులే కరదీపికలు'; 'పిల్లల పెంపకంలో తల్లితండ్రుల పాత్ర' మొదలైన అంశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా స్ఫూర్తిదాయక సందేశాలతో ముద్రించిన రెండు స్వామి వివేకానందుని పోస్టర్లను ఆవిష్కరించారు. ❖

నివేదిక : స్వామి స్వసంవేద్యానంద

తమిళనాడు భావప్రచార పరిషత్ ప్రారంభోత్సవం

చెన్నై రామకృష్ణ మఠంలో 'తమిళనాడు రామకృష్ణ-వివేకానంద భావప్రచార పరిషత్'ను 2009 నవంబర్ 7వ తేదీన స్వామి రఘునాథానందజీ జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనప్రాయంగా ప్రారంభించారు. పూజ్య స్వామీజీ తమ ప్రసంగంలో "మూర్తిత్రయ సందేశ వ్యాప్తికి సేవా సమితులూ, రామకృష్ణ మఠ కేంద్రాలూ సంయుక్తంగా కృషి చేయాలనే ఉద్దేశ్యంతో రామకృష్ణ సంఘ 10వ సర్వాధ్యక్షులు పూజ్య స్వామి వీరేశ్వరానందజీ మహరాజ్ ఆదేశానుసారం బేలూరు మఠం ఆధ్వర్యంలో 1982లో 'రామకృష్ణ -వివేకానంద భావప్రచార పరిషత్' ప్రారంభించబడింది"అని తెలియజేశారు. తమిళనాడు భావప్రచార పరిషత్ అధ్యక్షులుగా స్వామి గౌతమానందజీ; ఉపాధ్యక్షులుగా స్వామి కమలాత్మానందజీ, స్వామి ఆత్మఘనానందజీ; కన్వీనర్‌గా శ్రీ ఎస్. పాండురంగన్; జాయింట్ కన్వీనర్లుగా శ్రీ సి. పళనీవేల్, శ్రీ ఎ. బాలసుందరం నియమితులయ్యారు. పరిషత్ అధ్యక్షులు స్వామి గౌతమానందజీ మాట్లాడుతూ "ఆధునిక సమాజానికి మూర్తిత్రయ సందేశం అత్యంత ఆవశ్యకం. ఈ మూర్తిత్రయ భావప్రచార ఉద్యమంలో గృహస్థ భక్తులూ, సన్న్యాసులూ కలిసి కృషి చేయాలి" అని సూచించారు. ఈ కార్యక్రమానికి తమిళనాడులోని వివిధ రామకృష్ణ మఠ కేంద్రాల స్వామీజీలూ, ఇతర మఠాల స్వామీజీలూ, మాతాజీలూ, సమితి సభ్యులూ విచ్చేశారు. ❖ నివేదిక : స్వామి అభిరామానంద

శ్రీరామకృష్ణ సేవా సమితి ప్రారంభోత్సవం : విజయనగరం జిల్లాలో ప్రప్రథమంగా శ్రీరామకృష్ణ సేవా సమితి **నెల్లిమర్ల** గ్రామంలో ప్రారంభించబడింది. విశాఖపట్నం రామకృష్ణ ఆశ్రమ స్వామి గరిమానందజీ సెప్టెంబర్ నెలలో ఈ సమితిని ప్రారంభించారు. సమితి సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రేమ సమాజంలోని అనాథలకు వస్త్రాలను పంపిణీ చేసింది. విజయవాడ రామకృష్ణ మిషన్ 'వివేక వాహిని' సౌజన్యంతో విజయనగరం జిల్లాలోని వివిధ కళాశాలలు, పాఠశాలల్లో వ్యక్తిత్వ వికాస సదస్సులను నిర్వహించింది. సమితిలో సత్సంగ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ❖ నివేదిక : తిరుమలరాజు జగన్నాథరాజు, కార్యదర్శి.

శ్రీ పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ వేదాధ్యయనానుసన్ధాన ప్రతిష్ఠానమ్

ప్రవేశ / ఉద్యోగ ప్రకటన

1. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది కోర్సులకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) 'వేదచూడామణి' : ఋగ్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క అధ్యయనము

యోగ్యతలు : మాతృభాషలో చదువగలిగి, వ్రాయగలిగి ఉండాలి.

వయస్సు : 8 నుంచి 10 సంవత్సరాల మధ్య

స్టైఫండ్ : నెలకు రూ. 1,000/-

(ఆ) 'వేదార్థచూడామణి' : ఋగ్వేదము/ యజుర్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క భాష్యాధ్యయనము

యోగ్యతలు : సంస్కృత పరిజ్ఞానముతో బాటు ఏదో ఒక వేదాన్ని పూర్తిగా అధ్యయనం చేసి ఉండాలి.

వయస్సు : 15 సం॥, ఆ పైన

స్టైఫండ్ : నెలకు రూ. 3,000/-

2. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది ఉద్యోగాలకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) వేదాధ్యాపకుడు : (సామవేదము/ అథర్వవేదము - వేదానికి ఒక్కొక్కరు చొప్పున రెండు ఖాళీలు)

కావలిసిన అర్హతలు : క్రమాంతము లేక పదాంతము

అదనపు అర్హతలు : ఏదైన మఱియొక వేదము/ వేదభాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము

అనుభవము : 2 సంవత్సరములు

సంభావన : నెలకు రూ॥ 8,000/- మొత్తము, సౌకర్యములతో

(ఆ) వేదభాష్యాచార్యుడు : (ఒక్కొక్క వేదానికి ఒక్కొక్కరు చొప్పున 4 ఖాళీలు)

విద్యార్హత : ఏదైనా వేద భాష్యంలో ఉత్తీర్ణత

అదనపు అర్హత : మరొక వేద భాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము

అనుభవార్హత : 5 సం॥

సంభావన : నెలకు రూ. 10,000/- మొత్తము, సౌకర్యములతో

ముద్రించిన దరఖాస్తు ఫారములను **శ్రీ పి. వేంకటేశ్వర్లు గారు, మేనేజింగ్ డైరెక్టర్, కాకతీయ సిమెంట్, సుగర్ & ఇండస్ట్రీస్ లిమిటెడ్, 'గురుకృప' (ఆంధ్రా బ్యాంకు ఎదురుగా), 1 - 10 - 140/1, అశోక్‌నగర్, హైదరాబాద్ - 500 020** (ఫోను: 040 - 27637717) నుంచి ప్రత్యక్షముగా గాని, పోస్టు ద్వారా గాని పొందవచ్చు. పూర్తి చేయబడిన ఆ ముద్రిత దరఖాస్తులను ఈ పై అడ్రసుకు పంపవలెను. అవసరాన్ని బట్టి ఖాళీలను పూరించుట లోనూ, అర్హతల సవరణ లోనూ మేనేజ్‌మెంటుకు అధికారము కలదు.

సం/-

హైదరాబాద్ కులప్రశాసకుడు

Sponsored by:

KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED

Regd. Office : 1 - 10 - 140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad - 500 020
Ph: 2763 7717, 2763 3627, Fax No. 040-27630172, Email: info @ kakatiyacement.com

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020 and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**





'ప్రభ'ంజనానికి పాఠకుల చేయూత....

ఆధునిక జీవన వికాసానికి.... ఆధ్యాత్మిక భావ పరివ్యాప్తికి కరదీపికగా నిలుస్తున్న 'శ్రీరామకృష్ణ ప్రభ'ను అశేష పాఠకులు ఆదరిస్తున్నందుకు ఆనందిస్తున్నాం.

మానవ విలువల సుసంపన్నానికి ఇతోధిక సాయమందిస్తున్న ఈ అక్షరామృతాన్ని మరింత మంది పాఠకులకు చేరువ చేయాలన్నదే మా సంకల్పం. అనతికాలంలోనే అనూహ్యంగా 70,000 ప్రతులతో లక్షలాది జిజ్ఞాసువుల అభిమానాన్ని చూరగొన్న 'శ్రీరామకృష్ణ ప్రభ' ప్రచారానికి మీ వంతు సహకారాన్ని కోరుతున్నాం.

మీ ఆత్మీయులకు, అభిమానులకు 'శ్రీరామకృష్ణ ప్రభ'ను కానుకగా అందజేస్తూ ఈ ఆధ్యాత్మిక 'ప్రభ'ంజనానికి మీరూ చేయూతనిస్తారని ఆశిస్తున్నాం.

అధ్యక్షులు
రామకృష్ణమఠం, హైదరాబాద్

శ్రీరామకృష్ణ ప్రభ

రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్-500 029 ఫోన్: 040-2766 7799, 2763 3936
E-mail : sriramakrishnaprabha@gmail.com

నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

Vol.67-1, Sri Ramakrishna Prabha (Telugu Monthly) January 2010, Regd. with the Registrar of Newspaper for India Under No. 1120/57. Postal Registration No. HD-1071/2010-12. Licensed to Post Under WPP : CPMG/AP/HC-13/WPP/2010-12.

"Are you growing spiritually? Can you love others? Can you feel oneness with others? Have you peace within yourself? And do you radiate it around you? That is called spiritual growth, which is stimulated by meditation inwardly, and by work done in a spirit of service outwardly."

- Swami Ranganathananda

With Best Compliments From

పక్యాల భాస్కర రావు, మేనేజింగ్ డైరక్టర్ & పక్యాల గిరిజ, డైరక్టర్

SVIS LABS
LIMITED

SVISS LABSS LIMITED

(Manufacturers of Active Pharmaceutical Ingredients and Intermediates)

Regd. Off. & Fact. : Plot No.88 & 89, Phase - II,
SIPCOT Industrial Complex,Ranipet - 632 403, Tamil Nadu.
Phone : 04172 - 244820, 651507, Tele Fax : 04172 - 244820
E-mail : rao@svisslabss.net
Web Site : www.svisslabss.net

SVISS LABSS కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.